UNIVERSAL LIBRARY
OU_204819
UNIVERSAL LIBRARY

శ్రీ

అహల్యాశాపవిమోచనము

[ఆఱంకములనాటకము]

గ్రంథకర్త:

పప్పు మల్లికార్జునరావుగారు, బి. ఏ.

ప్రకాశకులు:

అద్దేపల్లి లక్ష్మణస్వామి,

సరస్వతీగ్రంథమండలి,

రాజమహేంద్రవరము

1924.

సర్వస్వామ్యసంకలితము వెల రూ 0—12—0.

—సరస్వతీ గ్రంథమండలి,—

రాజమహేంద్రవరము.

నవలలు—నవరసభరితములగు—నవలలు
ముద్దులైన బొమ్మలతో-ముద్దులొలుకు క్యాలికో బైండుతో
రెండుమాసముల కొక్కటిగా వెలువడుచున్నవి.

నిబంధనలు.

1. ఇందుఁ జందాదారులుగఁ జేరువారు ప్రవేశరుసుము క్రిందముందుగా రు 0-4-0 లు చెల్లింపవలయును.

2. ఇందు రెండుమాసముల కొక్కటిగ వెలువడుచుండు క్యాలికోబైండుగల ప్రతిగ్రంథమును రు 1-0-0 వెలకుఁ జందాదారులకుఁ బంపుచుందుము.

3. గ్రంథములఁ బంపుటకగు పోస్టేజి మొదలగు ఖర్చులన్నియును జందాదారులే భరింపవలయును.

4. చందాదారులగువారు వెనుకటి గ్రంథములన్నియుఁ గొనవలయునను నియమము లేదు. కాని వారు కోరినచో వెనుకటి పుస్తకములు కూడ, చందాదారుల వెలకే పంపుచుందుము. క్రొత్తగ వెలువడుచుండు గ్రంథములు మాత్రము చందాదారులు తప్పక పుచ్చుకొనుచుండవలెను.

5. ఇందుఁ బ్రకటింపఁబడు ననుబంధములు చందాదారులు తప్పక పుచ్చుకొనవలయునను నియమము లేదు. కోరినవారికే పంపుచుందుము

6. సంవత్సరము చందా అనగా ముందు ప్రకటింపఁబడు ఆరుపుస్తకములకు రు 7-2-0 లు ముందుగఁ బంపువారికి ఆరుపుస్తకములవరకు ప్రతిపుస్తకమును అన్‌రిజిష్టర్డు పార్సిలుగా పంపుచుందుము. అట్లు పంపినవారికి ఆరుపుస్తకములకు చెల్లింపవలసిన మనిఆర్డరు కమీషను 0-12-0 లును రిజిష్టరు ఖర్చు 0-12-0 లును రు 1-8-0 కూడివచ్చును.

శ్రీ

అహల్యాశాపవిమోచనము

గ్రంథకర్త:

పప్పు మల్లికార్జునరావుగారు.

మొదటి కూర్పు

ప్రకాశకులు:

అడ్డేపల్లి లక్ష్మణస్వామి,

సరస్వతీగ్రంథమండలి,

రాజమహేంద్రవరము.

1924.

సర్వస్వామ్యసంకలితము.]

[వెల రు 0—12—0.

WITH THE COMPLIMENTS OF
A. Lakshmanaswamy Naidu
RAJAHMUNDRY.

అంకితము.

ఇది శ్రీ కాజులూరుగ్రామప్రతిష్ఠిత శ్రీరామలింగేశ్వరపాదారవిందసమర్పితహృదయబంభరులును, అనవరతవేదవేదాంతాధ్యయనాధ్యాపకులును, తపోనిష్ఠాగరిష్ఠులును, ఉభయభాషానర్గళకవితాధారులును, గానకళావిశారదులును, ద్రావిడాదిదేశీయాంగ్లేయభాషాభిజ్ఞులును ముక్తాఫలసరణీలేఖనాదక్షులునునై యిపుడు స్వర్గరాజ్యసుఖంబు లనుభవించుచున్న మజ్జనకు లగు శ్రీ జగన్నాథశాస్త్రులవారిదివ్యచరణసరోరుహంబులకు భక్తిపూర్వకంబుగా సమర్పితము.

గ్రంథకర్త.

స వ ర ణ.

పేజీ.	పఙ్క్తి.	తప్పు.	ఒప్పు.
15	9	శ్రీయుఁ, బుద్ధియున్	శ్రీనిన్ బుద్ధినిన్
21	7	గుట్టలుం	జాలముల్
39	19	జంతువులు	జంతులు
44	9	వేడె	వేఱె
64	18	నమల	నజ్జ
77	15	దర్శ	దర్ప

28 వ పేజిలో "స్వప్నావస్థ యైననేమి వాస్తవ మైననేమి" యుండ నగు.

పీఠిక.

గతసంవత్సరములో "స్థూలీకృతఛాయారూపనాటకప్రదర్శనము" (సినామాకంపెనీ) వారొకరి "అహల్యాశాపవిమోచన" మను నాటకమును బ్రదర్శింపఁ గాంచి సుప్రసిద్ధ మగుకథ గలయట్టినాటక మాంధ్రంబున లేక యుంట నొకకొంతగా నెంచి యేతన్నాటకరచనకుఁ గడంగితి. కాని రాజకీయవ్యాపారములొందరలచేతను గొన్ని గృహసంబంధపుఁ జిక్కులచేతను బ్రారంభించినప్పుడారుమాసములకుఁ గాని గ్రంథము పరిసమాప్తము కా లేదు. తరువాత సరస్వతీ గ్రంథమండలీస్థాపకులగు శ్రీయుత అద్దేపల్లి లక్ష్మణస్వామినాయఁడుగా రొకనాఁడు కార్యాంతరప్రసంగింబునకు విచ్చేసి నాయొద్ద నున్నవ్రాతప్రతిఁ గాంచి యది నేను స్వీయముగ నచ్చొత్తింపనిచోఁ దమగ్రంథమండలిలోఁ బ్రకటింప ననుమతి నీయవలసిన దని కోరి యుండిరి. మఱియుఁ గత్తు ముద్రితపత్రములు నేను జూడ నక్కఱ లేదనియుఁ దమకార్యాలయమున నున్నయాంధ్రపండితులగు మ॥రా॥ శ్రీ సత్యవోలు అప్పారావుపంతులుగారే చూచెద రనియు రాజకీయవ్యాపారనిమగ్నుఁడ నగునాకు మఱియొకసౌకర్యము కనఁబఱచిరి. అందులకే నియ్యకొనుఁడు నీగ్రంథప్రకటనము తటస్థించెను. ఈయేర్పాటు గావించినందులకు వారి కెంతయుఁ గృతజ్ఞుఁడను. మఱియు ముద్రణమున కిచ్చినవ్రాతప్రతియందు నాలేఖకప్రమాదముల నోర్పుతో సవరణచేసిన అప్పారావుపంతులుగారియెడలను గృతజ్ఞుఁడ నై యున్నాఁడను.

2. కథావిధానములోఁ బై నుదహరించిననాటకప్రదర్శనమునకును మనపూర్వగ్రంథములయందలికథకును గొంచెమువ్యత్యాసము గాన నయ్యెడు. అందు ముఖ్యమైనది యహల్యావిషయము. పూర్వ

గ్రంథములలో మాయారూపమున నున్నయింద్రుని నింద్రునిగా నెఱింగియు నాతనిపొందున కియ్యకొనిన ట్లున్నది. పైనాటకప్రదర్శనములో మాయాగౌతముని మోసము పూర్తి యగువఱకుఁ గూడ నిజగౌతమునిగానే యహల్య యెంచినట్లు జూపఁబడినది. ఈకడపటి మార్గమే సమంజసముగ నుండునట్లు గాన్పించుటచేత నీనాటకమునందుఁగూడ నట్లవలంబింపఁబడినది. కాని య ట్లవలంబించుటచే నహల్యాశాపవిషయంబున దివ్యజ్ఞానసంపన్నుఁ డగుగౌతమున కజ్ఞానమారోపింపవలసి వచ్చును. ఈవిరుద్ధ తొలఁగించుటకై దివ్యజ్ఞానము నిర్మలచిత్తమున్నప్పుడే పొడకట్టు గావున నింద్రద్రోహము కనిపట్టువఱకే యది యుండినట్లును నది మనసునఁ బొడకట్టినవెంటనే క్రోధ మావేశించి గౌతముని సామాన్యమానవునివలె జేసి ద్రోహకారణ మూహింప నవకాశ మియ్యనట్లును దగిన యశరీరవాక్కువలన సత్యము గ్రహించినట్లును నీనాటకమున మార్పఁబడినది. మఱియుఁ బ్రాయశ్చిత్తమాత్రమున కనుటచే నహల్యయు సంతోషపూర్వకముగా తనభౌతికదేహపరిణామ మంగీకరించినట్లు వ్రాయఁబడినది. ఈమార్పులు సరససమ్మత మగు నని నమ్ముచున్నాఁడను.

3. ఈనాటకము ముద్రణమున కిచ్చినతరువాత ఏలూరులో రామనారాయణకవు లనువా రిదివరలోనే యిట్టిది ప్రకటించి యుండుటఁదెలిసి దాని తెప్పించి చూచినాఁడను. ఏకవిషయము వ్రాయుటచేఁ గాఁబోలు కొన్ని భావసామ్యములు రెండింటియందును బొడకట్టుచున్నవి. ఇతివృత్తము భేదముగా నుంటచే ముద్రణము పూర్తి చేయించుటకు నిశ్చయించితిని.

4. నాటకమున పాట లంతగా సరసము లేక పోయినను బ్రస్తుతకాలపురంగస్థలమున నవి ప్రయోగింపఁబడుచుండుటచే గొన్ని సందర్భముల వానిని వ్రాసి యనుబంధముగాఁ జేర్చినాఁడను.

5. నాకు మొదటినుండియు నాంధ్రభాషయం దాసక్తి మెండైనను పాండిత్యము లేకపోవుటచేతను బ్రథమప్రయత్న మగుటచేతను నిందు దోషంబులు దొరలి యుండవచ్చును. గుణలేశంబు లేమేని యున్న నవి కృతిభర్తమహిమవలన ననియు దోషపుంజంబులు కృతికర్తయవజ్ఞతవలన ననియుఁ దలంపఁగలందులకు గుణగ్రహణపారీణు లగువిబుధులకు విన్నవించుకొను చున్నాఁడను.

రాజమహేంద్రవరము,
20-9-1924.

పప్పు మల్లికార్జునరావు.

ఈనాటకమున వచ్చుపాత్రలు

పురుషులు.

గౌతముఁడు—మహర్షి, అహల్యభర్త.

అత్రి—మహర్షి.

బ్రహ్మ—అహల్య తండ్రి.

ఇంద్రుఁడు
యముఁడు
వరుణుఁడు
కుబేరుఁడు } —దిక్పాలురు.

నారదుఁడు—బ్రహ్మకుమారుడు.

నిగమశర్మ
దేవలుఁడు } —గౌతమశిష్యులు.

దశరథుఁడు—అయోధ్యాపురీశ్వరుఁడు.

రాముఁడు
లక్ష్మణుఁడు } —దశరథకుమారులు.

వశిష్ఠుఁడు—పురోహితుఁడు.

సుమంత్రుఁడు—మంత్రి.

విశ్వామిత్రుఁడు—మహర్షి.

మారీచుఁడు
సుబాహుఁడు } —రాక్షసులు.

స్త్రీలు.

అహల్య—గౌతముని భార్య.

శచీదేవి—ఇంద్రుని భార్య.

మనోరంజని—ఇంద్రదూతిక.

తాటకి—రాక్షసి.

శ్రీ

అహల్యా శాపవిమోచనము.

నాంది

ఉ. శ్రీదము లోకకంటకవిదిత్రివిభేదము సాధుమోదముకా
స్వాదువరప్రలుబ్ధబుధషట్పదనాదము వీతఖేదముకా
క్రోధవికారసంభవవినోదము శ్రీహరిదివ్యపాదముకా
సాదృతి నొందు నీనవసుమావళి మీకిడు సర్వసంపదల్.

(అని పూవులు సభ్యులపైఁ జల్లి)

మ. పదియార్వేల వధూమణుల్ గలరు నీభాగ్యంబు నాకొక్కతెక్
ముదమారంగ నొసంగు కృష్ణ యనఁగాఁ బోల్పోలు! గ్రక్కొమ్ము నా
రద నేలేనిగృహంబున్నండి యన నాబ్రహ్మన్నజుండేగి యా
పదియార్వేవురయిండ్లఁ గన్న హరిరూపంబుల్ మిముఁ బ్రోచుతన్

(అని నిష్క్రమించును.)

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి)

ఓహో నేఁడు మహనీయులగు సభాసదులెల్లరు విచ్చేసి నవ్య నాటకదిదృక్షులగుచు కిటకిటలాడునట్లు సభాభవనమిప్పుడే యలంకరించి యున్నారు. ఇఁకఁ దడయరాదు. నటి యింకను రాలేదేమో!

(అని తెరవంక చెవియొగ్గివిని)

ఆహా! ఏమి యీసంగీతము! నటి యొంటరిగా నున్నప్పుడే మిగుల మనోహరముగఁ బాడునుగదా. ఇది స్త్రీజనమంతకును సామాన్యధర్మమేమో! ఓహో ఏమి యీరాగాలాపనము! శ్రోత్రతలను మేఘమండలికిఁ గొంపోయి యువ్వెత్తుగఁ బాలపొంగువలెఁ దోయు నట్లును, శీతలలహరీతరంగమాలికాడోలికానివహంబుల నోలలాడిం

చునట్లును, హిమాంబుపూరధారాసారంబుల మోదుచున్నట్లును బరవశులఁజేయుచున్నది! లలితకళలందు బాలగోపాలము విదితమై వెంటనే యానందమొదవింపఁ జేయుటచే నుత్కృష్టమై సంగీతవిద్య సాటిలేనిదై యున్నది.

సీ. ఆత్మచింతలనెల్ల నణఁగఁ ద్రొక్కఁగఁ జాలు
సంగీతవిద్యకు సాటి యేది
మంచిసంగతులను మనసుఁ బట్టఁగఁ జేయు
సంగీతవిద్యకు సాటియేది
భగవంతునందు సద్భక్తి నాటఁగఁ జేయు
సంగీతవిద్యకు సాటియేది
కలకంఠకంఠుల ఘనత కెక్కఁగఁ జేయు
సంగీతవిద్యకు సాటియేది

గీ. నాదరూపంబు బ్రహ్మంబు నాఁ బనర్చి
చేతనాచేతనంబుల చిత్రగతిని
తాలుమాలుగ వృత్తులఁ దాల్పఁ జేయు
సరససంగీతవిద్యకు సాటి యేది.

ఇప్పుడు ప్రియురాలిరాగాలాపనము పూర్తియైనది. తిరిగి వే రొకటి మొదలిడక పూర్వమే పిలిచెదను.

నటీ. నటీ. కుటిలభ్రూకుటీ! సుగంధబంధురపేటీ.

నటి:—(ప్రవేశించి) ఆర్యపుత్రా, నమస్కారము. మీకు 'టీ' వేళ అయినదా యేమి? అన్ని 'టీ' లతో నన్ను బిలిచినారు?

సూత్ర:—(నవ్వుచు) నాకు వేళకు 'టీ' యీయక పోవుటచేతనే నటివై సార్థకనామముతో నున్నావు. నాయొక్కనిమాట కేమి? ఈసభ్యులెల్లరు నీగానామృతమునకై వేచి యున్నారు. వారి కది శీఘ్రంబుగ నొసంగుము.

నటి:—ఏఋతువును గూర్చి పాడవలెను.
సూత్ర:—సర్వసౌఖ్యప్రదంబగు వసంతర్తువును గూర్చియే పాడుము.
నటి:—చిత్తము.

[లయగ్రాహి]

మల్లెలును మొల్లలును గొల్లలుగఁ బూయఁగను జల్లనగు
తెమ్మెరలు మెల్లఁగను వీవన్
పల్లవములన్ మెసఁగి సల్లలితరావముల నుల్లమలరం బికము
లెల్లఁ దమిఁ బాడన్
ఫుల్లదళజాలముల హల్లకము లన్నియును దెల్లనగు నట్లు కడు
నుల్లసితమౌ జా
బిల్లి వెలుఁగుం దనరఁ బెల్లుగను మోదము ఘటిల్ల ననకాలఋ
ఋతుతల్లజము గాదే.

సూత్ర:—ఆహా! సంగీతమా! అమృతమా! యిది. నీవు కేవలము కోకిలవే।

నటి:—ఆ, ఏమి! నేను నల్లగా నుంటినని యధిక్షేపించుచున్నారా! నేను పరభృతంబనయినచో నన్ను భరించుచున్నమీరుమాత్రమేవిజాతిలోఁ జేరుదురు?

సూత్ర:—ఓహో! "కాకీకోకిలచందమాయె గదవే కాంతామనస్నేహముల్" అను పామరలోకోక్తికి మనముభయులము గురియగుచున్నాము. కలకంఠివలె హృద్యముగా గానముచేసితివన్నందులకు నింతగాథ పెంచి నన్నుదూషింప మొదలిడితివి. నీయట్టి విపరీతజ్ఞానముగలస్త్రీలు పెక్కండ్రిక్కాలంబున బయలువెడలఁ బతివ్రతాధర్మంబులడుగంటుటచేతనే యీసభ్యులు నన్నిపుడొక పతివ్రతాచరిత్ర నాటకమాడ నాజ్ఞాపించి యున్నారు. అందుచేత నిప్పుడేకథనాటకమాడిన బాగుండునో చెప్పుము చూతము.

నటి:—ఆర్యపుత్రా! స్త్రీలలోఁ బతివ్రతాధర్మములఁ గంటినచోఁ బురుషులలోమాత్రము దైవభక్తి పూజ్యమగుచుండుట లేదా? అందుచేత భగవన్మహిమప్రకటిత మగునాటక మేదైన నాడ వలసినదిగాఁ గొందఱు స్త్రీసభ్యులు నాకాజ్ఞ యిచ్చినారు.

సూత్ర:—ఔను, అదియునవసరమే. అందుచే భగవన్మహిమయుఁ బాతివ్రత్యమును బ్రకటిత మగునాటక మాడుదము.

నటి:—అట్టిది యేది గలదు?

సూత్ర—(ఆలోచనమభినయించి) అహో! నీమంత్రాంగమూలమున నెట్టికథ జ్ఞప్తికి వచ్చినది! అందు నొకదివ్యమైన పతివ్రతాచరిత్ర ముండుటయే కాక భగవంతుని నంపూర్ణావతారములోని కొంత మహిమగూడ ననుసంధింపఁబడినది. అది యేదియో చెప్పుకొనుము చూతము.

నటి—సరి యింకను దెలియకుండునా? "అహల్యాశాపవిమోచన మేనా?"

సూత్ర—అబ్బా! ఆవులించిన ప్రేవులు లెక్కపెట్టుదానవు నీకుఁ దెలియకుండునా! నిశ్చయముగా నదియే. (అని యాశ్చర్యముతో నటివైపు చూచుచున్నాఁడు)

నటి—ఏమట్లు తెప్ప వాల్పక నావైపు చూచెదరు. మీ సమస్య లు మీకే గాని మఱియెవరికిని దెలియవనుకొన్నారా యేమి?

సూత్ర—అందుచేతఁ జూచుచుండుట లేదు. సంగీతసాహిత్యవిశార ద వగునీకిట్టి సంగతులు తెలియవని గాదు. నేను నీవొనరించు కొన్న యపూర్వాలంకారశోభ చూచిచూచి తనివినొందకు న్నాఁడను"

గీ. సుందరాంగి నహల్యను జూచి చూచి
సకలఋషిగణమును దేవనికరములును

విస్మయానందమగ్నులై నృత్తు వెడల
బ్రహ్మసభలోనఁ గొలువున్నపగిది గాదె.
ఇఁక బోవుదము రమ్ము.

(అని నిష్క్రమింతురు.)

ఇది ప్రస్తావన.

శ్రీ

అహల్యా శాపవిమోచనము.

ప్రథమాంకము.

(సత్యలోకము. బ్రహ్మదేవుని కొలువు. మునీశ్వరులు దేవతలు నుపవిష్టులై యుందురు. అహల్య బ్రహ్మప్రక్కను గూర్చుండి యుండును)

బ్రహ్మ — మునీంద్రులారా, దిక్పాలురారా, యీ నిఖిలచరాచరవస్తుప్రపంచంబున సృష్టి సతతంబు గావించుచున్నను తృప్తి లేక యొకయపూర్వరూపరేఖావిలాసవతి యైన స్త్రీరత్నంబు సృజింప నిశ్చయించినవాఁడనై నాసృష్టిచాకచక్యము లోకమునకు జూపింపఁ దలఁచి యహల్య యను నీకన్యకామణిని నిర్మించినాఁడ. సత్కావ్యమును రచించిన కవీంద్రునివలెను సుందరప్రతిమను విలిఖించిన చిత్రకారునివలె నీ సృష్టిచే సంతుష్టాంతరంగుఁడనై గర్వపడుచున్నాఁడను. కాని వనితలు బాలప్రాయంబునఁ దలిదండ్రుల కత్యంతానందకారిణు లయ్యు, యౌవనప్రాదుర్భావంబునఁ గొంతవిషాదకారిణులు గాక పోరు. అయ్యది వరాన్వేషణవిషయంబున నని మీకెల్లరకుఁ దెల్లమే కదా.

చ. సుతఁ జిరరూపవంతుఁడొ విశుద్ధకులప్రభవుండొ విద్యలన్
గఱచినవాఁడొ ధర్మపథగామియొ భూతిసమన్వితుండొ భా
సురయశుఁడో వరుండనుచుఁ జూచుట నైజము కన్నవారికౌ
నరసి వచింపుఁ డట్టి సుగుణాన్వితు నీభువనాళి నెల్లెడన్.

నార: — తండ్రీ, మీవంటి జగత్కర్తలకే యీవిషయ మింత యాలోచనీయమై మనోవ్యాకులత కలిగించుచున్నచో సామాన్యసంసారుల కెట్లుండునో గదా!

మ॥ నవమాసంబులు మోచి కాంచి రుజలన్ బాయంగ రక్షించి యి
ష్టవరంబుల్ సమకూర్చి పెంచి యటుపై సంసారభారంబు దా
ల్ప వరాన్వేషణ సేయుచో జనకు లే పాట్లొందఁ బాలాదురో
భువనంబుల్ సృజియించు నీకె యిటులై పుట్టంగసాదేహముల్.

అయినను త్రికాలజ్ఞుండ వగు నీకన్న నీవిషయంబున నిర్ణయింప సమర్థుండెవండు ?

అత్రి:—ఔను, ఈనారదుఁడు చెప్పినది లెస్సగా నున్నది.

బ్రహ్మ:—ఎవ్వరికేని స్వవిషయంబున మతి పరిభ్రమించి సరియైన యూహకు రానీయదుగదా. అందుచే స్వముఖంబున కద్దంబు వలె స్వవిషయంబున కితరులయాలోచన యావశ్యకమై యున్నది.

ఇంద్రు:—దీనికై యింత యాలోచన యేటికి ? సకలక్షోణీధరపక్షక్షోదదక్షం బయిన దంభోళిచే జంభాసు రాదినిఖిలరాక్షసవీరులఁ దున్మాడి త్రిలోకరాజ్యం బనక్రవిక్రమలీల నేలుచు సవనతంత్రంబులన్ హవిర్భాగంబులు గొనుటలోఁ బ్రాముఖ్యత గాంచిన యీ దేవేంద్రున కొసంగినచో నీనందననందనోద్యానంబున నమందానందంబున విహారంబు సలుపుచు దేవతాసహస్రంబుచే నూడిగంబులఁ గొనుచు సుఖింపఁగలదు.

యముఁడు:—అఖండబ్రహ్మాండజీవరాసుల పుణ్యపాపవిభాగంబులు నిష్పక్షపాతంబున నొనర్చుచుఁ బాపులఁ జండశాసనంబున దండించుచు నుత్తములఁ బుణ్యలోకంబుల సమస్తసౌఖ్యసంపదలం దేల్చుచు సమవర్తి యని ధర్మమూర్తి యని ఖ్యాతి వహించిన యీదండపాణిదండ నండగొనినచో నీదుహిత సమస్తహిత సహిత యగునని నమ్ముము.

వరుణుఁడు:—విధాతా. నీవుజలజోద్భవుండవు నేను జలాధిపతిని.

మనకిదివఱకే సంబంధముకలదు. నాసఖ్యంబు లేనిచో నీ యిల్లు నిలువ నేరదు. మఱియు నేను విజృంభించినచో నీనప్పులపాల గుదువు. గనుక యీకన్యకామణి నొసంగి ముందు నాయిల్లు నిలువం బెట్టుము.

కుబేరుఁడు:—ఓహో! ఆగుమాగుము. ధనదునిస్నేహం బుండిన నప్పులపాలెట్లు గాఁగలఁడు. 'ధనమూలమిదంజగ' త్తను న్యాయంబున ధనముగలవానికే సర్వసౌఖ్యములును మహాపద్మాదినవనిధుల కధీశుండనై యక్షరాక్షసగంధర్వాదులచే సంసేవితుండనైన నన్ను బరిణయంబగుచో నిఖిలైశ్వర్యంబులఁ దులఁదూఁగుచు సమస్తభోగంబుల నీపుత్రిక యనుభవింపఁగలదని వేఱె నుడువవలయునా?

గౌతముఁడు:—చతురాననా! ఈయైశ్వర్యంబులు నీభోగంబులు తపస్సామర్థ్యంబున కెనగావు. తపోబలము గలవారికెట్టి దుర్ఘట వస్తువైనను స్వాధీనమగుటయేగాక శాశ్వతానందప్రదాయకత్వముఁగూడఁ గలిగియుండు ననుసంగతి నీకనుభవైకవేద్యమే. నిగ్రహానుగ్రహసమర్థత కూడఁ గలిగి యుండుటచే నట్టివారెల్లరకుం బ్రభువులె గౌరవపాత్రులగుచున్నారు. మఱియు నీయహల్య రూపసంపదయందే గాక జ్ఞానసంపదయందుఁగూడ సామాన్యస్త్రీలోకంబు నతిక్రమించుటచేత నొకతపస్వి పరిగ్రహింప యోగ్యత గలది.

ఇతర మునులు:—ఔనౌను, గౌతముఁడు చెప్పినదెంతయు యథార్థము

నార:—(తనలో) ఈగౌతముఁడు తర్కశాస్త్రవేత్త. యుక్తివాక్యములలోఁ దీసిపోవువాఁడు గాఁడు. అయిన నిట్లడిగి చూచెదఁ గాక. (ప్రకాశముగా) ఆర్యా, గౌతమా, విరాగులై తపోవృత్తినున్న వారికీఁ గన్యకామణులతోఁ బనియేమి? కామాద్యరిషడ్వర్గంబుల

జయించి నిశ్చలమనస్కులై యున్నవారికే గదా నిర్విఘ్నముగాఁ దపంబు సాగుట.

ఇంద్రు:—(తనలో) ఈనారదుఁడు మంచిప్రశ్న వేసినాఁడు. దీని కేమి సమాధానమువచ్చునో చూతముగాక.

గౌత:—నారదా! తపోధర్మముప్రవ్రజులకే నియమింపఁబడి యుండ లేదు. గృహస్థులధర్మముకూడ నై యున్నది. నిక్కముగాఁ జతురాశ్రమంబుల నున్న వారికినిఁ గలదు. ధర్మపత్నిని స్వీకరించుట కామాద్యరిషడ్వర్గంబులకు లోనైనట్లెంచకూడదు. గృహస్థాశ్రమధర్మంబుల కని యెఱుంగునది.

నార:—అట్లయిన నొకానొక కన్యయే కావలెనను విచారమెందులకు? ఏకన్యయైననేమి?

గౌత:—అట్లుగాదు. ఈపరమేష్ఠిచే సృష్టంబయిన జీవరాసులలో జ్ఞానంబునుబట్టి యనేకయంతరంబులు గలవు. ప్రత్యక్షముగాఁ బాషాణమునందున్నప్పటికంటెఁ దరుగుల్మలతాదులయందును, వానియందున్నప్పటికంటె జంతువులయందును, జంతువులయందుకంటె మానవులయందున్నప్పుడు జీవుఁడు క్రమక్రమముగా నెక్కుడుజ్ఞానుండయి యుండుట యనుభవసిద్ధమేకదా. తదుపరియును బ్రవృత్తినివృత్తిమార్గానుసారులగు జీవులు క్రమంబున జ్ఞానాధికులై యుందురు. ఒకేజ్ఞానాంతరమందున్నవారికొకే విధమగు నభిరుచులు నలవాట్లుఁ గలిగి యుందురు. అట్లగుటం జేసి యట్టిస్థితియందున్న స్త్రీపురుషులు దాంపత్యవశంబున జ్ఞానాభివృద్ధి గావించుకొని పరస్పరోత్కర్షమునకుఁ గారణభూతులగుదురు. కావున నేదోయొక స్త్రీని వివాహమాడక సమానజ్ఞానాంతరముగలస్త్రీని వివాహమాడుట పురుషునకును, అట్టిపురుషుని వివాహమాడుట స్త్రీకిని గర్తవ్యమై యున్నది.

అహ:—(తనలో) ఈఋషికుమారుఁడు పాషాణంబులఁగూడ జీవుఁడున్నాఁడనుచున్నాఁడు. ఆస్థితియందు జీవుఁడెట్లుండునో, ఎండల కెండుచు వానలకుఁదడియుచు వానిబాధల గ్రహింపఁజాలునో జాలఁడో తరువాతఁ దండ్రిగారి నీయంశమడిగి తెలిసికొందును గాక.

నార:—తండ్రీ, మీరడిగినవిషయములో నీమునీంద్రులును దిక్పాలకాదిదేవతలును నన్యోన్యకనిష్టపడక యెవరికివారే పెండ్లికొడుకులై కూర్చున్నట్లు గన్పించుచున్నది. కావున వీరిలో సమర్థుఁడెవఁడో నిర్ణయించుటకై యేదేని నొకప్రతిజ్ఞ నిర్వహింపనియమించుట యుచితమని నాకుఁ దోఁచుచున్నది.

బ్రహ్మ:—ఔను. అట్లనే కావించెదను (ఆలోచనమభినయించి) సభ్యులారా, యీనాప్రతిన వినుండు.

చ. కలుషహరంబు ముక్తిదము కామ్యసుఖావహ మాత్మబోధనా
విలసిత మంచు నెంతయును విశ్రుతమౌ ధరణీప్రదక్షిణం
[illegible]ఘుగతిఁ జరించియు రయంబున నెవ్వఁడు ముందువచ్చు వాఁ
డలికులనీలకుంతల యహల్యకరంబును బట్టఁ బాత్రుఁడౌ.

అత్రి:—ఓహో, బహుదుర్ఘటముగా నున్నదే. యోగబలము గలవారికి గాని యొరులకు సాధ్యము గానట్లు తోఁచు చున్నది.

ఇంద్రు:—ఇది యెంతపని!

(పంచచామరము) విమానగామినై చరించి వేగమా ధరాస్థలిన్
క్రమానఁ జుట్టి వచ్చి పద్మగంధి హస్తమొందనా
యుమేశుఁడున్ రమేశుఁడున్ నిజోరువాహనంబులన్
సమానులేమి నాకు మేఘసంగతుండనైనచో.

(తనలో) ఆహా! ఏమి యీయహల్య సౌందర్యముచూచుటకీ రెండునేత్రములు చాలకున్నవి. శరీరమంతయు నేత్రములైనచో

నొక్కమాఱు సర్వాంగసౌందర్యము నిలుకడగాఁ జూచి తృప్తిపొం
దుదు నేమో!

యముఁడు—

శా. క్ష్వేళారావసదృశమై విమతహృత్సీమప్రభేదంబునై
చాలన్ మ్రోగెడు ఘంటికానినదమున్ సంధిల్ల గ్రీవంబునన్
హేలన్ అంకెలు వైచుచున్ భువనము ల్గత్యంబు వేంచేయుచో
నాలంబోర్వక యేగు నామహిషవాహంబుండ జంకేటికిన్.

నాకంటె ముందెవ్వఁడు వచ్చునో చూచెదగాక.

వరుణుఁడు—ఆ. వె. క్ష్మాతలంబుకంటె జలరాసులే యెక్కు
వై తనర్చు భూమియందు గాన
భూప్రదక్షిణంబు ముందుగా నాకంటె
సలిపి మగుడి రాఁగఁ జాలు నెవఁడు.

కుబేరుఁడు—కం. నాపుష్పక ముండంగా
నీపృథివిం జుట్టి వచ్చు టెంత యిప్పుడె నే
నీపద్మాక్షికరంబున్
బ్రాపింపఁగ క్షణములోన వచ్చెదఁగనుఁడీ.

గాత—(ఏదో యాలోచించి తలపంకించి యూరకుండును)

బ్రహ్మ—ప్రస్తుతమీసభ చాలింతము.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రథమాంకము.

అహల్యాశాపవిమోచనము.

(విష్కంభము)

(భూలోకము. గౌతమశిష్యులగు దేవల నిగమశర్మలు ప్రవేశించుచున్నారు.)

దేవ—ఏమోయి నిగమశర్మ, అంతయదావడిగఁ బరుగెత్తుచున్నావు. ఏదైన విశేషమున్నదా యేమి యీవేళ?

నిగ—ఓహో, దేవలా నీవేనా, అదావడికేమి యున్నది. గురువుగారిమధ్య సత్యలోకమున కేగి యుండుటచేతఁ బాఠాలు సరిగా జరుగలేదుగదా. ఇప్పుడు తిరిగి వచ్చినారు గనుక చదువుకొందామని వెళ్ళుచున్నాను. కాని నీవెప్పుడు వచ్చినావు. గురువుగారు వెళ్ళగాఁ జూచి యిట్టే తుఱ్ఱుమని పాఱిపోయినావు.

దేవ—ఇప్పుడే వచ్చుచున్నాను. తొందరపని యుండి వెళ్లినానురా. లేకపోయినచో నాశ్రమమునుండి కదులుదునా? కాని గురువుగారెవతెనో దేవలోకపువేశ్యను దీసికొని వచ్చినాఁడనుకొనుచున్నారేమిటి?

నిగ—ఛీ; నిర్భాగ్యుఁడా! వేశ్యకాదురా; కళ్లనుగాళ్లు నుండఁ జూచుకో, గురుపత్నిదూషణ!

దేవ—అదేమిటో చెప్పకుండఁ దట్టెడవేమిటిరా? గురుపత్ని యెవరు? గురువుగారికింకను బెండ్లికాలేదే.

నిగ—మొన్న సత్యలోకములో నయినదిరా. బ్రహ్మమానసపుత్రికయయిన అహల్యను వివాహము చేసికొన్నారు. ఆమె యెంతో రూపవంతురాలు శ్రీమహావిష్ణువు జగన్మోహినీఅవతారమును మించవలె ననుపట్టుదలతో నామెను బ్రహ్మ నిర్మించినాఁడఁట. మూర్ఖులెవ్వరో వేశ్యయని నీతోఁ జెప్పియుందురు.

దేవ:—దానికేమిలే. బ్రహ్మదేవుఁడు తనకూఁతు నిచ్చుటకేమాత్రి

పువాఁడు పదునాలుగులోకాలలో నెవరునుగనఁబడలేదా యేమి? లేక ఆమెయీాయన అష్టైశ్వర్యములు చూచి వలఁచి వచ్చినదా!

నిగ:—ఛీ? నోరుమూయి. గురువుగారిసత్త్వ నీకేమి తెలియును. ఆయన బ్రహ్మదేవునిప్రతిజ్ఞ చెల్లించి మఱియు వివాహమాడినారు గాని మఱియొకలాగునఁగాదు. ఈభూప్రదక్షిణము ముం దెవ్వరు చేసివత్తురో వారికిఁ దనకుమార్తె నిచ్చెదనని బ్రహ్మ శపథము చేసినాఁడు. అదివిని దేవతలు మునీశ్వరులు తమవాహనబలంబులు యోగబలంబులు పక్షిబలంబులు చూపుచు వెళ్ళినారు. గురువుగారు సకలశాస్త్రవేత్తగాపున బాగుగా నాలోచించి యక్కడ నప్పుడే యీనుచున్న ద్వీముఖియై యున్న గోవును జుట్టి మూడుమారులు తిరిగి భూప్రదక్షిణముచేసి వచ్చితిని అహల్య నిమ్మని యడిగెనఁట. అందునకు బ్రహ్మ సంతసించి కుమార్తె నిచ్చి వివాహముచేసెనఁట. ఇదివిని దేవతలలోఁ గొందఱు కొఱకొఱలాడఁ జొచ్చిరఁట. ఇదియథార్థము.

దేవ:—ఓహో! మంచియంత్రము వేసినాఁడే. ఓరీ. యిట్టి యంత్రములే మనము గురువుగారి యొద్ద నేర్చుకోవలెనురా, చదువు మాటకేమి ప్రాప్తముండిన నదే వచ్చును. రాకపోయిననునరే.

నిగ:—ఓరి నిర్భాగ్యుఁడా! ఇట్టి యంత్రాలు మాత్రము చదువు లేనిదే వచ్చునఁటరా! ఎంత శాస్త్రప్రమాణము చూపించి బ్రహ్మదేవుని సభలో నీయుక్తి చెప్పి గురువుగారు నిగ్రహించుకొని వచ్చినారో యెఱుఁగుదువా? చదువురానిదే యెందునకుఁ బనికిరావు.

దేవ:—అటులయిన నట్టియుపాయములకుఁ బనికి వచ్చు చదువేదో యదియె చెప్పుడనుము గురువుగారిని. దానికేమిగాని గురువుగారిభార్య మంచిదేనా? దయాంతఃకరణలు గలదేనా?

పైపటారమేనా ?

నిగ:—'ఆకారసదృశోగుణాః' అన్నట్లామెరూపమునకుఁ దగినట్లే గుణములుకూడ నున్నవిరా. బ్రహ్మదేవుని యొక్కసృష్టి యైన తరువాత దేనిలోనైన లోపముండునా? మొన్ననువచ్చినదో లేదో అప్పుడే యెన్నాళ్ళనుండియో పరిచయమున్నట్లు మునిపత్నులందఱితోడను స్నేహముగా మాట్లాడుచు మనశిష్యులనందఱిని బుత్రులనలెఁ జూచుకొనుచు నన్నపానాదులు వారి యనిదే తాను గ్రహింపదు. శిష్యులమాట యెందుకు ? ఆశ్రమమందున్న లేడిపిల్లలకును లతకూనలకును ముందు నీళ్ళు పోయక తాను త్రాగదు. మహాపతివ్రత. తనయొడలిమీఁద నున్న మిక్కిలివిలువగు నాభరణంబులు మృదుదుకూలములు నాశ్రమమునకు వచ్చిన వెంటనే తనభర్తయుక్తికి ననురూపముగా నుండవని యెంచి మునిపత్నులకిచ్చివైచె. తాపసస్త్రీలకుచితమగు వేషముతో నున్నది. ఇంక నెన్నియో గుణములున్నవి. నాసారమున కాలస్యమగుచున్నది. పోవుదము రా, సావకాశముగాఁ జెప్పెదను.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు)

ఇది విష్కంభము.

శ్రీ

అహల్యాశాపవిమోచనము.

ద్వితీయాంకము.

(గౌతమాశ్రమము, గౌతముఁడు కృష్ణాజినముపైఁ గూర్చుండి జపముచేసి కొనుచుండఁగా అహల్య యగ్నిహోత్రముచేసి పూజాద్రవ్యము లుంచును. గౌతముఁడు జపము చాలించి యగ్నిని బూజించి హోమము చేయును

గౌత:—(లేచి) అహల్యా! అగ్నిభట్టారకునకుఁ బ్రదక్షిణముచేయుదమురమ్ము. ఉభయులును బ్రదక్షిణము. చేసి యగ్నికెదురుగాఁ జేతులు జోడించుకొని నిలుతురు.)

శా. ఓ తేజోనిధి! సర్వలోకభరణా! యోయుజ్వలాకార! యో
శ్రౌతస్మార్తక్రియాలవాల! హరనేత్రా పావకా రక్షకా
సీతోసాటియె వేల్పులెవ్వరును శ్రీయుఁ బుద్ధియుఁ సత్త్వముఁ
చేతస్స్థైర్యము నిచ్చి బ్రోవగదవే శ్రీహవ్యవాహా! నమః.

(అని పూజించి కొన్నియక్షతలు తనశిరసున నుంచుకొని మఱికొన్ని యహల్యనెత్తిపై వేయును.)

అహ:—నాథా! ఈయాసనమున విశ్రమించి కొంచెము గోక్షీరములఁ గైకొనుఁడు. కాలాతిక్రమము మైనట్లున్నది.

గౌత:—అట్లనే గావించెదను. (అసికృష్ణాజినాస్తరణమగు నున్నతాసనమున గూర్చుండి యహల్య యిచ్చిన పాలలో సగము మఱియొకపాత్రమందుఁ బోసి) ప్రియసీ! ఇవి నీవు కూడ గ్రహింపుము. పరిచర్యలచే నలసి యుందువు.

అహ:—నాథా! నాకిప్పుడక్కఱలేదు. అవి యన్నియు మీరు గ్రో

హింపపుడు. పరిచర్యలు సలుపుటలో శ్రమము లేకపోవుటయే గాక మఱింత యుత్సాహముగా నున్నది.

గౌత:—అయినను నీవుకూడఁ దీసికొనినగాని నాకు సంతుష్టి కలుఁగనేరదు. నా యభీష్టము నెఱవేర్పుము.

అహ:—మహాప్రసాదము. అట్లనే చేసెదను.

(ఉభయులు పాలు త్రాగుదురు.)

గౌత:—అహల్యా! నీవేమహారాజునో లేక నిన్ను వరింపనెంచిన యేదిక్పాలకునో పరిణయమైనచో నీకెంత కష్టములు లేక సుఖింతువుగదా. వారియునికికి మాయునికి నెంతయంతరముగలదు?

సీ. చంద్రశిలాకీర్ణసౌధముల్లేవుగా
శాంతమౌ మునిపర్ణశాలగాని
తళుకుహంసతూలికాతల్పముల్లేవుగా
వరకుశానిర్మితాస్తరణగాని
వీనులవిందుగా గానముల్లేవుగా
స్వాధ్యాయమంత్రఘోషంబెగాని
పరిచారికాజనవ్రాతముల్లేవుగా
సారంగశాబకసమితిగాని

గీ. అకట! సీరూపమునకుఁ బ్రాయంబునకును
దగిన యునికియె చాలవ్యత్యాస మయ్యె
కష్టవృత్తిని గాలంబు గడుప నయ్యె
కలికి! ననుజెట్ట బట్టిన కారణమున.

అహ:—ప్రాణనాథా! ఏమిట్లనుచున్నారు? నేనేమి యపరాధ మొనర్చితిని? నాపనులయందెచ్చటనైన బ్రమత్తురాలనై యవివేకముచే మసలితినా యేమి? అజ్ఞానకృత మేదైన నున్న క్షమించి తెలియఁజేసి యీదీనురాలి విచారము తొలఁగింపుఁడు.

కలలో నైన నీయున్కి కష్టముని భావింప లేదే. ఇది వినుము.

సీ. మేడలు మిద్దెలు నీడౌనె విమనని
ప్రాణేశుతోడి సంవాసమునకు
హంసతూలికశయ్యలౌనె సుఖంబులై
పతిపాదపద్మసేవనముకంటె
విమలసంగీతంబు వీనులవిందౌనె
పతిమృదుహితవాక్య ఫణితికంటె
పరిచారికాదుల భాగ్యంబు సమమౌనె
స్వయముగాఁ బతిసేవ సలుపుటకును

గీ. అకట! క్షణభంగురంబులౌ నైహికముల
తగులకయె శాశ్వతానందదాయకమగు
పథముఁ దెల్పెడు మిము చెట్టఁ బట్టి యుంట
కేమి నోచితినో తొలిబామునందు.

ఈరీతి నెప్పుడు తలపోయుచుందునుగాని కష్టమనునది స్వప్న మందైనను గాంచకున్నదానను. నాథా మీకిట్టి సందేహము కలిగించిన నాయపరాధ మేదియో సెలవిచ్చి కృతార్థురాలిం జేయుదురు గాక.

గౌత:—ప్రియసీ! నీవేయపరాధము నొనర్చి యుండలేదు. నీచిత్త వృత్తి నరయఁ గోరి యట్లంటిని. నిజముగా నీకాభోగంబులే కావలయునెడల నవి మాత్రము కొఱంతలే. ఇదిగో చూడుము. నా తపోమహిమ (అని నేత్రములకుఁ గమండలములోని జలము రాయుచున్నాఁడు) చూచితివా.

మ. అవిగో చూడుము భర్మహర్మ్యములు నేత్రానందమౌ రత్నదీ
పవితానంబదె, తూఁగుటుయ్యేలలు మేల్పర్యంకజాలంబులు
య్యవె, భూషాపరికరంబులయ్యవె, దుకూలౌఘంబులవ్వే, నఖి
నివహంబుల్ గను మిష్టమున్న నిలుమీ నిత్యంబుగా వానితోఁ.

అహ:—ఆహా ఏమి యీయాశ్రమము ! సమస్త వైభవంబు లొక్క క్షణములోఁ బరికల్పించితి కే. కాని కృత్రిమంబు లగునానగర రామణీయకములకంటె నీయాశ్రమమందలి ప్రకృతిదేవతసహజ సౌందర్యమే నాకెక్కుడుప్రీతి గొల్పుచున్నది.

గౌత:—అట్లయిన నాసృష్టి యిప్పుడే లయింపఁజేసెదను గనుము.

(అనిమంత్రజలంబులఁజల్లును)

అహ:—ఓహో యెంతలో మటుమాయమైనది ! దానివలని సౌఖ్యములు నశ్వగదా ! నాకవియంతగా రుచింపవు.

గౌత:—ఔను. తామరపద్మమే గృహముగా నేర్పరుచుకొన్న మహానుభావునికూఁతురవునీకుకృత్రిమనిర్మాణము లెట్లురుచించును?

(తెరలో)

అయ్యా, గౌతమాశ్రమ మెక్కడ ? ఎంతదూరము నడిచినను గానరాకున్నదే ! ఆఁకలిబాధచేతఁ గృశించుచున్నారము. ఎక్కడ గౌతమాశ్రమము ? ఎక్కడ గౌతములవారు ?

చ. ఇరువదినాల్గువత్సరము లేగె చినుకున్న నబ్దముదు వేన్
గుఱియుటలేదు తాపములు ఘోరములై భువినిండె నెంతయున్
ధరఁగల ప్రాణికోటి కడు తల్లడమందెను క్షుత్పిపాసలన్
మరణపుబాధ చెందుచును; మన్నవె యన్నముపెట్టి గౌతమా.

అహ:—(లేచిచూచి) అయ్యో, ఎవరునాయనలారా ! మీరు గౌతమాశ్రమము వెదకుకొనుచున్నారు. ఇదే గౌతమాశ్రమము రండి. ఇటు ఇటు. మీకుఁ గావలసినంత యన్నము పెట్టెదను రండు.

(అంతటఁ గొందఱుక్షైతులు ప్రవేశించుచున్నారు)

బాబో రక్షించండి? రక్షించండి (అనిసాగిలఁబడుచున్నారు)

గౌత:—లెండు, లెండు మీకేభయమును లేదు. కూర్చుండి సావకాశముగా మీవృత్తాంతము దెల్పుఁడు

పరిధముఁడు—చ. ఇరువదినాల్గువత్సరములేగ.........

(అనుపూర్వోక్తపద్యమునుఁజదువుచున్నాఁడు)

ఋషిసత్తమా! మేమాంధ్రదేశీయులము రయితులము. ద్వాదశవర్షక్షామంబులు పట్టి వర్షములులేక పంటలన్నయేమో యెఱుఁగక యన్నవస్త్రంబులు లేక యెంతయో కృశించి యున్నవారము.

సీ. పంటభూములు బీడుపడి బ్రహ్మచెముడుతో
నిండె దుష్టభుజంగనివస మగుచు
పచ్చికతావుల గచ్చపొదల్ గ్రమ్మె
కూరపెరళ్ళ పల్లేరు లలమె
కూపతటాకముల్ పాపుమాయుచు నింకె
దప్పికన్ బక్షులు ధరణి గూలఁగ
పశువులఁ డొక్క లప్పడములగతి నెండె
వంటపొయ్యలు బూజు పట్టి యుండె.

గీ. తాప మగ్గలమయి ప్రజ తహతహ పడె
ఆధులును వ్యాధులును బట్టి యడఁచె జనుల
జీవనమె దుస్సహంబయి చెన్ను దక్కె
కటకటా! ఏమివర్ణింతు క్షామబాధ.

గౌత:—ఏలయింత చిక్కుపడుచున్నారు? నాయాశ్రమంబున నెన్ని దినములయిన మీరాలుబిడ్డలతో నెంతమందయైన నుండవచ్చునే. నేనను దినము తపంబునకుఁ గూర్చుండుటకుమున్న పుడిసెడువిత్తనము లీవనస్థలిని జల్లుదు. అవి పరమేష్ఠివరప్రసాదంబుచే నాతపంబు ముగియుసరికి మొలకలెత్తి ఫలించి యాహారమొసఁగుచున్నవి. దాని నెందఱో యనుభవించుచున్నారు. మీరు నట్లు చేయుఁడు.

ద్వితీయుఁడు—ఆర్యా, మామనవి వినుఁడు. మీరు సెలవిచ్చిన మార్గము మాకు సంపూర్ణసౌఖ్యము నీయఁజాలదు. ఎంతకాలము మాజన్మభూమి విడిచి యొకగృహస్థునియింట తినుచుఁ గూర్చుండఁగలము. మాయింట మేముండి గంజిత్రాగుచున్నను అది షడ్రసోపేతభోజనముగా నుండును. ఒకరింట షడ్రసోపేతముగాఁ బెట్టినను బెక్కుదినంబు లుంటకు మనసమంగీకరింపదు. మేమజ్ఞానుల మగుటచేత నిట్లు మోటుతనముగాఁ బల్కుచున్నందులకు క్షమింపుఁడు.

గౌత:—అట్టులయిన నన్నిప్పు డేమిచేయు మనెదరు? మీయభిప్రాయమేమి?

ప్రథముఁడు—మహాప్రభో! మాకోరిక యేదనఁగా మాకీ యనావృష్టి యధికవృష్టి బాధలతో నిమిత్తము లేకుండ శాశ్వతముగా నన్నము పెట్టింపుఁడని.

ద్వితీయుఁడు—తుదకన్నమున్నను లేకపోయినను స్నానపానాదులకు లోపములేకుండఁ దగినంతతీర్థవసతినైనఁ గలిగింపఁ గోరుచున్నాము.

గౌత:—ఓహో! మీభూములు దేవమాతృకలుగా నుండక నదీమాతృకలుగాఁ జేయుమని మీకోరికయా? అది బహుదుర్ఘటమే (అనికన్నులుమూసికొని యాలోచించి) సరే తెలిసినది. మీకోరిక నెఱవేఱును లెండు. నేను వెంటనే తపంబున కరిగి పరమేశ్వరు ప్రార్థించి యాతని జటాజూటమున నున్న గంగను బడమటికనుమల ప్రాదుర్భవింపఁజేసి మీదేశములగుండ ప్రవహింపఁజేసి సాగరసంగమమగునట్లు చేసెదను. అయ్యది గోదావరి యనుపేరితోఁ బరగుచుండు. ఇది యంతయు వారముదినములలో జరుగును లెండు. మీయిండ్లకుఁ బొండు.

పథికుఁడు—స్వామీ మహాప్రసాదము. మహాప్రసాదము. మాకు గావలసినదదే. ఆనదికి తమనామధేయ ముంచుకొని గౌతమి యని తరతరంబులదనుక వాడుకొనుచు సుఖింపఁ గలము. మాకింక సెల వొసంగుఁడు.

గౌత:—గోదావరిచేఁ బవిత్ర మగుమీదేశము ముం దెట్లుండునో తెలియఁ జెప్పెద వినుండు.

ఉ. ఎచ్చటఁ జూచినం గనుల కింపగుధాన్యపురాసిగుట్టలుం
బచ్చికపట్లు నిర్మలజలంబులు తీయనిపండ్లతోఁటలుఁ
మచ్చిక హాయిగా దిరుగుమందలు గూడినగోగణంబుతోఁ
హెచ్చగు సంపదల్ గలిగి యింద్రపురంబును ధిక్కరించెడుఁ.

రైతులు—అబ్బో అంతభాగ్యమా మాకు అంతభాగ్యమే. ఏమో మీరు దైవముతో సమానులు ఏమిచేసినను జేయఁగలరు.

గౌత—ఇప్పుడంతభాగ్యమా యనుచున్నారు. పట్టిన తరువాత నన్ను మఱచుటయేగాక నాసంతతివారిని దృణీకరించుస్థితికిఁ గూడ మీలోఁగొందఱు వత్తురు. ఇఁక ప్రొద్దుపోయినది. మీరు పొండు.

రైతులు—మీయన్నము తినుచుఁ మిమ్ము మఱచి నట్లయినఁ గళ్ళను గాళ్ళ నుండఁ జూచుకోవద్దా బాబూ? సెలవియ్యండి.

అహ—ఆఁకలిగొనియున్నామంటిరి. అన్నముతినిపొండు.

రైతు:—అమ్మా, మాకు శాశ్వతముగ నన్నము పెట్ట వరమిచ్చియే యున్నారు. ఇంక వేరె యన్న మిప్పుడు వలదు, తల్లి.

అహ:—అట్లయిన నీక్షీరంబయిన ద్రాగుఁడు.

(అని అందఱకును బాత్రలతో క్షీరమిచ్చిన త్రాగుదురు)

రైతు:—అమ్మా, నీయాదరణవల్లను నీక్షీరములవల్లను మాకుఁ గడుపునిండినది. సెలవిమ్ము పోయివచ్చెదము.

శ్రీ

అహల్యా శాపవిమోచనము.

తృతీయాంకము.

ప్రథమరంగము.

(స్వర్గలోకము, ఇంద్రసదనము. ఒక యాసనముపై నింద్రుఁడు గూర్చుండియుండును)

ఇంద్రుఁ:—(స్వగతము) ఔరా, బ్రహ్మయెంతవాఁ డన్యాయమున కొడిగట్టుకొనుచుండఁగా నిఁక లోకములో ధర్మదేవత నాలుఁగు పాదములతో నెట్లుండఁ గలదు. ఒకపాదము కుంటియయినది. తనకన్య నితరులకీయ నిష్టములేకున్నచో నొక్క గౌతమునే పిలిచి యొసంగరాదా. ఏల యీనట్టి శపథములు చేయుట? దూడ చచ్చిన చేటపెయ్య సమర్చినట్లు భూప్రదక్షిణ మొనరింపలేక గోప్రదక్షిణ మొనర్చి తత్ఫలమే యొసంగు నని మూలనున్న యేదో శాస్త్రము చూపించినంతమాత్రమున యుక్తాయుక్తములఁ బరిశీలింపక కన్య నొసఁగుట యేటిన్యాయము? అక్కటా! అడవులలోని యాకలములఁ దినుచుఁ బర్ణశాలల నివసించు జడదారి యెక్కడ? చతుర్దశభువనసమ్మోహనం బగు నాయువతీరత్న మెక్కడ? ఇట్టి విరూపఘటనలచేతనే యీవిధాతకు నితరదైవములవలె లోకపూజ్యత లేకపోయినది.

సీ. కడుదరిద్రునకిచ్చు గంపెడు పిల్లల
　　　　భాగ్యవంతుని ననారోగ్యుఁ జేయు
　లోభివానికి ద్రవ్యలాభంబు సమకూర్చు
　　　　మూర్ఖున కధికారపూర్ణ మొసఁగు

వ్యభిచారికి లభించు పరమపతివ్రత
చక్కని భార్యయగా వంచనకును
విద్వాంసు నెప్పుడు విత్తహీనునిగఁ జేయు
నర్థహీనునకు మూహాలు ఘటించు

గీ. తెలివిగలవాని కోపిక గలుఁగకుండు
ప్రేమఁ జూపెడు పితరుల విడుచు కొడుకు
నిట్టి విపరీతఘటనల సృష్టి చేయు
కతన ధాతకుఁ బాజ్యత గలుగ దయ్యె.

సరే, ఇఁక గడచినదానికి వగచినఁ బ్రయోజన మేమి? అకాంత యన్యకాంతయైనప్పుడు నేను విముఖుఁడ నగుటయే న్యాయము గదా. ఆహా! అట్లుండ సాధ్యమగునా?

సీ. పూర్ణేందుబింబమై మోము గ్రాలక యున్న
వగవక విముఖుండ నగుదునేమొ
తళుకుఁజూపులు లేళ్ళ నళికింపకున్నచో
వగవక విముఖుండ నగుదునేమొ
దరహాసచంద్రికల్ తాపమార్పక యున్న
వగవక విముఖుండ నగుదునేమొ
పొలఁతి మేనిపసిండివలపు లొలయకున్న
వగవక విముఖుండ నగుదునేమొ

గీ. చెలువ చెలువంపుసృష్టి యై చెలఁగకున్న
వగవకుండఁగ విముఖుండ నగుదునేమొ
సుదతి పను దమిచూడ్కులఁ జూడకున్న
వగవకుండఁగ విముఖుఁడ నగుదునేమొ.

ఉ. ఆయలినీలకుంతలముఖాంబుజ మాయధరోష్ఠబింబ మా
తోయజనేత్రవైభవము తోరపుజన్నవంబిక మానితం

బాయతవేణి యూహాూయలోయూరపునెన్నడ లాయమాయికం
బాయసితేకుణాబు లహాహా! మఱువంగ వశంబె యెన్నఁడేఁ.

శచీదేవి:—(వెనుకనుండి ప్రవేశించి) నానాథుఁడేదియో యాలో
చించుచుఁ బల్కుచున్నాఁడు. ఈమఱుఁగున నుండియే వినెదను.

ఇంద్ర:—ఈచతుర్దశభువనంబులలో నట్టిసౌందర్యరాశి విని కని
యెఱుంగనుగదా!

శచి:—(తనలో) ఎవ్వరిసౌందర్యరాశి? పురుషుఁడా? స్త్రీయా
పురుషులు సామాన్యముగాఁ బురుషసౌందర్యమంతగాఁ బ్రశం
సింపరు. స్త్రీయే యై యుండినోపు. నన్ను వివాహమాడిన కొ
లఁదిదినము లిట్లు ప్రశంసింపుచు వచ్చినను, జిరకాలపరిచితనగు
టచేతను స్వీయనగుటచేతను నిప్పుడీపొగడ్త నన్నైయుండదు.

ఇంద్రు:—కాకిముక్కునకు దొండపండు గట్టిన ట్లీజడదారి కట్టియు
వతీరత్నమా?

శచి:—(తనలో) ఓహో! ఏవరో తాపసపత్నినిగూర్చి ప్రశంసిం
చుచున్నాఁడే! ప్రమాదము వచ్చునట్లున్నది. ఎవరామె? ఎవ్వ
రైననేమి? జడదారి కామె తగదనుచున్నాఁడు గాని తాను వ
లఁచినట్లు చెప్పియుండలేదు. ఇంకను నిదానించి వినియెదగాక.

ఇంద్రు:—ఆనిర్భాగ్యుఁడగుగౌతముఁ డెక్కడ? త్రిలోకాధినాథుఁ
డనై శతక్రతువుల నొనరించిన నేనెక్కడ? నన్ను గామించిన
వనితను గుయుక్తిచేతఁ గదా సాధించినాఁడు. ఇందులకుఁ బ్రతి
యుక్తి నేనుమాత్రము పన్నలేనా? బృహస్పతితో నాలోచించిన
చక్కని యాలోచన చెప్పఁగలఁడు. కాని యీసంగతి వెల్లడిం
చిన యెడల నాయనకే యాస పుట్టునేమో. రహస్యాలోచనమె
ప్పుడు నతిబుద్ధిమంతునితోఁ జేయరాదు. ఆత్మబుద్ధియే సుఖమై
నది. నేనే యాలోచింతును.

శచి—(తనలో) సరే, ఇఁక దెలిసినది. బ్రహ్మదేవునిచే నహల్య గౌతమమహర్షి కీయఁబడినదని యీనడుమ వింటి. నా నాథుఁడు గూడ నప్పుడా లోకంబున కేగినాఁడు. ఆమెయందు వలపు దగిలియుండవచ్చు. ఆమె కడురూపసి యఁట.

ఇంద్రు:—హా! అహల్యా! నా దాన వైతి వనుకొంటిని. ఎంతలో దాటిపోతివి! ఎక్కడ దాటిపోదువు? తనువులు దూరమైన మనసులు దూరమా? నా డా సభలోఁ గ్రేగంటి ప్రసారంబున నీమక్కువ నాకుఁ దెల్పనే తెల్పితివి. నేను నీకై యిట్లు పరితపించుచుంటిని. మనసులు కలిసినప్పుడు శరీరములు మాత్రమెంత కాలము దూరముగా నుండునో చూచెదఁ గాక. ఫలప్రాప్తికిఁ బిపీలకమార్గము విహంగమార్గము నని రెండు తెరువు లిదివఱకే యేర్పడినవి. అందుఁ గడపటిది శ్రేష్ఠతరముగాన విమానముపై క్షణములో నిటకుఁ దెత్తును. ఆపై నావజ్రాయుధమున్నది. (అనికన్నులుమూసికొని) అదిగో! అహల్య ఎంతస్ఫుటముగాఁ గాన్పించుచున్నది!

గీ. ఏల యిటునటు తారెద వింద్రుఁ డిదిగో
లలన నినుజూడఁ గనులు గాయలుగఁ గాచి
వేచి యుండెను జాలంబు విడిచి యిపుడె
బిగ్గఁ గౌఁగిటఁ జేర్పుమీ బిసరుహాక్షి!

(అని చేతులుఁచాచుచున్నాఁడు.)

శచి:—(ఇంద్రునిచేతులనడుమఁ బ్రవేశించి) ఇదిగో వచ్చితిని.

ఇంద్రు:—(దిగ్గున లేచిచూచి వెలవెలబోయి) ప్రాణేశ్వరీ! ఎంతసేపై నది నీవువచ్చి?

శచి:—నాథా, మీరహల్యాస్తవమారంభించు నరికే వచ్చియుంటిని.

ఇంద్రు:—(తనలో) ఓహో ప్రమాదము వచ్చినదే. ఇప్పుడేమని

చెప్పుదును. (ప్రకాశముగా) సఖీ! మానవకోటి నిద్రయందు సుఖించుచుండునని పలుమారు చెప్పగా విని యాసుఖమెట్టిదో చూడవలెనని నిద్ర కల్పించికొంటిని. అందు స్వప్నము వచ్చి గౌతముఁడు, అహల్య బ్రహ్మ మున్నగువారందఱితోడను నేను బ్రహ్మసభలో నున్నట్లును నేదోవాదము జరుగుచున్నట్లును గన్పడినది. అదిస్వప్నావస్థ గాని వాస్తవముగాదుసుమా.

శచి:—ప్రాణేశ్వరా, స్వప్నావస్థయైన నేమి! మీయభీష్టమే నాయభీష్టము. మీకిష్టులలో వారే నాకునిష్టులు. కాని యొకవిన్నపము చేసికొనుచున్నాను. అది విని మీయిచ్ఛ వచ్చిన తెఱంగునఁ జేయుఁడు. మీకీదేవలోకంబుననే రంభాద్యప్సరస్త్రీలు పలువురు కలరు. వారియందఱికంటె నధికమని యొకమర్త్యభామిని నెంచి తలపోయుట భ్రాంతియని తలఁచు చున్నాను. అయినను దావలచినది రంభ యగు. ఒకరికంటె కొకరింపుగా గాన్పించిన గాన్పించవచ్చును. కాని మగనాలై తదుపరి మహామహిమ గలగౌతమునిపత్నియై యున్నయాపతివ్రతాశిఖామణిని జెనక నుంకించుట మనకెంతయో యనర్థదాయకమని బెగడొందుచున్నదానను. అయ్యది హాలాహలము మ్రింగుటయు నగ్ని నొడిగట్టుటయు నగును. సర్వజ్ఞులకు మీకు నేనేటెంగించునంతటిదానను గాను గాని మోహావివశతచే నియ్యది స్ఫురింపలేదేమోయని విన్నవించుకొనుచున్నదానను. ఇంతకన్న నిరంకుశం బగుమీచిత్తవృత్తి కడ్డురాఁ జాలను.

ఇంద్రు:—ప్రేయసీ! పలనన్నిట్టి నిష్ఠురోక్తుల నలయించెదవు. రంభాద్యప్సరోగణంబేల? నీకంటె నీమూఁడులోకంబుల నాహృదయమాకర్షించిన వారొండు గలరా? స్వప్నావస్థలో నేదో పల్కినదాని కేలయిట్లాడెదవు? రమ్ము నందనోద్యానంబునఁ

గొంత సేపు విహరింతము. (అని చేయిపట్టుకొని నడుచుచు) (తనలో) ఆహా! యీహస్త మహల్యాహస్తమైన నాయానంద మెట్లుండును! అయ్యది యెట్లు లభించును? (ఆలోచనమభినయించి) విశ్వకర్మకూఁతు రగుమనోరంజని యిట్టికార్యములందు నిపుణత గలది. ఆమెవలన సాధింతును గాక.

(నిష్క్రమించుచున్నారు)

తృతీయాంకము.

౨ రంగము.

(గౌతమాశ్రమము—పర్ణశాల.)

అహల్య:—గృహయజమానుఁ డింటలేనపుడు గృహకార్యము లెంత జాగరూకతతో నిర్వహించుచున్నను నిండు లేకుండును. నానాథుఁడు పశ్చిమపుకనుమలకుఁ దపస్సున కేగి వారముదినములకు వత్తునని యెంతయో యాశగఁ బల్కినాఁడు. నేటితో వారమగును. ఈరాత్రియో రేపొ తప్పక వచ్చును. నేఁడు కాకి పలుమాఱు లఱచినది. ఎవరు వత్తురో. అతిథిపూజనంబులఁ గడుమెలంకువతోఁ బ్రవర్తిల్లుమని నాకాజ్ఞ యొసంగినాఁడు. నే నీకార్యము లెఱుకువలెఁ జేయుచుండినను నాతఁడింటలేనప్పుడు చేయుట కెంతయో భీతికలుగుచుండును.

క. కడు సులభం బగుకార్యము
బెడిదం బగుయాజమాన్యవిధిచేఁ జేయన్
గడు దుష్కరపుం బనియును
గడ తేర్చఁగ నోను భర మొకండు వహింపన్.

(మనోరంజని ప్రవేశించుచున్నది.)

మనో:—(తనలో) ఆహా! ఈమెయే కాఁబోలు నహల్య. నిశ్చయము

గా విష్ణునిజగన్మోహనావతారంబును మించి యుండవలె నని పట్టినశపథ మానలువ నెఱవేర్చికొన్నాఁడు. ఆసుదాననగు నాకే యీామె వలపు గొలుపుచుండఁగా మహేంద్రు సంతటివాఁడే మెక్కె పలవించుట వింతయేమున్నది. కాని దుర్ఘట మగునీదూతికాకార్యమొకటి నాపైఁ బెట్టినాఁడు. ఇటు జూడ మహాతపస్వి భార్య. అటు జూడఁ ద్రిలోకాధీశ్వరుం డగునింద్రునాజ్ఞ. ఎటుల నెఱవేర్తునో తోఁచకున్నది. అయినఁజూచెద గాక (ప్రకాశముగా) అమ్మా గౌతమాశ్రమ మిదేనా.

అహ:—(లేచిచూచి) అమ్మా. ఇదే. దయచేయుము. నేనొసంగు నాతిథ్యము గైకొమ్ము.

మనో:—నాకేమియు నక్కఱలేదు. నేఁడు భట్టారకవారము. నీకై నను ద్రాగినను. కొంచెము పరుండుటకు మాత్రము స్థలమిమ్ము.

అహ:—అమ్మా అభ్యంతరమేమి? ఈయాశ్రమమెల్ల నీయధీనంబుగా నెంచుము. రమ్మా. ఇటఁ గూర్చుందుదము. (ఇద్దఱును గూర్చుందురు.) నీవిట్లొంటిగఁ జనుదెంచుటకుఁ గారణమేమి? ఎచ్చటనుండి యెచ్చటికిఁ బోవుచుంటివో నీవృత్తాంతము నాకెఱింగింప నచ్చునేనిఁ గొంచెమెఱింగింపఁ గోరుచున్నదానను.

మనో:—నీకెఱింగించుట కభ్యంతరమేమున్నది. ఏమోకాని నిన్ను జూచినప్పటినుండియు నాసోదరిని జూచినంత నిర్భరానందము గలుఁగుచున్నది. నేను స్వర్గలోకవాసినిని. విశ్వకర్మకూఁతురను. మనోరంజని యందురు. ఇంద్రకార్యార్థినై యొకచోట కేగుచు ప్రొద్దుగ్రుంక నిచటకువచ్చితిని. గౌతమాశ్రమము భయరహితమని సుప్రసిద్ధము గదా. ఆయన యూరలేరనివిందు. నీవెక్కడ శయనింతువు?

అహ:—అమ్మా! నీవు నాకలోకవాసివై యుంటఁ గడుంబూజ్యురా

లవు. నన్ను సోదరీభావమున జూచుచుంటివి గాన నీసమ్ముఖముననే వసియుండెదను.

మనో:—మంచిది. నాకది పరమసంతోషము. (ఉస్సురనుచు) ఆహా ఏమిదైవఘటన !

అహ:—ఏమి మనోరంజనీ, యట్లనెదవు? శయనప్రదేశము సరిలేదనియా? నీకేమికావలసిన నది తెప్పింతును.

మనో:—నాకేమి కావలెను? నాకన్నియు సరిగనే యున్నవి. రాజాంతఃపురముల కుసుమకోమలుల శిరములందెక్కి ప్రకాశించవలసినపుష్పమడవిలో నొక్క మోటుభూజము నాశ్రయించుకొని యుండుటఁజూడ విచారమగుచున్నది.

అహ:—అదేమి? నీమాటలుచూడవింతగానున్నది. ఎంత సుందరమైన పుష్పమునకైనను మొదట నీవన్న మోటుభూజమునాశ్రయింపకయే రాజాశ్రయము గల్గునాయేమి? నీకంతవిచారముగానున్నచో నాసుమంబుం బరిగ్రహించి యుచితస్థలంబునం జేర్పరాదా?

మనో:—(తనలో) ఓహో! రూపసంపదయేగాక ప్రౌఢత్వముగూడ గలిగినజాణవలెఁ దోఁచుచున్నది. కార్యము సఫలమగుచున్నట్లున్నది. (ప్రకాశముగా) ఆహా! నీయనుజ్ఞపడయనిదే యేసుమనంబైనఁ బరిగ్రహింపఁగలనా?

అహ:—ఈయాశ్రమమెల్ల నీయధీనమని యిదివఱకే చెప్పియుంటిని గాదా?

మనో:—ఓహో! నీరూపసంపదకుఁ దోడు జ్ఞానసంపదకూడ నిట్లద్వితీయంబుగ నుండుటచేతనే మహేంద్రుఁడు నిన్నుగూర్చి సదా పలువరించుచుండును.

అహ:—అదేమి? మహేంద్రుఁడేల పలువరింపవలెను?

మనో:—సదా కన్నులకుఁ గట్టినట్లుండఁగా నెవరు పలువరింపరు?

అహ:—అట్లుండుటకు నన్నాయన యెక్కడ జూచెను.

మనో:—బ్రహ్మసభలో నీవివాహమునకుముందే చూచెను. నీవు నాయనను జూచి వరించియు మీతండ్రిగారి శపథమువలన మఱియొకరిపాలైతివి. ఇఁక నతివిస్తరమెందుకు. చెప్పెద వినుము. అమరవల్లభునకు సదా నీనామస్మరణము నీరూపచింతనముఁదక్క నొండువ్యాపారము లెవ్వియు లేవు. మూఁడులోకంబులకాదు ఈచతుర్దశభువనంబులఁగూడ నీయట్టిసృష్టివిచిత్రము లేదని వచించుచుండు. నిన్నుజూడవలెనను వాంఛ మిక్కుటమై పదిదివసంబుల నుండి చింతామణీపీఠ మధిష్ఠించుటయే లేదు. నందనోద్యానమందలి కల్పతరుప్రసూనములఁ గూర్చినశయ్యయింతయు సుఖమియ్య జాలదయ్యె. నీరూపవయోవిలాసములకు హాయిగా స్వర్గసుఖంబులనందక యేల యీనట్టడివి వ్రతోపవాసాదులచే శుష్కించి గాసిల్లెదు! కొంచెమాలోచన వలదా? ఇంతకాలముపేక్షింతువా? నీకనుసన్నల మెలఁగువాఁడే మహేంద్రుఁడు. ఇప్పుడైన నేమి? జాగుసేయక సౌఖ్యమందుము.

అహ:—చాలుచాలు నీసంభాషణ.

శా. ఏమేమీ నను చుల్కఁజేసి యిటు లీవీక్షించెదే, వారకాం
తామాత్రింగఁ దలంచితో నను మదిన్ నానాథుఁడున్ విన్నసు
త్రాముండున్ మఱినీవు నేమగుదురో ధర్మంబులన్నీడి మీ
మీమాహాత్మ్యములెల్ల మంటగలియన్ మేలౌనె యిట్లాడఁగన్.

మనో:—అమ్మా కోపగించుకొనకుము క్షమింపుము. నీసౌఖ్యముఁగోరి చెప్పితిని గాని మఱియొకటి కాదు. ముల్లోకముల కధిపతియైన యింద్రునంతవాని నీవిట్లు తిరస్కరింతు వనుకోలేదు.

అహ:—తిరస్కరించుట లేదు. దుస్సాధ్యముగుకోరికలఁ గోరుట

యనుచితమని నామనవిగా నిట్లు పురందరునితో నుడువును.

ఉ. సుందరుఁడైన చంద్రు నటు సూచుటె గాని నశింపె ముద్దిడన్
అందని ద్రాని పండులకు నఱ్ఱులు సాచిన లాభమౌనె యే
మందు వివేకమిల్ల నడుగంటును కాముకపాలి కయ్యయో
నందనమాచరింతు నిఁక వద్దను మిట్టి వృథాప్రయత్నముల్.

మనో:—పోని మ్మాయనమాటకేమి గాని నీనింకుజన్మన మిట్లడవిపా ల్సేయ వలసిన దేనా. సుఖాపేక్ష లేదా?

అహ:—అమ్మా నీకేమి యీవెఱ్ఱి! నేను కష్టపడుచుంటి ననుకొనుచుంటివా? నాకున్న సుఖము మీస్వర్గలోకమం దేకాంతకును లేదని నమ్ముము. మీరచ్చట ననుభవించునది సుఖాభాసము గాని యథార్థసుఖము గాదు. నిరంతరపతిపాదపద్మసేవవలన గలుగు సుఖమింతింతనరాదు. అందును గౌతముఁడు మహానుభావుఁడు. మాహాత్మ్యంబున నింద్రాదిదేవత లాయనకుఁ సరిపోల్పఁ దగరు. ఇఁక ప్రొద్దు పోవుచున్నది. ఈవిషయంబులును బతివ్రతాధర్మంబులును మనము పరుండి మాట్లాడుకొందము లోనికిఁ బోదము రమ్ము.

(తీసికొనిపోవుచున్నది.)

తృతీయాంకము.

రంగము. 3

(స్వర్గలోకము ఇంద్రుఁడును మనోరంజనియుఁ జెరియొక యాసనముపైఁ గూర్చుండియుందురు.)

ఇంద్రు:—మనోరంజనీ, నేటిదినము తెల్లవారుసరికి వచ్చెద నని చెప్పి యేల యింతతడవు చేసితివి? గడియ యొకయుగ మన్నమాట మఱచితివా? నీవిప్పుడు రాకున్న యిఁక నీయింద్రుని జూడఁగలుగుదువో లేదో

మనో:—మహేంద్రా! ఇప్పటికైనను వచ్చితిని సంతోషింపుము. ఆదుర్మార్గులు వెనుక తఱుముకొని వచ్చుచున్నారేమోయని యింకను గుండెలు తడతడ కొట్టుకొనుచునే యున్నవి.

ఇంద్రు—(ఆత్రముతో లేచి) ఎవరా దుర్మార్గులు? ఏదీ వజ్రాయుధము.

మనో—ఇచ్చటెవరును లేరు కూర్చుండుము. నేనంత చేతకానిదాననైనప్పుడుగదా నీవజ్రాయుధమునకుఁ బని. ఎవరో మారీచసుబాహు లనురాక్షసులఁట. నేనొంటరిగా వచ్చుచుండుట జూచి తమయేలిక యగురావణుని యీడ్జయైనదని నన్ను బట్టుకొని గొంపోనఁ దొడఁగిరి.

ఇంద్రు—ఆ, ఆ, ఎంతప్రమాదము, ఎంతప్రమాదము! అప్పుడు నిన్ను రక్షించు వారెవరు? నన్నెంతగా నిందించియుందువో! కాని నేనుండినచో నాదురాత్ముల నాఖరతరాసికి వెంటనే బలి యిచ్చి యుందును. ఈరాక్షసులు మొదటినుండియు బరస్త్రీలఁ జెఱపెట్టి లోకమున కుపద్రవములఁ గావించుచున్నారు. కాని యెట్లు తప్పించుకొంటివి?

మనో—బుద్ధిబల ముపయోగించినఁ దప్పించుకొనుట కేమికష్టము. నన్ను వాండ్లు తీసికొనిపోవుచుండఁగా, ఓరీ మీకుఁబెండ్లి యైనదా యనియడిగితిని లేదని చెప్పిరి. అందుపైన మీరు నన్ను రావణునికడకేల గొంపోయెదరు. మీలో నొకరు వివాహము కారాదా అనియంటిని. అది వినినతోడనే వారునన్నొకచోటఁ గూర్చుండఁబెట్టి నేను వివాహమాడెదను. నేను వివాహమాడె దనని వాదులాడఁ జొచ్చిరి. తుదకు నీవెవరి వివాహమాడెదన ని నన్నడిగిరి. నేనందుపై మీలో నెవ రాగిరి శృంగంబున కేగి ముం దిటకు వత్తురో వారిని బెండ్లియాడుదు నని చెప్ప వారెదుట

గవ్యూతిమాత్రదూరమున నున్నకొండవైపు పరుగిడఁ జొచ్చిరి. నేను రివ్వున మింటికెగసి యిటకు బాఱి వచ్చితిని.

ఇంద్రు—ఓహో, ఎంతచమత్కారము చేసితివి! నాకై యిట్టికష్టముల పాలగుచుంటివి. నీఋణ మెట్లు తీర్చుకొందును. కాని నీవేగిన పని యేమైనది? కాయా పండా?

మనో—అంతగా కాయయు గాదు, పండును గాదు. దోరగాయవాటముగా నున్నది.

ఇంద్రు—అనగా?

మనో—దేవరపై మనసుండియు నహల్యకుఁ బతిభీతి మెండుగా నుండుటచే నంతస్పష్టముగా నంగీకరింపకున్నది.

ఇంద్రు—ఆసంగతి నీవెట్లు కనిపెట్టితివి.

మనో—ఇదిగో మీతో నిట్లని నుడువుమన్నది.

ఉ. సుందరుఁడైన చంద్రు నటు చూచుచు గాని వశంబె ముగ్ధకున్
అందని మ్రానిపండులకు నఱ్ఱులు సాచిన లాభమానె యే
మందు వివేకమెల్ల నడుగంటును కాముకపాలి కయ్యయో
యందనమాచరింతు నిఁక వద్దను మిట్టి వృథాప్రయత్నముల్.

దానియర్థమేమో మీరేయాలోచించుకొనుడు.

ఇంద్రు—ఔను బాగుగా గనిపెట్టినావు. సాధ్యము కాకుండటచేత మానుమన్నదిగాని సాధ్యమైన యెడలఁ దనయభ్యంతరము లేదనియే స్పష్టమగుచున్నది. సరి. ఇఁకనేమి చేయుమనెదవు.

మనో—రాయబారమువలన సందిగ్ధస్థితికి వచ్చినప్పుడు స్వయముగ నేగినఁ గార్యసాఫల్యమౌ నని తోఁచుచున్నది.

ఇంద్రు—సందేహమేమి? నేను నట్లే చేయఁ దలఁచుకొంటిని. కాని నీవు ప్రియురాలిహృదయక్షేత్రము దురూహాకంటకోన్మూలితముగను, విషమస్థితిరహితంబుగను జేసితివిగదా.

మనో — ఆ, చేసితిని. తరుణమున దేవరవారు కృషిఁ జేసిన యహల్యా స్థితిమాఱి సత్ఫలమిచ్చుటయే యిఁకఁ గొదువ.

ఇంద్రు — అది యెంతపని చూతువుగాని ప్రస్తుతమీపారితోషికము గ్రహింపుము (అని బహుమతియొకటి నిచ్చుచున్నాడు.)

మనో — మహాప్రసాదము.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

శ్రీ

అహల్యాశాపవిమోచనము.

చతుర్థాంకము.

రంగము. ౧

(గౌతమాశ్రమము.)

అహల్య—(పుష్పమొకటివాసనజూచుచు) ఆహా! ఏమి యీమాలతీపుష్పసౌరభము! తన్ను రెండుపూటల నీరుపోసి పెంచినందులకై మంచిపరిమళముగల పూల నొసంగి యీమాలతీనికుంజము తన ఋణము మళ్లించుకొన్నది. అటులనే యీమల్లెపందిరియు విరుల గంపలతో నొసంగి యాశ్రమంబున నెల్లెడల నామోదంబు సమకూర్చుచున్నది. మఱియు నీనారికేళంబులసరసతకు మేరయే లేదు. ఎప్పుడో చిన్ననాటను బోసిన జలంబామరణాంతము శిరంబున మోచి పెంచినవారిక స్వాదునీరంబు లొసంగు చున్నవి. అచేతనంబులే యిట్లు కృతజ్ఞత చూపుచుండగా జ్ఞానముగల మానవజాతి యప్పుడప్పుడు కనబరచు కృతఘ్నతఁ జూడ నాశ్చర్యమగుచుండును గదా. నేనిప్పుడిఁకఁ దడయరాదు. దేవతార్చనకుఁ గావలసిన సుమంబులఁ గోసికొని యగ్నిహోత్రంబులకై యిదివరకే కూర్చియుంచిన సమిధలఁ దీసికొని సత్వరంబునఁ బర్ణశాలం జేర్పవలయు. (అనికొన్నిపువ్వులు సజ్జలోనికి గోసి సమిధలకట్ట బుచ్చుకొనగాఁ గొందఱు శిష్యులు ప్రవేశింతురు.)

శిష్యు—అమ్మా! యీశ్రమ మీకు వలదు. మేమిందరము శిష్యుల ముండగా మీరేల యిట్లు శ్రమపడెదరు.

అహల్య—నాయనలారా! నాకు శ్రమలేకపోవుటయే గాక యిట్టికార్యములయందు మొదటినుండియు నభిలాష మెండగుటచే నిట్లు చేయుచున్నాను, గాని మఱియొకటి కాదు. మీరు పోయి మీ పాఠములు వల్లించుకొనుడు.

శిష్యు—మేమట్లు పోవువారము కాము. నీవు జాగ్రతపఱచిన సుమంబులను సమిథలనైన నిటుదెమ్ము. అవి తీసికొని యేగెదము. తల్లీ! గురుశుశ్రూష లేక మాకుఁజదువువచ్చునా? (అనిపూలసజ్జయు సమిథలకట్టయును దీసికొనిపోవుచున్నారు.)

అహ—ఇఁక తొందర లేదు. ఈయారామరామణీయకము కొంతసేపు కనులపండువగఁ జూచి మఱియేగెదను. ఓహో! పచ్చని పట్టుపఱుపులవలె నున్న యీపచ్చికప్రదేశముల శృంగారమేమి! అందుఁబూచినగడ్డిపువ్వు లాకసమందలి నక్షత్రములవలె విరాజిల్లుచున్నవి. నికటంబునఁ బారు నిర్మలములైన కాలువజలంబులు గులకఱాళ్ళపైఁబడి ప్రవహించునపుడు చేయు గలగలధ్వనులు పుష్పమరందాస్వాదనచే మత్తిల్లి చేయు భ్రమరముల ఝంకారంబులతోఁ గలిసి పరభృతసంగీతనాదంబులకు శ్రుతిప్రాయంబులై శ్రుతిపేయంబు లగుచున్నవి. అవిగో! వాయువశంబున నెంతుటాకులు చేయుమర్మరధ్వనుల కులికిపడి చెంగుచెంగున లంఘించు మృగశాబకంబు లెంతసొగసుగా నున్నవి! ఆహా! ప్రకృతిదేవతాసౌందర్యమే సౌందర్యము! ఈరమణీయప్రకృతివస్తువులనడుమ నెంతకాలంబున్నను నాకుఁదనివి తీరకున్నది. అదిగో! ఆకసమునుండి యేవియో హంసలు దిగుచున్నట్లున్నవి. కావు కాదు. తద్రూపంబుననున్న యొకవిమానము. అందెవ్వరో దివ్యపురుషుఁడున్నట్లు తోఁచుచున్నది. ఈగౌతమక్షేత్రసౌభాగ్యంబు చూచుటకై కాఁబోలు మెల్లమెల్లన ననతిదూరంబున

నీవనముపై సంచరింపుచున్నాను. అదిగో! విమానము. వనము నతిక్రమించినది. ఇఁక దానితోఁ బనియేమి. నేఁడీలతాకుంజంబు లసంఖ్యాకంబులుగఁ బుష్పములు బూచి యున్నవి. దేవబ్రాహ్మణసమారాధనకుఁ గావలసినవి గాక మిగిలినవి నానాధునిశయనస్థలం బలంకరించి మృదులంబగునట్లు చేసెద.

(అనిపువ్వులు గోయుచుండును.)

ఇంద్రుః—(వేఱొకవైపునుండి విమానము దిగి ప్రవేశించి) ఓహో! ఏమి యీగౌతముని తపఃప్రభావము

సీ. కరిసంఘములతోడఁ గలసి యాడెడు సింహ
చయములు మిక్కిలి చనువుతోడ
గోవులగంగడోల్ గోకుచు కండూతి
వాయంగ జరియించు వ్యాఘ్రగణము
లేడిపిల్లలఁ గూడి లీలావిహారముల్
సలుపుబెబ్బులులక్కజముజనింప
అజశాబకంబుల నరమరలేకుండఁ
దుత్రిళ్ళుచునాఁడు తోడేళ్ళసమితి

గీ. పిల్లులెలుకలకును దిండి పెట్టుచుండు
ఫణిఫణంబుల క్రింద కప్పలువసించు
క్రూరజంతువులు సహజంపువైరముడిగి
శాంతతవహించు నిట్టులాశ్చర్యమొదవ.

మఱియు నీపుష్పారామంబులు, ఛాయాతరులు, ఫలవృక్షంబులు నెంతయు కందోయికి విందొనర్చుచు నందనవనాసందంబు డింపుపఱుచుచున్నవి. అదిగో! అనేకపుష్పాపచయంబొనర్చుచు బెదరులేడిచూపులఁ జూచు నాహారిణాంకవదన యహల్య ఆతరుమూలమున డాగి యదను వేఁచి ప్రత్యక్షమయ్యెదగాక (అని యొకచెట్టు

చాటున నిలిచి యహల్యపై పూవువిసరును.)

అహ:—(అదరిపడి.) ఓవృక్షరాజమా! నీనిర్హేతుకమైన కటాక్షంబున కేనెంతయుఁ గృతజ్ఞురాలను. నీసుమంబుల నాపైఁ జల్లి వృథసేయుటకంటె నాహృదయప్రియుం డిటకు వచ్చినపు డాయన పాదములపైఁ జల్లి కృతార్థత నందరాదా? స్థానరరూపునకు వివేకమెక్కడ?

ఇంద్రు:—నీహృదయప్రియుండు స్వయముగనే నినుఁబూజించుట కిటకు వచ్చి యుండగా నీవృక్షరాజ మాతనికిఁ దోడ్పడి కృతార్థత జెందినదిగా భావింపుము.

అహ:—ఎవరిదీ యశరీరవాక్కు (అని యిటునటు పరికించి చూచి) ఎవరును గాన్పించుటలేదే. నామనోహరుండిటకు వచ్చిన నాకుఁ గన్పడకుండునా?

ఇంద్రు:—(తనలో) నన్నే స్మరించుచున్నదని తలఁచెదను ప్రవేశించుటకిదే మంచిసమయము (ప్రకాశముగా) తలోదరీ! నీకు గన్పడకుండ నీప్రియుఁ డెంతసేపుండఁగలఁడు? పొద్దుతిరుగుడుపువ్వు సూర్యుఁ డెటుతిరిగిన నటేతిరుగునుగదా! (అనిమొకటనిలుచును)

అహ—(ఉలికిపడిదూరసరిలుచు) అయ్యా! మీరెవరు? స్త్రీలొంటరిగనుండుచోటున నిట్లుహఠాత్తుగా వచ్చుట యుచితమా?

ఇంద్రు—తరుణీమణీ!

మ. మూఁడు లోకములందు నెవ్వని పూజసేయ ననారతం
బీడులేని సమస్తవైభవ మెవ్వఁడొందును? శత్రులన్
దోడులేకయె వజ్రమున్ గొని దున్మిలోకము లేమునె
వ్వాఁడొ యాసురశేఖరుండిట వచ్చె క్షేమముగన్గొనన్.

మేము స్త్రీపురుషవివక్షతలేకుండ సమస్తప్రాణులయోగక్షేమము కనుగొనవలసి యున్నదిగాన సర్వస్థలంబుల కరమరికలేక

హుటాహుటి నేగుదుము. ఇప్పుడిటవచ్చుటనీకుఁదప్పుగఁదోఁచెనా?

(అనిమందహాసముచేయుచున్నాఁడు.)

అహ—త్రిలోకాధినాథా! నమస్కారము. అజ్ఞానముచే మనుష్య మాత్రుఁడుఁగా భావించి పలికిన పలుకులు మన్నింపుఁడు. మీరు తండ్రులు. మేము బిడ్డలము. అట్టిచో మీరుచొరరాని ప్రదేశం బు నియ్యెడఁ గలుఁగవు. ఆపర్ణశాలం దపోనిష్ఠనున్న మత్ప్రాణేశ్వరుండగు గౌతముండు మిమ్ముల వీక్షించినచో నుచితసత్కారంబులు సేయును. మీరచటికి దయచేసి వానిం బడయఁగోరుచున్నదానను.

ఇంద్రు—(తనలో) ఓహో ఏమిజాణతనము! భర్త తపోనిష్ఠలోనున్నాఁడనియు నిదేసమయమనియు సూచించుచున్నది. అయిన నిట్లందును (ప్రకాశము) ఏమి! తపోవిఘ్నమొనరించుటకు నన్ను రాక్షసునిగాఁ దలఁచితివా యేమి! ఈగౌతమునికంటె వేయిమడుంగు లెక్కువతపమాచరించి యింద్రపదవిని బొందియున్న నాకు నొరులతపోవిఘ్నమొనరింప మనసెట్టులొప్పును? ఏమి నీవాతని యర్ధాంగివి కావా? గృహమేధి ధర్మంబులెఱుంగవా?

అహ—(ఆశ్రమముతో) అర్ధాంగిని గాకేమి మహాత్మా! నేనైనను నిచటఁ బరికరలోపంబుచే మిమ్ముఁ బర్ణశాలకుం గొంపోయి సత్కరింపవలసి యున్నది. కావున దయయుంచి యచ్చటికి దయ చేయుఁడు.

ఇంద్రు—(తనలో) ఆహా! నాకీమెయం దెంతయనురాగమో యీమెకును నాయందంత యనురాగమున్నట్లు మాటలవలన స్పష్టపడుచున్నది. (ప్రకాశముగా) జవ్వనీ! నీయభిమతము తెలిసినది అదిత్రోసిపుచ్చుట కీయింద్రుఁ డంతకిరాతుఁడు గాఁడు. నీకోరిక ననుసరించియే వర్తింతునని త్రికరణశుద్ధిగా నమ్ముము. ఇచట

సత్కరించుటకుఁ దగిన పరికరములు లేవంటివి. కార్యసాధనము లోఁ బరికరహీనత బుద్ధిమాంద్యుల కొకసాకు గానిబుద్ధిమంతుల కదియెంతమాత్ర మడ్డురాదు. ఈచెట్టుమొదట నింతయెత్తుగా రాలిన మృదులసుమంబులుండఁ బరికరములకై విచారించెద వేల? దివ్యాంశసంభూతురాలవై యున్నను నీజడదారుల సహవాసదోషంబున బుద్ధిజాడ్యతనొందితివి గాఁబోలు. లేకున్న నీకుపాయము నేను జెప్పవలసినదా?

అహ—మీరు సెలవిచ్చినట్లు నేనజ్ఞానురాలను. నాకు గౌతముఁడుపదేశించిన మార్గము కంటె వేఱువిధమున నతిథిసత్కారము సేయుటెన్నఁడు నెఱుఁగని దానను. పూజాద్రవ్యంబులలో నొక్కసుమంబులువినా యన్యమెవ్వియు నిచట గానరావుగావున నాశ్రమమునకు శ్రమ మనుకొనక విచ్చేయుఁడు.

ఇంద్రు—అబలామణీ! వచ్చునప్పు డాశ్రమమునకును వచ్చెదము. కాని యిప్పుడిచటనుండియే తెలుపవలసియున్నది. కావున జాగు సేయక నీమనోరథసిద్ధి వడయుము. ఏకార్యమున కేని చిత్తము ప్రధానమా పరికరములు ప్రధానములా చెప్పుము.

అహ—చిత్తము.

ఇంద్రు—అటులైనచో నది నాకొసంగుము చాలును. అప్పుడీ నునుంబు లెట్టి పరికరంబులౌనో నీవే చూచెదు గాని.

అహ—నేనేకార్యంబుచేసినను త్రికరణశుద్ధిగాఁ జేయ నలవాటుపడియున్నదాన. అందుచేనీకార్యంబున వేఱె చిత్తమర్పణచేసెదనని నుడువ నక్కఱలేదు.

ఇంద్రు—(తనలో) అబ్బా! ఇంత స్పష్టముగా నీమె తన ప్రేమ వెల్లడి చేయుచుండఁగా నామనోరథసిద్ధి వడయకుండ నింకను జాగుసేయుట నాదే మూర్ఖత. (ప్రకాశముగా) లలనా! అమృతోపమా

నంబులగు నీవాక్యములచే చాల నలరితి. పుష్పంబులచే నతిథిస త్కారము చేయుటెటులుఁగ నంటివి. అదియెట్లు చేయవలెనో ముందు నేను నిన్నతిథిగా భావించిచేసి చూపెదను. తరువాత నీవొనర్చి నీయభీష్టము వడయుము.

(అని కొన్నిపుష్పములఁ గొని యహల్యను సమీపించుచున్నాఁడు)

అహ:—శచీధవా! నన్ను డాయకుము. నీవు త్రిలోకాధినాథుఁడవై యును నీహద్దులో నీవుండి ప్రవర్తింపనిచో సామాన్యనికృష్టమా నవునికంటె లఘుతరంబుగఁ జూడఁబడుదువు.

ఇంద్రు—మోహిత్రరత్నమా! నీయౌవన రూపరేఖా విలాసంబుల నన్నొకనినే గాదు మఱియెవ్వరినైనను దృణప్రాయంబుగాఁ జూడఁగలదానవు. నేను సంకల్పించిన యతిథిసత్కారవిధానము పూర్తిగాఁ జూపనిమ్ము. నన్ను గటాక్షింపుము.

(అనితిరిగిసమీపించుచున్నాఁడు.)

అహ:—(ఎడమయి) అహో! ఏమి యీమూర్ఖత. రంభాదినిఖిలా ప్సరోగణంబులచే విరాజిల్లు స్వర్గలోకాధీశుండవై మహాపతివ్రత యగు శచీదేవికి భర్తవై యిటు లొకమర్త్యకాంతకు నందును మునిపత్నికై యాశించుట తగునా? లోకంబుల సంరక్షింప ని యామకుండవైన నీవే యిట్లు నీతిబాహ్యుండవై ప్రవర్తించినచో నిఁక లోకంబున నీతి యెట్లుండఁగలదు. వెలుఁగే పొలమును మే సిన కాపాడువా రెవ్వరిఁక. కావున నీయుద్యమము నుండి వెంట నే తలఁగి పొమ్ము.

ఇంద్రు:—నారీమణీ! నామనం బరయఁ గోరి యిట్లాడుచుంటివా యేమి? నాఁడా బ్రహ్మసభలో నీకేకగంటిపతిసారంబునకుఁ బాత్రుఁ డైన యీయింద్రుఁడు కాఁడా వీఁడు? పునస్సందర్శనమున కాల స్యమైనందుల కిట్లు కోపగించుచుంటివా యేమి?

అహ:—నాకదేమియుఁ దెలియదు. ఇంద్రుఁడవు కాని మున్మహేంద్రుఁ డవు కానిమ్ము. నీకిచ్చ కుమేనిఁ బనియున్నచో నాయాశ్రమము నంగల మదీయప్రాణవల్లభుం డగుగౌతముని సందర్శించి యాతిథ్యము గైకొని వారివలన నెఱవేర్చుకొమ్ము.

ఇంద్రు:—అబలామణీ! ఏల యీనిర్దయత్వము?

గీ. అతివ, తీయని నీయధరామృతంబు
కంటె నాతిథ్య మొండేది కలుఁగనేర్చు
కలికి, నీదగు గాటంపుకౌఁగిలి తీయ
వేడె నీయాశ్రమంబందు కోరికేమి.

అహ:—ఛీ దురాత్మ! ఒడలు తెలియక కాఱులఱచెదవు. శీఘ్రముగా నీవనము దాటిపొమ్ము.

గీ. గౌతముం డిటలేనట్టి కారణమున
బ్రతికిపోయెద విచ్చోటు బాసి చనుము
తీవ్రమయి యిప్పుడీజగత్త్రితయమేర్చు
నాదు కోపానలమున కింధనముగాక.

ఇంద్రు:—ఓహో సుందరాంగీ! కోపముఁ గూడ నీకొక యపూర్వ సౌందర్యము తెచ్చుచున్నదే.

గీ. కుటిలమగు భ్రూకుటిక్షేప మిటులఁ బఱపి
క్రొమ్మెఱుఁగుమేను గంపింప మాటిమాటి
కంబులను జూచి యధరబింబంబు గదల
పలుకు నీచిత్రవైఖరి మెలమిఁ గూర్చు.

నీకిప్పుడు కోపసమయముగా నుండుటచేఁ దరలి పోయి పునస్సందర్శనముఁ గావించుకొనెద దయయుంచుము.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

అహ:—(తనలో) ఇపుడీసంగతి గౌతమునికి నివేదింతునా? ఏల యీ

యనమనసు కలతపఱచవలెను? ఈపురందరుఁడు నేను తనపై మోహముతో నుంటి నన్న భ్రాంతిచే నిట్లు పలుక నోపు. ఆ భ్రాంతి నివారణ చేసితిని గదా. ఇఁక నీసంగతి యిక్కడనే మఱచిపోవుట యుక్తము.

(అని నిష్క్రమించుచున్నది.)

చతుర్థాంకము.

రంగము. ౨

(స్వర్గలోకము—ఇంద్రభవనము.)

ఇంద్రుడు:—ఆహా! సృష్టియంతయుఁ బరిశీలించి చూచిన నీచతుర్దశ భువనంబుల నహల్యవంటిచిత్రమైన వస్తువు వేఱొండు గానరాకున్నది. సమీపించి చూచుటచే నాయువిద సౌందర్యము నామనంబునకు మఱింత గాటముగా నాటి యున్నది. సరిపోల్పఁ దగిన వస్తువులే లేవు.

సీ. సిశివికాసములేని నీరజంబేపాటి
సాటియగు సతిమోము సౌరుతోడ
పగలు నిమీలనం బగునుత్పలం బెట్లు
తుల్యమగు నతివకన్దోయి తోడ
దరముచే నీటను దాగియుండెడు దరం
బెనయె సఖి కంఠమునకుఁ జూడ
అడవులపాలైన హర్యక్షరాజుమధ్యం
బెట్లు చెలికౌను కౌను సవతు
గీ. కదలలేకుండుకదళికాస్కంధ మెట్లు
యువతియూరువుతోఁ బోల్ప నోప్పు నొక్క

విరసమై యేటఁబడి యొక్క వేళఁ దోఁచు
సైకతం బెట్లు సమ మింతిజఘనమునకు.

క. హేమమునకు సౌరభమున్
గోమలతయుఁ గూర్చి ధాత కోమలి జేసెన్
గాముని యూఱవశర మయి
యీమె యిఁ గుందించువిరహ మెటుల సహింతున్.

అదిగో! సుధాకరుఁ డప్పుడే యుదయించి తననిశితకరంబుల నన్నలయింపఁ జూచుచున్నాఁడు.

ఉ. ఏమిర! చంద్ర నన్ను నలయించెద వేలర, సాటిదేవతన్
గా మది నెంచవో నిను ననారతమున్ భుజియింతు రేల్పులం
చీమెయి వైరమూర్పుకొన నెంచితివో యహివేశియా నహ
ల్యామదిరాక్షి నాహృదయమందు వసించుట నీవెఱుంగవో.

గీ. చల్లగానుండు జలధిలో జననమొంది
యుండియును దాల్తు వేలొకో యుష్ణరశ్మి
అకట! మఱచితి కాలకూటాగ్నితోడ
నుదయమొందంగ నెట్టులో నొందు విధము.

ఓహో! ఏమి! యీమలయపవనుఁడుఁగూడ నన్ను బాధించుచున్నాఁడే.

మ. అకటా! న్యాయమె గంధవాహ ననునిట్లారాటముంబెట్ట మా
మకవారిభిహతోరుపటుమలయతూన్మగ్రంధంబు నీకిష్ట బా
యక తోడయ్యెనొ నన్నెఱుంగదొ? యహల్యాస్నిగ్ధవక్షోరుహ
ప్రకటశ్రీవిజితాత్మ్నగా నవియె నాప్రాపంచు లోనెంచదో.

గీ. శైత్యమాంద్యసౌరభ్యముల్ చాలగలవ
టంద్రు మలయజ! నీకు సత్యంబె తలఁప

నిను భుజింపఁగఁ బాము గ్రక్కును విషంబు
ఫలము జూచినఁ దెలియదే వస్తుగుణము.

ఆహా! ఆజన్వని లేని యీ నైభవసామగ్రి యేల నాకు?

సీ. పడతి సింగారంపునడలచే గ్రాలని
భవనంబు లివి యేల పదవులేల
సుదతియొయ్యారంపు చూడ్కులఁ గనలేని
దర్పణంబు లివేల దర్పమేల
తనుమధ్య గ్రైసేసి తాల్పని యుపవన
సూనంబు లివియేల సొగసులేల
చంద్రాననాస్మేరచంద్రికల్ గాయని
విరిపాన్పులివియేల విభవమేల

గీ. సరసవాణిమృదూక్తులఁ గఱవనట్టి
శుకపికంబు లివేల శారికలు నేల
విచికిలామోద కౌఁగిటఁ బెనఁగకున్న
తను విదేల యనంగమంతనములేల.

(పరికించిచూచి) ఆహా ఆసుదతిరూపము కన్నులకుఁ గట్టిన ట్లుండి యెచటఁ జూచినను గాన్పించుచున్నది. నిజముగా నొకవేళ యిచటికి వచ్చినదేమో. అదిగో! ఆ స్తంభము చాటుననుండి తొంగిచూచి యహల్య వెంటనే యంతర్ధానమైనది. ఏమిసేయుదు. అక్కడ దాగియున్నదేమో చూచెదగాక. (పోయి చూచు చున్నాఁడు.) అకటా! ఇక్కడను లేదే. ఇప్పుడు వచ్చియుండుట ప్రత్యక్షముగాఁ జూచి యున్నాను. ఇంతలో నెచటికిఁ బోఁ గలదు. శచీదేవిగాని యామె చెలికత్తెలుగాని దాచియుందురేమో. కనుఁగొనెదగాక. అహల్యా, అహల్యా, (అని పిలిచి) అయ్యో శచీదేవిని బిలుచుటకు మాఱుగా నహల్యను బిలుచుచుంటినే. ఎవరైన విన్నచో—

(శచీదేవి ప్రవేశించి ప్రణమిల్లును.)

శచీ:—నాథా! అహల్య నెప్పుడు తెచ్చితిరి? ఆమెరూపము గాంచి ధన్యురాల నయ్యెదను.

ఇంద్రు:—ఏమీ, నామనను వ్యాకులముగా నున్నప్పు డేలయీపరిహాసములు? ఆసుందరి నెచట డాచితివో తత్క్షణము చెప్పుము. ఇప్పుడిటకు వచ్చియుంట ప్రత్యక్షముగాఁ జూచితిని. నీవో నీచెలికత్తెలో దాచియుండుట నిశ్చయము.

శచి:—ప్రాణేశ్వరా! నేనావృత్తాంతమేమియు నెఱుఁగను. అహల్యా యని మీరుగొంతెత్తి పిలుచుటచేత నామె నిటకుఁ దెచ్చితిరేమో యని చూడవచ్చితిని. ఆమె గానరాకుంటయే గాక మీయుపోహములకుఁ గూడ పాత్రైతిని. నాచెలికత్తెలఁ గూడ నరసివచ్చెదను. (అని పోయి తిరిగి ప్రవేశించి) నాథా వారుఁ గూడ నేమియు నెఱుఁగ మనుచున్నారు.

ఇంద్రు:—అటులైన మీరందఱు నాయంతిపురివిడిచి పొండు. తిరిగి యాజ్ఞసేయువఱ కిట కెవ్వరును రాఁజనదు.

శచీ—హృదయేశ్వరా! ఏల యీనిర్దోషులపై నింతకోపము? మీయాజ్ఞయెట్లో యట్లె యయ్యెడుఁగాక. కాని యీదీనురాలివిన్నపము కొంచె మాలింపుఁడు.

సీ. కాలకూటవిషాగ్ని కబళింపఁగా వచ్చు
బడబాగ్నిమంటలోఁ బడగవచ్చు
తీవ్రమౌ నసిధారఁ దిరుగంగ వచ్చును
మున్నీఁటిలోఁ బడి మునుఁగవచ్చు
సలసలక్రాగు నుజ్వలతైలముల దూఁక
వచ్చు ఘోరార్తుల బడయవచ్చు
వెన్నునిచక్రింపు వేడికోర్వఁగవచ్చు
శూలినేత్రాగ్నులఁ జొరఁగవచ్చు

గీ. గాని మునిజనపరిభవగ్లానిశాప
చండదహనార్చు లేర్చిన సాక్ష్య మగునె
దఱియఁగా వంశనిర్మూలదక్ష మగుప
తివ్రతాకోప మామీఁద తీవరింప.

ఇంద్రు—సరే. ఆసంగతి మాకంటె నీకెక్కుడ తెలియదు నీవుపొమ్ము.

శచి—చిత్తము. (ప్రణమిల్లినిష్క్రమించును.)

ఇంద్రు—నాపై నాఁడా బ్రహ్మసభలో ననురాగంపుఁజూడ్కులఁ బఱపిన యహల్య నేఁడిట్లు నిరాకరించుటకుఁ గారణమేమైయుండును? ఆగౌతముఁడేదో దుర్బోధ గావించి యుండనోపు. ఇఁక సామ వాక్యంబులచే లాభమున్నట్లు గాన్పించదు. ఏదో మాయోపాయముచే మనోరథ మీడేర్చుకోవలసియున్నది. గౌతముఁడు మాయోపాయముచేతనే గదా వివాహముచేసికొన్నాఁడు. అది యెంత యుచితమో యిదియు నట్టే. కాని యేయుపాయ మవలంబింతును? (ఆలోచనమభినయించి) ఆ! సరే, అట్లుచేసెదను. నాకామరూపత్వ మిప్పుడు గదా సార్థకమగును. కాని క్షుద్రమగు కుక్కుటరూపము దాల్పనా యనిమాత్రము సందేహముకలుఁగుచున్నది. ఏల సందేహింపవలెను? క్రియాఫలసిద్ధికి సాధనములయోగ్యతాయోగ్యతలతో నిమిత్తములేదు. ఫలదాయకమెయ్యదియో యయ్యదియే యోగ్యసాధనము.

గీ. ప్రబలమగురోగ మొడలిని బట్టియుండ
వైద్యుఁ డెవ రనుశంకతోఁ బనియా దేమి
గుణము నీయఁగ మందైన గూటి మైన
మైన నేమిటికగు రోగి కరసి చూడ.

(నిష్క్రమించుచున్నాఁడు.)

శ్రీ

అహల్యా శాపవిమోచనము.

చతుర్థాంకము.

రంగము. 3

(గౌతమాశ్రమపర్ణశాల)

గౌతముఁడు—(తలుపు తెఱచిచూచి) అహల్యా, కోడి కూసినది. తెల్లవాఱు జాములైనది. నేనేఁటికిఁ బోవలసి యున్నది. జపపరికరంబులు దెమ్ము.

అహ—ఇదిగో. తెచ్చితిని (అనికృష్ణాజినము, కమండలువు జపతానళము నిచ్చును.)

గౌత—(పుచ్చుకొని) అహల్యా, ప్రతిదినము నాకంటె ముందు లేచియుండెడిదానవు. నేడు నేనే నిన్ను లేపితిని శరీరమందేమయిన బద్ధకముగా నున్నదా యేమి? మఱికొంచెము సేపు విశ్రమింపుము.

అహ—నాథా. ఇఁక విశ్రమింపనక్కఱలేదు. నేడేమో కలఁతనిద్దురయయి దుస్స్వప్నములు వచ్చినవి. రాత్రి పొద్దుపోవుదనుక మీ పాదసేవ సేయుచు మీవలనఁ బతివ్రతామహాత్మ్యములు జీవేశ్వరస్వరూపవివరణము మున్నగుగాథలు వినుచున్న నాకు, నొకగంట యయినను నిద్రించితినో లేదో యింతలో నిట్టిదుస్స్వప్నము లేల కలుఁగవలె నని భీతి పొడముచున్నది.

గౌత—(మీఁదచేయివై చితట్టుచు) ఓముగ్ధురాలా! భీతి జెందకుము. ఆస్వప్న మేదో చెప్పుము. స్వప్నమని తెలిసినతరువాతఁ గూడ భయమెందులకు?

అహ—ఎవరో యొకదివ్యపురుషుఁడు వచ్చి నన్నుఁ జేయిపట్టి లాగుకొనిపోయి యొకకొండగుహలో దోచి పైన ఱాతి నొకదానిని మూసి యరిగినట్లును నేనాక్రందనమొనర్చుచుండ మీరు వచ్చి యాఱాతిని దొలఁగించినట్లును గలవచ్చినది. అంతలో మీపిలుపు విని మెలఁకువ వచ్చినది.

గౌత—సరే ఇంతేగద. ఇఁక నేను నిలుచుటకు వీలులేదు. అనుష్ఠానవేళ యయినది. తిరిగి వచ్చి యీస్వప్నమునకు ఫలము సావకాశముగా నుడివెదను. నీవు భీతిని విడిచి జాగరూకతతో నుండుము.

అహ—మహాప్రసాదము. మీపాదస్మరణచే నాకేభీతియుఁ గలుఁగదు. (అని ప్రణమిల్లును)

(గౌతముఁడు నిష్క్రమింపగా నహల్య తలుపులు వేసికొనును)

ఇంద్రుఁడు—(ప్రవేశించి)

భుజంగప్రయాతము. సురేంద్రుండనై యుండి చోరుండువోలెన్
జరింపంగ నయ్యెన్ నిశన్ మానిపంచన్
వరారోహ చేకూఱుభాగ్యంబు గల్గన్
దరిన్ జేరి కష్టంబు ధన్యుండ నౌదున్.

అహో! ఇప్పటికి నాయాశాలత ఫలమొసంగుతఱుణము సంప్రాప్తించినది. ఇఁక నాలస్యము చేయరాదు. గౌతముఁడిక నొకజాములో రాఁగలఁడు. ఇపుడు నన్నీ యిందరూపమున నహల్య దరికి రానీయదు. కావున గౌతమవేషము వేయవలసి యున్నది. శత్రుసైన్యసకువలె ప్రతిక్షణమొంతయో విలువగలదై యున్నది. కావున నేను వెంటనే పోయి మగుడి వచ్చెదను. అహల్య మెలఁకువతో నుండుటకై తలుపుగ్రుద్ది పోయెదను.

(అని నిష్క్రమించును.)

అహ—(తలుపు తెఱచివచ్చి) ఎవరో తలుపు తట్టినట్లయినది. ఎవరును గానరారే. ఇక్కవాటము మరుదాకృష్టమై యట్లు ధ్వనించెనేమో. నేడు నామనను గలఁత జెందినట్లే యాతీవ్రమారుతమువలన నాశ్రమమందలి తరుగుల్మలతాదులును, ద్వారకవాటములును గంపించుచున్నవి. ఎంతఁ గపించినను మానవులవలె శీతాతపంబులకు బాధచెందవట. ఈవిషయములో మానవజన్మముకంటె స్థావరజన్మమే మేలుగ గాన్పించుచున్నది. ఎంతసేపటికిని దెల్లవారకున్నది. ఉదయభాస్కరుని దర్శన మెంతకాలమున కగునో తెలియకున్నది. ఇఁక లోనికిఁ బోయి తలుపువేసికొందును. (అని తలుపులు వేసికొనును)

ఇంద్రు—(గౌతమవేషముతో బ్రవేశించి) సరిగా నున్నదా మునివేషము? ఎక్కడనైన దొరకిపోదునా? ముఖమునకు గడ్డము మీాసము జటాజూటము వక్షమున రుద్రాక్షమాలికయు, చేత గమండలువు దండమును జపమాలయు గృష్ణాజినమును; బాహ్యమున మునివేషము వేయుట యేమికష్టము? ఇఁక నహల్య విడిచిపొమ్మన్నను బోము. ఎల్లప్పుడొకరీతిగ నుందునా?

చ. తరుణులచిత్తవృత్తులవిధం బొకరీతిగ నెంచనౌనె యె
వ్వరిని వ్యపేక్షితు రొకపట్టున వారినె యొందువేళ నా
దరణ మొనర్తు రిచ్ఛమెయి దాల్ప ప్రియంబగు వేషభాషలన్
సురుగక నిల్చి లేచి మనసున్ గ్రహియింప సుఖంబు చేకుఱున్.

ఇఁకేఁ దడయరాదు. అహల్యను బిల్చెదను. వేషము సరిగా నున్నదా (అనితిరిగిచూచుకొని) అహల్యా, అహల్యా, (అని తలుపు తట్టుచున్నాఁడు.)

అహ—(తలుపు తెఱచి ప్రవేశించి) నాథా, నమస్కారము. నేఁడేమి యింత త్వరితంబున వచ్చితిరి? ప్రతిదినమువలె నొడల విభూతి

దాల్పలేదేమి?

(అని జపపరికరముల నందుకొని లోపల బెట్టును.)

ఇంద్రు—అన్నా! ఇదిమంచిపోయి చిక్కు వచ్చుకొంటిని. అనుమానము కలిగెనేని యత్నమంతయు వృథా యగును. కానీ ప్రాప్తమెట్లున్నదో, యిట్లనెదను.

అహ—ఏమి యాలోచించుచుంటిరి. నాకుం జెప్పంగూడని రహస్యమేమైనం గలదా?

ఇంద్రు—ప్రేయసీ. నీకుం జెప్పంగూడని రహస్యము లేదుగాని—(నాలుకకఱచుకొని) గౌతమునికి నెన్నడైన నింతవఱకు? నిజము చెప్పిన నీవేమనుకొనెదవో యని సంశయించుచున్నాఁడను. అంతియకాని వేఱుకాదు.

అహ—ఏమట్లు సంశయముతోఁ మాటలు నడబడుచు మాట్లాడుచున్నారేల? యథాస్థితి నెఱింగింపుఁడు.

ఇంద్రు—(తనలో) కనిపెట్టినదా ఏమి చెప్పుదురా. ఇఁక మర్యాదగా దాఁటిన బాగుండునేమో!

అహ—త్రికరణశుద్ధిగా మీచిత్తవృత్తి ననుసరించు నీసేవకురాలి యెడల ననుమానమెందులకు?

ఇంద్రు:—(తనలో) ఓహో! ఏమి యమృతంపువాక్యములు? ఆహల్యచే నేనిట్లు గౌరవింపంబడుదునని యెన్నఁడు ననుకొనలేదు. ఈవాక్యాదరణచే నాపడినకష్టము నంతయు మఱచి పోయినది. కాని నేనింద్రుఁడ నని తెలిసికొనిన యనినవో నానందసముద్రమే! (ప్రకాశముగా) ప్రాణేశ్వరీ! చెప్పెదవినుము. బ్రహ్మసృష్టిలో నిదివఱకెన్నఁడును లేని చక్కఁదనమును వహించిన నీరూపము సదా స్మరణకు వచ్చి మానసికానుష్ఠానంబులకు విఘ్నము కల్గించినది. నాజ్ఞానసంపత్తిచే చిత్తమెంత స్థిరపఱచినను సాధ్యపడలేదు.

"బలవానింద్రియగ్రామోవిద్వాంసమపికర్షతి" అను నార్యోక్తి మృషయగునా?.

అహ:—(సిగ్గు నభినయించును.)

ఇంద్రు:—సుందరీమణీ! ఏల సిగ్గుపడెదవు? నీసిగ్గుచే నీసౌందర్యశోభ ద్విగుణితమై ప్రకాశించుచున్నది. ఇఁకఁ బెక్కుమాటలేల? పంచశరుబారిచే నంచితుఁడనై యనుష్ఠానంబులెట్టులో ముగించి సత్వరంబున బలాయితుండనై నిన్నెప్పుడు జూతునా యని వచ్చితిని. ఇకఁ బ్రొద్దువాలుసమయము కావచ్చుచున్నది. తడయక కేళీగృహము చేరుదము రమ్ము (అని చేయిపట్టి లాగుచున్నాఁడు.)

అహ:—(సిగ్గుచేఁ దలవంచుకొని చేయి వెనుకకు లాగుచు) ఏమిది, ప్రాణేశ్వరా! ఇట్టి సంధ్యాసమయముల నెన్నఁడిట్టిశృంగారచేష్టలఁ దలపెట్టని వారేల యిప్పుడిట్లు బల్కుచున్నారు? నామనంబరయఁ గోరి యనుచుంటిరా? త్రికరణశుద్ధిగ ధర్మార్థకామమోక్షంబుల మిమ్మనుసరించుదాననేకాని వేఱుగాదు. ఏల యీతొందర? పూర్వము దితి యిట్టి సంధ్యాసమయముననే కశ్యపమహర్షిని మోమోటపెట్టి కవయుటచే లోకకంటకులగు హిరణ్యాక్షహిరణ్యకశిపులుద్భవిల్లిరని మీరే కదా చెప్పియున్నారు. మీకుఁ దెలియని ధర్మములు గలవా?

ఇంద్రు:—అహల్యా! ఏల యిట్టిశంకలచేఁ దడవొనరించెదవు? ఇంకను సంధ్యాసమయము కాలేదు. ప్రొద్దు లెక్కపెట్టిచూచితిని. రమ్ము పోవుదము. (అని చేయిపట్టి తీసికొనిపోవుచుఁ దనలో) సంతోషము పూర్తిముగానుండక యమాయికయగు నిత్తరుణిని నేను వంచించుచుంటినను వ్యసనముకూడ నొకప్రక్క మెలిమెలి లాగుచున్నది. కాలక్రమమున నానిజరూపము చూపి యెడఁబఱచినపిదప సంతోషము పూర్ణమయి యానందబాష్పముల సహా

స్త్రివిధంబుల విషవసేర్తును.

(అని యిద్దఱు నిష్క్రమించుచున్నారు.)

గౌత:—(ప్రవేశించి) నేఁడేలకో శిష్యసంతతి తెల్లవాఱుజామున పాఠములు వల్లెవేయుట వినరాకున్నది. ఈదూరమున నుండగనే యహల్య యెదురు వచ్చి జపపరికరంబులు బుచ్చుకొనుచుండెడి ది. నేఁడట్లు రాకుండెను. అంతియకాక యీపాటికి తెలతెలవా ఱుచుండెడిది. ఇంకను నేఁడీచీఁకటియేమి ?(అని ఆకసము పరికించి) ఓహో ! ఇంకను జామురాత్రి యున్నదే. నేను నడిరేయి లేచి యుండను. కోడికూఁత విని లేచితిని. కోడి యిప్పుడేల కూసిన ది ? (అని ఆలోచించి) ఆ ! ఎంత మోసము ! ఎంత మోసము ! (రోషముతో)

ఉ. ఎవ్వఁడవోరి ! ఘోరతరకృత్యమొనర్చితి నస్మదాశ్రమం
బవ్విధిఁజొచ్చి లజ్జత్యజియించుచు తుగ్రపుకుక్కుటంబవై
క్రొవ్వునఁ గొక్కురో యనుచు గూసితకాలమునందహల్యతో
నెవ్వగలేక కూడెద వరే ! నిను భస్మమొనర్తుఁ గాలిశా.

(అని జపమాల క్రిందవేసికొట్టి వడివడిగానడిచి తలుపుతట్టి)

అహల్యా, అహల్యా ఓసిపాపీ, వ్యభిచారిణీ, తలుపుతీయవేమే !

గీ. ఓసి, చండాలురాల నీయుద్యమంబు
సర్వమును మాకుఁ దెలిసె నస్మత్కఠోర
చటులరోషాగ్నికీలకు శలభములుగ
వేగ మిము జేసెదను జత వీడకుండ.

మ. ఘటవార్ధిప్రభవోగ్రహాలహలసంకాశప్రచండంబు, ను
త్కటవర్ధప్రళయానిలాభము జగత్క్షోభ్యప్రధానంబు, ది
క్తటనాథప్రకరప్రకంపితమహాధైర్యంబవార్యంబు, మ
చ్చటులక్రోధరసంబెనాడు చవిగాంచక్ గోరెనోమ్మత్తుఁడై.

అహల్య:—(తలుపు తెఱచివచ్చి గౌతముని పాదములపైఁ (బడి) నాథా, రక్షింపుము, రక్షింపుము, మీపాదసేవకన్న నే నేమియు నెఱుఁగనిదానను. లోపల నొకమూర్తియు బైట నొకమూర్తియు దాల్చిన మిము జూచి నాకు దిగ్భ్రమకలిగి నోట మాటరాకున్నది. మీమాహాత్మ్యము మందబుద్ధినగు నేనా కనుఁగొనుట రక్షింపుము.

గౌత—(అహల్యనెడ మకాలదన్నుచు) ఓసీ, పుంశ్చలీ, ఇంకను గపటస్నేహములు పకృతివినయములు ప్రకటించెదవేల? తప్పించుకొను నుపాయము లేక లోపల నున్న నీప్రియునకు నారూపము కల్పించి యిది యొకయంత్రము పన్నుచుంటివే? ఇంకను నీపతివ్రతాత్వమెక్కడ? "భార్యారూపవతీశత్రుః" అను లోకోక్తి నాయెడ నిజముచేసితివి. ఇప్పుడు నీయెదుటనే నీప్రియుఁడెవఁడో వానినోటనే పలికించెదఁ జూడుము. (అని లోపలికిజూచి) ఓరీ, ఎవ్వఁడవురా నీవు? ఇంతలో మాస్వరూపము గైకొంటివి? నీనిజరూపముతో నీవలకురమ్ము.

(అని మంత్రజలంబులఁ జల్లుచున్నాఁడు)

ఇంద్రు—(నిజరూపముతోవచ్చి గౌతమునిపాదములపైఁ (బడి) అపరాధిని. అపరాధిని, రక్షింపుము, రక్షింపుము.

అహ—ఓరీ, చండాలుఁడా, ఇంద్ర, నీవేనా? (అనిమూర్ఛిల్లుచున్నది)

గౌత—

స్రగ్ధర. ఓరి దురాత్మాగ్రవర్తీ! మొదలు తెలియ కిట్టుర్వీఁగామపత్నిన్ క్షీరత్వం బూని స్వేచ్ఛఁ దిరుగుచోరుల బాధింపగా నట్టి నీకీ
స్వారాజ్యాధీశ్వరత్వప్రకటపదవి నాపద్మజుండిచ్చె నింకన్
నీరంధ్రాసహ్యరంధ్రాన్వితతనువెనగన్ నీవువర్తింతుగాతన్.
నీశరీరమంతయు దూట్లుపడి చూడ దుస్సహంబయి యుండు

గాక. పొమ్ము (అనిమంత్రజలంబులజల్లును)

(ఇంద్రుఁడునిష్క్రమించును)

(గౌతముఁడహల్యంజూచి) ఓసీ, చండాలురాల?

శా. ఓసీదుర్మతి, యెట్లొడంబడితి వీవూహింపకుండంగ నీ
దోషాపాదకవృత్తి కేను దపమందు న్నిష్ఠమైనుండ; నా
తోఁ శుద్ధాత్మకవోలె కైతవపుభక్తుల్ సూపగా నేర్తె! నీ
చా? సిగ్గింకాలేదె? తక్షణము <u>పాషాణంబవై</u> పోవుమా.

అహ—హా! హా! నాథా, శాంతింపుము శాంతింపుము నాదోషమేమియో సరిగాఁ బరిశీలింపవైతివి. నీరూపముతోనున్న యీద్రోహి నెట్లు గుర్తింపఁగలను? నేను భావనచే గాని కంటి యెదుట గాని నీరూపముగాక యన్యునిరూపము జూచి యంగీకరించితినేని మహాపాతకఫలం బనుభవింతునుగాక.

గౌత—ఓసీ! పాపీ! నేనకాలంబున నిన్నెన్నఁడును గోరకుంట నీకుఁ దెలియదా? అట్టిచో నట్టివిపరీతపుఁగోరికకుఁ గారణమేమై యుండు నని దివ్యదృష్టిం జూడవలదా? నీకు దివ్యదృష్టిజ్ఞాన మొసంగిన దెందులకు? నీకుఁ గూడ నిష్టముండుటచేతనే యట్టిదుష్కార్యము నకొడంబడితివి.

అహ—శివశివా! ఏల యీశూలపుపోట్లు? త్వరగాఁ బాషాణజన్మ దయసేయుము. అక్కటా! నానిర్దోషత నీమనసునకుఁ దట్టినచో నెట్టిశిక్షనైనను సంతోషముతో ననుభవింతును గదా, నాథా! వేయేల? పాషాణజన్మము గాదు ఇసుకరేణువులుగా శపించిన ననుభవింతును గాని నీయాజ్ఞ నెఱవేర్పక నీవృత్తి సంశయించుచు దివ్యదృష్టిచేఁ బరిశీలించునంతటి మహాపాతక మీదాసురాలొనర్చునని యెన్నఁడును దలఁపవలదు. ఏమిసేయుదును. నానాథునకింకను నమ్మకము రాకున్నది. ఓపంచమహాభూతములారా! ఓ

చంద్రసూర్యాది దేవతలందఱా! ఏలనానిర్దోషత నానాథునకు బోధింపక మిన్నకుండెదరు? మీరెఱిఁగిన యంశము చెప్పకుండెదరేని మిమ్ముల నిప్పుడే శపియించుచుదాన.

(ఆకాశవాణి)

ఓగౌతమా! అహల్య నిర్దోషురాలు. అహల్య నిర్దోషురాలు. ఆమె చెప్పినది యథార్థము.

గౌత—ఆహా! అహల్యా, తొందరపడి శాపమిచ్చి నీయెడల గొప్ప యపచారము చేసితిని. కోపముచే మనసు కలఁతఁజెందెఁ. సత్యము స్ఫురించినది కాదు. నావచనం బమోఘము. అయిన నీశాపము నీకుఁ బ్రాయశ్చిత్తమాత్రకం బయ్యెడుఁ గాక. శునకసంపర్కము గల సోమపాత్రికం బోలె నీకుఁ బ్రాయశ్చిత్త మవసరమై యున్నది. కావునఁ గొంతకాలము శిలారూపంబున నుండి శీతాతపవర్షంబులచేఁ బరిశుద్ధభౌతికదేహవై తిరిగి నిజరూపంబొంది నన్ను బొందెదవుగాక.

అహ—నాకిప్పుడు పరమసంతోషముగా నున్నది. నానిర్దోషత నెల్లడి యైనది. తిరిగి నీపాదదర్శనమెప్పుడిక గలుగును మహానుభావా?

గౌ—ఒకవేయి వత్సరంబులకు శ్రీమహావిష్ణువు మనుష్యావతారమెత్తి కొండొకకారణంబున నీమార్గంబునఁ జనుచుండ నామహనీయుని పాదరజంబు సోకి శిలాజన్మమువాసి పవిత్రత బొంది మానవజన్మము గాంతువు.

అహ—ధన్యురాలను. ధన్యురాలను. ఇఁకశాపమొసంగుఁడు.

గౌత—(మంత్రజలముచల్లును, అహల్యశిలయైపోవును) (ఇంద్రుడును శచియుఁ దిరిగిప్రవేశించి గౌతముని పాదములపైఁ బడుదురు.

శచి—మహానుభావా, రక్షింపుము. పతిభిక్ష పెట్టుము.

గౌత—ఏమమ్మా, నీకు మాంగల్యలోపము రానీయలేదే. నీపతి జీ

వితంబున కేమి భయము?

శచి—అట్లుకాదు. నీవలన పొందిన శాపముచేఁ గుమూపిగ్గు యెవరి మొగము చూడ నొల్లక యుసురులఁ దొఱగెద ననుచున్నాఁడు. నన్నుజూచియైనగరుణించి యీపురందరునకీచిక్కుతొలఁగింపుము

గౌత—అమ్మా! చేసేతఁ దెచ్చుకొన్న చిక్కు లనుభవింపక తప్పు నా? నాకెంతయో తపోవ్యయమైనది. పండువంటి సంసారము చెడినది. ఇఁక వీఁ డేమైపోయిన నాకేమి?

శచి—గౌతమా! అట్లుకాదు. విప్రునకు దీర్ఘకోపముండరాదు. నీవు తిరిగి శాంతచిత్తతతోఁ దపస్సాగావించిన నీయెప్పటితపోబలము బడయుఁగలవు. అహల్యయు శాపవిముక్తి నొంది నిన్నుబడయఁగలదు. అట్టిచో నాకుఁబతిభిక్షనొసంగవా?

గౌత—అమ్మా! మంచిది. మహాపతివ్రతవైన నీకోర్కె కొంతవఱకైనఁ దీర్పక తప్పదు. ఈతని శరీరమందున్నరంధ్రము లక్షుల వలె గాన్పించుచు నింతటనుండి సహస్రాక్షుఁడను నామముతో నీపతిబలుగుఁగాత. మీరింకఁబొండు. మఱియు నింతటినుండి వానిమాపముచే నెవ్వఁడైన స్త్రీనిబొందఁ యత్నించినచో సంగమ కాలంబున వానికి నిజరూపము వచ్చుఁగాక. లోకమం దట్టిమోసములు నశించుగాక.

శచీపురందరులు—మహాప్రసాదము (అనినిష్క్రమించుచున్నారు.)

గౌత—అకటా! అహల్యలేని యీయాశ్రమంబున నేనెట్లు నిలువగలను?

సీ. వేకువఁ జపవిధికిఁ గావలసిన
పరికరంబిఁక నిచ్చువారలెవరు
అతిథియభ్యాగతులరు దేర ముదముతో
నాదరించెడువార లరయ నెవరు

తూమార్భటికి నోర్వగా జాలకేతెంచు
బీదలకన్నంబు పెట్టునెవరు
శ్రమజెంది యున్నచో సంగీతముఁ బాడి
చిత్తము రంజిల్ల జేయు నెవరు
గీ. గృహము కేఁ దెచ్చు సామగ్రి యిమ్ముఁజేసి
సర్వసౌఖ్యంబు లొనఁగూర్పఁ జాలునెవరు
స్త్రీలతో నింటికేతెంచు స్నేహితులను
నిండుగౌరవమీయఁ దోడుండు నెవరు.

ఆహా, అహల్యలేని యీయాశ్రమ మెట్లుచిన్నవోయినది!

ఉ. సోముఁడు లేని రాత్రి విరిశోభ దలిర్పని శయ్య వారిజ
స్తోమము లేని పెన్గొలను సూర్యుఁడు లేని నభంబు నాయకం
బౌమణి లేని హారము నిజాత్మతొలంగిన దేహమౌను కాం
తామణి లేని యీగృహమునన్ వసియించుట నాకు శక్యమే.

కావున నహల్య వచ్చువఱకు నాచేఁ బ్రతిష్ఠింపఁ జేయఁబడిన గోదావరీతీరంబునఁ గోటిలింగక్షేత్రమునఁ దపము గావించుకొనుచుండెదను.

(అనినిష్క్రమించుచున్నాఁడు.)

శ్రీ

అహల్యాశాపవిమోచనము.

పంచమాంకము.

రంగము ౧—సిద్ధాశ్రమప్రాంతపుటడవి.

(మారీచ సుబాహులు ప్రవేశించుచున్నారు.)

మారీ:—ఓరీ సుబాహూ, ఎక్కడను ఋషులయాశ్రమములలో యజ్ఞయాగాదులు జరుగకుండఁ జేయవలసినదని మన ప్రభువైన రావణాసురుని యాజ్ఞగదా. అదిసరిగా నెఱవేఱుచున్నదా? ఇంక నెవ్వరైన నేమూలనైనఁ గ్రతువులు సాగించుచున్నారా?

సుబా:—ఎవ్వరును జేయుచున్నట్లగపడదు. మన రాక్షసబలంబప్రమత్తతతోఁబనిచేయుచున్నది. అత్రిచేయుయజ్ఞము అణుగంటినది. భరద్వాజునిక్రతువు భగ్నమైనది. జాబాలిసవనము వ్యర్థమైనది. విశ్వామిత్రునియాగము విధ్వస్తమైనది. కాని అన్నయ్యా! నాకొక సందేహమున్నది చెప్పుము. మనము సమానులతోఁ బోరాడవలెను గాని మూఁడు నెలలు సాముచేసి మూలనున్న ముసలిముండను కొట్టినట్లీనోరువాయిలేని ఋషులతో మనకీ వివాదమేటికి? ఈ యజ్ఞములు పాడుచేయుటవలన మన కేమి లాభము?

మారీ:—ఓరి అర్ధాయుష్యపుముండాకొడుకా! నీకుఁగూడ నిట్టి యర్ధాయుష్యపుటూహలు తట్టుచున్నవా? మనలో నిర్భాగ్యుఁడు విభీషణుఁడొక్కఁడే యిట్టియూహలు గలవాఁడనుకొన్నాను. నీవుకూడఁ దోడున్నావా? ఇన్నాళ్లనుండి యజ్ఞములు పాడుచేయుచున్నాము. దానికర్థమేమో నీకుఁ దెలియనే లేదా? మన రాక్షసకులమునకు వైరి విష్ణువన్నమాట యెఱుఁగుదువు గదా. వా

నికోస మెన్ని ప్రయత్నములు చేసినను దొరుకుటలేదు. ఈయ జ్ఞాదులలో నడఁగియుండునఁట. కనుక యివిపాడుచేసినచో వాని కిఁ దగిన గర్వపాయశ్చిత్తమె బయటబడునఁట.

సుబా:—ఓహో! అదా? ఏమి ప్రాయశ్చిత్తమవును? మొన్ననే విశ్వామిత్రునియజ్ఞము కడవలతో నెత్తురుమాంసంబులు హోమ కుండంబునఁ గుఱిపించి ధ్వంసముచేసితిమి. ఎవరును గాన్పించ లేదు. విశ్వామిత్రుఁడు బహుకోపిష్ఠి యని వాడుక. ఏమియుఁ జేయలేక చూచుచు గూర్చున్నాఁడు. వానిప్రాయశ్చిత్తముమా త్రమయినది.

మారీ:—అప్పుడే యేమయినది. ఎవ్వరినో రాజులను మనతో యు ద్ధముచేయుటకై తీసికొనివచ్చునఁట. అయోధ్యాపురపురాజును సహాయము చేయుమని కోరుటకు వెళ్ళినాఁడఁట. ఈసంగతి మన చారుఁడొకఁడు మునివేషముతోఁబోయి వినివచ్చి నాతోఁజెప్పి నాఁడు.

సుబా:—అహ్హా, హ్హా,హ్హా (అని వికటముగా నవ్వి) ఒరే అన్నయ్యా! నీమాటలు వినగా నాకు నవ్వు వచ్చుచున్నది. ఈపిచ్చిముండా కొడుకు మనము నరభోజనులమన్నమాట మఱచినాఁడా యేమి? నరులను యుద్ధమునకుఁ దీసికొనివచ్చునఁ నేమిప్రయోజన మను కొన్నాఁడు. మన మొక్కొక్కబళెముక్రింద మ్రింగివేయమా?

మారీ:—మ్రింగివేయము.

సుబా:—ఎందుచేత?

మారీ:—ఎందుచేతనా మనతల్లి తాటక దారిలో నున్నదన్నసంగతి మఱచితివా యేమి? ఆమె మనవఱకు రానిచ్చిన గదా మనము మ్రింగుట?

సుబా—అవునురోయి. ఈసంగతి యామెతోఁ జెప్పి మనము సుఖ

ముగా నిక్కడ నిద్రపోవచ్చును.

మారీ—అట్లుచేయుదము. రా. పోవుదము. కాని యీమాటు తిరిగి విశ్వామిత్రుడు యజ్ఞము చేసిన నేమిచేసెదవురా?

సుబా—ఏమిచేసెదనో చూచెదవుగాని. ఒక్క హోమకుండమే గాక యజ్ఞశాల యంతయును గూడ నెత్తురుమాంసములతో ముంచివేసి యీబుద్ధిలేని ఋషిముండకొడుకులను గాలుసేతులు విఱిచి కట్టి దానిలో బాఱవేయుదును.

మారీ—శభాస్. సాగెడుచోట బాగుగా నల్లరిచేయుటలో నీతరువాతనే యెవరిని జెప్పినను. కాని ప్రొద్దుపోవుచున్నది రమ్ము. మనయమ్మ నిద్రించువేళ యగుచున్నది. నిద్రలో లేపితిమేని నోడలు తెలియక నిన్నును నన్నును గూడ మ్రింగును.

సుబా—అట్లయినం బోదము రమ్ము.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

పంచమాంకము. రంగము.౨

అయోధ్యాపురము.

(దశరథుని కొలువు. దశరథుడు, సుమంత్రుడు వసిష్ఠుడు మఱికొందఱు పౌరులు కూర్చుండియుందురు.)

దశ—సుమంత్రా, రాజ్యమెట్లున్నది? ప్రజలందఱు సుఖించుచున్నారా? లోపముల నేమైన నుగ్గడించుచున్నారా?

సుమం—మహారాజా?

సీ. విడువరొల్లరు గదా విహితవర్ణాశ్రమవృత్తి
ధర్మంబుల పీనమైన

పరయనోర్వరుగదా పరధనపరకాంత
కొలసి రక్షణ సేయుచుండ్రు గాని
నాడనోర్వరుగదా యనృతవాక్యంబులఁ
బరిహాసమునకైనఁ బాపభీతి
హద్దుమీఱరుగదా పెద్దలమాటకుఁ
గడలి యాగాఁ జెలియలికట్టవోలె

గీ. ధర్మమెల్లెడ నాల్గుపాదముల నెలయ
పాడిపంటలు సిరులునుఁ బ్రబలి యుండ
సర్వసర్వంసహాప్రజల్ సౌఖ్యములను
గాంచుచున్నారు దశరథక్ష్మాతలేంద్ర.

మఱియుఁ బ్రజలందఱు నాకాజ్ఞాకరులై యున్నట్లు తెలియ వచ్చినది.

దశ—అదేదో సత్వరంబున నెఱిఁగింపుము.

సుమం—

సీ. స్మితపూర్వభాషుండు చింతితకార్యుండు
చేరలమీఱు రాజీవనేత్రుఁ
డమలాంతరంగుండు నార్యవిధేయుండు
నాయతవక్షుండు సమశోగళుండు
సర్వభూతసముండు సకలకళావేది
సకలకళాపూర్ణచంద్రముఖుండు
గర్వితరిపుమదఖండనశీలుండు
రఘువంశపుటాఁబోతు గతిగలాఁడు

గీ. అట్టి శ్రీరామభద్రుండు యౌవరాజ్య
పట్టభద్రుండు నయి తము పాలనంబు

సేయ నువ్విళులూరుచు జిహ్వములను
గోరుచుండుట తెలిసెనో కువలయేశ.

దశ—అవును. అఱువదివేలయేండ్లనుండి యొకే విధముగా నున్న నాపరిపాలనతోఁ బ్రజలు విసిగి యుందురు. అంతియ కాక యట్టికోరిక నాకును గలదు.

మ. చిరకాలంబుననుండి యీయినకులశ్రేయోభిదాయంబునై
పరిరక్షింపఁగ మద్భుజాస్థితమహాభారంబునై యొప్పు రా
జ్యరమన్ నందనుమూపునందిడుచు సంసారంబునందెంతయున్
విరతిన్ గాలముపుచ్చఁబూనెన్నఁడని యువ్విళ్ళూరుదు నెమ్మదిన్.

సుమం—దేవా, శ్రీరామచంద్రునియందుఁ గలప్రేమచే ప్రజలట్లు తలఁచుచున్నారే కాని మీపాలనమందలి విసుగుచేఁ గాదు. ఇన్నాళ్ళనుండియు లేని విసు గిప్పుడెట్లువచ్చును?

దశ:—అమాత్యవరా, అట్లుకాదు. అవకాశము కలిగినప్పుడు గాని యంతఃకరణప్రవృత్తులలో భేదము పొడకట్టదు. ఇంటఁగుడిచి కూర్చుండిన వానిని సత్యవాక్యపరిపాలనావ్రతుఁడనియు, బరధనపరదారవిముఖుఁడనియు ననిన నేమిలాభము? తగినయవకాశ మబ్బినను దృఢవ్రతుఁ డగువానినే శ్లాఘింపవలసి యున్నది. ఆరీతినే ప్రజలకు నిదివరలోఁ బరిపాలనలో మార్పుజెందు నవకాశము కల్గలేదు. ఇప్పుడు శ్రీరామచంద్రుని యౌవనప్రాదుర్భావముచే నట్టి యూహ కలుఁగవచ్చునని తోఁచుచున్నది. అయినను చిరంజీవియౌవరాజ్యపట్టాభిషేకము మనకందఱికిని గూడ సంతోషదాయకమే గావునఁ బ్రజలకుఁ గలయీకోరికె వెంటనే తీర్పవలసినదే. కానిముందు వివాహమహోత్సవమాచరించి తరువాత నీయుత్సవము జరిగించిన బాగుగ నుండునేమో యని తలఁచెదను. ఏమి గురువరా, మీ యభిప్రాయమేమి? (అని

వసిష్ఠునివంక జూచును.)

వసి:—అది సమంజసముగనే యున్నది. (అపవారించి) దశరథా. కొంత రాజ్యభారముతోఁ బాటు కొంతసంసారభారముకూడ శ్రీ రామచంద్రునిపై ద్రోయ యత్నించుచుంటివా? అతనిశక్తి యె ట్టిదనుకొనుచుంటివి? ఇట్టివనంతములగు రాజ్యములను సంసార ములను వహింపఁగల దివ్యతేజముగలవానినిగా నెఱుంగుము.

దశ:—(నవ్వుచు) మీ యాశీర్వచనప్రభావము.

ద్వా:—(ప్రవేశించి) మహాప్రభో, ఎవరో మహర్షి విశ్వామిత్రు లవారఁట. మీదర్శనము వెంటనే కావలెనని వచ్చినారు.

దశ:—విశ్వామిత్రభగవానులే. పూజాద్రవ్యంబుల వెంటనే తెమ్ము (అని లేవబోవుచున్నాఁడు)

వసి:—రాజా! నీవు లేవనలదు. నాచిరకాలమిత్రుని విశ్వామిత్రుని నేనే స్వయముగఁ బోయి యెదుర్కొని తీసికొని వచ్చెదను. (అని నిష్క్రమించి తిరుగ విశ్వామిత్రునితోఁ బ్రవేశించును.)

(సభలోని వారందఱు లేచినిలుతురు)

దశ:—ఋషిపుంగవా, నమస్కారము.

విశ్వా:—సర్వకళ్యాణసిద్ధిరస్తు.

దశ:—స్వామీ! ఆసనమలంకరింపుఁడు.

(విశ్వామిత్రుఁడుకూర్చుండగా నందఱును కూర్చుందురు.)

ద్వా:—మహాప్రభో, పూజాద్రవ్యంబు లివిగో

దశ:—(పుచ్చుకొని విశ్వామిత్రునకెదురుగ నిలుచుండును)

విశ్వా:—రాజచంద్రమా, మేము వచ్చిన పని కాకుండ నీయతిథి సత్కారంబుల ముందుగ స్వీకరింప నొల్లము నీవు కూర్చుంకుము నేను చెప్పెడి యంశముల ముందుగ గమనింపుము.

దశ—(కూర్చుండి) స్వామీ, ఈరాజ్యమంతయును నేనును నాకు

టుంబమును మీవారలమై యున్నపుడట్లు శంకించెదరేల? మీ రేది సెలవిచ్చిన నది చేయువాఁడనే కాని తప్పువాఁడను గాను. ఆతిథ్యము గ్రహింపుఁడు.

విశ్వా:—రాజా, నీవచనామృతము చేతనే నాకు సంపూర్ణాతిథ్య మొసంగితివి. ఇంతకంటె బ్రస్తుతము వేఱాతిథ్యమక్కఱలేదు. నాకోరెడునది తప్పక యిచ్చెద నంటివి. ఆహా రాజనునప్పుడు నీవేరాజవు. నీకంటెనుత్తముఁ డీలోకమున నెవ్వఁడును లేఁడు. సూర్యవంశంబును బుట్టిన వాఁడవు వేఱెట్లు పలుకుదువు? సత్యసంధత యర్థిజనప్రియత్వము మీకునుగ్గుపాలతో వచ్చినవేకావా?

సుమం:—(తనలో) ఈవిశ్వామిత్రుఁడు ఋషులలో గడు నసాధ్యుఁడు ఏమి దుర్ఘటమగు కోరిక కోరునో తెలియదు. కానిమ్ము. అట్టిదుస్సాధ్యమగు కోరికనేదేనిఁ గోరిన మహాత్మ్యుఁ దీయనకుఁ దీసిపోని వసిష్ఠభగవానులవారిని సమాధానముచెప్పుటకుఁ గోరవచ్చును. (ప్రకాశముగా) స్వామీ, మీకోరిక యేదియో సెలవిచ్చి మమ్ము ధన్యులఁ జేయుఁడు.

విశ్వా:—ఇదిగో చెప్పెద రాజా సావధానముగ నాకర్ణింపుము. నే నొక క్రతువొనరింపవలసియున్నది. అయ్యది తలపెట్టినపుడెల్ల రక్కసులు వచ్చి రక్తధారలు హోమకుండంబునం బోసి ధ్వంసము చేయుచున్నారు. శపింప రాదా యందువేనిఁ గ్రోధమనస్కుండనైనచో యజ్ఞఫలములేదు. కావున నీకుమారులగు రామలక్ష్మణుల నాతోడఁబంపెదవేని వారలచే రాక్షసబాధయడఁగి సవనము యథావిధిగ జేసికొనువాఁడ సత్వరంబున నాతోడఁ బంపుము.

దశ:—రామలక్ష్మణులా! స్వామీ! రాక్షసబాధతప్పింతురా!

విశ్వా:—ఆ, ముమ్మాటికిని రామలక్ష్మణులే తప్పింతురు. ఏమిపం

పననెదవా?

దశ:—అదికాదు. మహానుభావులు మీకార్యము నెఱవేర్పకుందు నా? ముక్కుపచ్చలారని యీనిసువులెక్కడ! రాక్షససంహారమె క్కడ! నాసైన్యమంతయుఁ దీసికొనిపోయి మీకార్యము నెఱవే ర్చుకొనుఁడు. నన్ను రమ్మన్నను వచ్చెదను.

విశ్వా:—ఎదిరిశక్తి తెలియక మాటలాడుచున్నావు. రాక్షసులన సామాన్యులనుకొనుచుంటివా యేమి? లోకకంటకుఁడైన రావణా సురునియనుచరు లగుమారీచసుబాహులనెడు ఘోరరాక్షసు లు కడు నసాధ్యులు. నీసైన్యము దైన్యమునొందును. దివ్యతేజు లగు నీరామలక్ష్మణులచేఁ దక్క నన్యులచే వారసధ్యులు. కావు న నీవనుమానింపక వీరిని నావెంటఁ బనుపుము.

దశ:—(తనలో) అయ్యో! ఇదియేమి గ్రహచారము. ఈముని తన పట్టినపట్టు విడువకున్నాఁడే. రామచంద్రుని బాసి క్షణమైన నే నుండఁగలనా? ఆరాక్షసుల ముందఱ నీబాలురేమి చేయఁగలరు? (ప్రకాశముగా) స్వామీ! ఏల యిట్టి విపరీతవాక్యము లాడుచు న్నారు? దేవతలకైనను నజేయు లగునారాక్షసులెక్కడ? మృ దుదేహులైె తరుణవయస్కు లగునాకొమారులెక్కడ? ఇన్ని యుద్ధములు జేసినవాఁడను. నేనే యారక్కసులను దేటిపాటిఁ జూడ వెఱతునే. సైన్యమంతయు నిచ్చెదను. నేను స్వయముగా వచ్చియుద్ధముచేయుదును, గాని యీబాలుర నాపనికై పంపఁ జాలను. లేకలేక కలిగిన యీసంతానమును సుకుమారగాత్రుల ను నరభోజనులతోడి దారుణసంగ్రామానకంపఁ బంపుమనికోరు ట మీయట్టి యహింసాపరుల కుచితమా?

విశ్వా:—(కోపముతో) చాలుచాలు. నీయుపన్యాసమిఁకఁ గట్టిపెట్టు ము. కోరిన దిచ్చెదనని మొదట బింకములు పల్కి యిపుడుచే

యననియమృతాలాపము లాడు హీనస్వభావుఁడవని తెలియనైతి.

ఉ. కోరిన కోర్కె తీర్తునని కొంకక ముందు వచించి యుండి నేఁ
గోరఁగఁ జేయఁ జాలనని గొప్పయబద్ధము లాడెదార! నీ
వీరవివంశకీర్తి హరియింపఁగఁ బుట్టిన పాతకుండవై
తూర్మరమణాళి నిందలను గాంతువటంచుఁ దలంపవేలకో?

నీకేల యీమూర్ఖత? సూర్యవంశమునఁ బుట్టలేదా? నీపూర్వు లెవ్వరైన నిట్టి యబద్ధముల నాడిరా? తనువు శాశ్వతమనుకొనుచుంటివా? మాటలు కలకాల ముండు టెఱుఁగవా? పుత్త్రమోహముచే రామలక్ష్మణుల సామర్థ్య మెఱుఁగలేకున్నావు గాని వారీ రాక్షసులచే గాదు చతుర్దశభువనంబుల నెవ్వరిచేతను గూడ నజేయులని తెలియలేకున్నావు. నీకుఁ దెలియకున్న నీకులగురువగు నీవశిష్ఠమహర్షి నడుగుము. ఛీ! నీవసత్యవాదివి. నీ మొగము చూడరాదు. నేను బోయెదను. (అని లేచుచున్నాఁడు.)

వశి:—విశ్వామిత్రా! కొంచెము తాళుము. దశరథా (అపవారించి) ఇది వినుము. నీకీవెఱ్ఱి యెందులకు? రాముఁడన నెవరనుకొనుచుంటివి? సాక్షాచ్ఛ్రీమహావిష్ణువు సుమా. పూర్వజన్మమున నీవు కశ్యపుఁడవు. కౌసల్య యదితి. మీరు ఘోరతపంబు సేయ శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమై మీగర్భంబున నుదయింతునని వాక్రుచ్చి యున్నాఁడు. అతఁడే యీరాముఁడు. ఈతఁడు జన్మించునను ఘరానతో నేను మీకులంబునకుఁ బురోహితుండనై యిమ్ములఁ గొల్చుచున్నాను. లేకున్న నాకీజనపదసంపర్క మెందులకు? ఇఁక నీవిశ్వామిత్రుఁడన్ననో ఋషులలో మేటిరాజర్షియై యుంటచే రాజ్యాంగతంత్రములను వైదికతంత్రములను గూడఁ బాగుగా నెఱింగిన వాఁడు. అనేకములగు శస్త్రాస్త్రవిద్యారహస్యముల నెఱింగిన వాఁడు. అవి యన్నియు నీకుమారులకుఁ గఱపు

ను. ఆమీఁద నీవంశమున కంతకు ఖ్యాతి గలుగునట్లు వీరు రక్షకుల దునుమాడుదురు. కావున నీమునితో నీకుమారులఁ బంపుట సర్వవిధముల శుభదాయకము.

దశ—(అపవారించి) అట్లయిన నంగీకరింతునా? కాని రాము నెడఁ బాయుట యనఁగాఁ బ్రాణమును బాయుటగా నాకుఁ దోఁచుచున్నది. అందుచే సంశయించుచుంటిని.

వసి—(అపవారించి) అక్కఱలేదు. అట్టి మహర్షితోఁ బంపిన నెన్నియో శుభములు సమకూరును గాని వారికేవిధమగు నపాయమును గలుగదని నమ్ముము. తత్క్షణము మాఱుమాటాడక యంగీకరింపుము.

దశ—(విశ్వామిత్రునితో) సంయమీంద్రా? ఏల యిట్లు కనిపెదరు? రాముని యందలిప్రేమచే నట్లంటిని గాని మీయాజ్ఞ యుల్లంఘించువాఁడనే. మీ యిచ్చ వచ్చినట్లు చేయుఁడు. రామలక్ష్మణులఁ గొంపొండు. సత్వరంబున బంపివేయుఁడు.

విశ్వా—పదిదినములకంటె నాకుఁ బనియుండదు. తరువాత వారికిఁ బ్రియంబగు చోటున కేఁగవచ్చును. రాజా, రామలక్ష్మణులను బంపెద ననుటచే సంతుష్టాంతరంగుఁడనైతిని. లోపలకు జని యీసంగతి సీరాణుల కెఱింగించి వెంటనే ప్రయాణసన్నద్ధులఁ గాఁ జేయుము. నేను వచ్చి నీయాతిథ్యమును సంపూర్ణముగా గ్రహింతును.

దశ—మహాప్రసాదము. నేటికి కొలువు చాలింతము.

(అందఱును లేచి నిష్క్రమించుచున్నారు.)

పంచమాంకము. రంగము. 3

సరయూనదీప్రాంతము.

(విశ్వామిత్ర రామలక్ష్మణులు ప్రవేశించుచున్నారు.)

విశ్వా—రామచంద్రా, ఈసరయూనదీవిభవమును జూచితివా?

మ. చలదుత్తుంగతరంగమాలికలచే స్నాతప్రకాండంబు ను
య్యేలలూఁగించి పిపాసదీఱఁ బథికాహీనప్రమోదంబులై
కలుషాపేతవినిర్మలోదకమహా ఘప్రాంతదేశంబులై
విలసిల్లున్ సరయూనదీవిభవముల్ వీక్షింపుమా రాఘవా.

మఱియును.

సీ. పగలెల్లఁ గష్టంపుఁబనులచే శ్రమచెంది
చల్లనీటను మున్గి జలములగనము
కడుపునిండఁగఁ బచ్చికను మేసి యల్లసఁ
బానార్థమై దిగు పశువు లవిగో
పై సరసత్వంబు పరికించి లోఁగొంత
కనలేక కూలు వృక్షములఁ బాడు
పక్షపాతము లేని భంగి పైనటించుచు
గండుమీలను మ్రింగుగ్రద్ద లవిగో

గీ. సర్వసంసారసంభారసంభృతంబు
లైన నావల నీక్షింపు మబ్ధివిభుని
జేరువేళను గొంపోవు సారె యనఁగ
సరయునది పాఱు శ్రీరామచంద్ర! కంటె.

మీరిద్దఱీనదీజలంబుల నవగాహంబు జేసి రండు. బలయబల యను రెండుమంత్రంబులు మీకుపదేశించెద వానిచే మార్గాయాసము క్షుత్పిపాసబాధలు మీకుఁగలుగక నిద్రించు నప్పుడు గాని యే

మఱిపాటున నున్నపుడు గాని శత్రువుల వలనియపాయము కూడ కలుఁగక యుండెను. మఱియు వైరిదుర్వారతేజులరై యఖండకీర్తిని బడయుదురు. పోవుదము రండు.

రామ&లక్ష్మ:—మహాప్రసాదము.

(నిష్క్రమించుచున్నారు)

(తిరిగిముగ్గురును ప్రవేశింతురు)

రాము:—మహాత్మా! ఈప్రదేశము వెనుక జనాకీర్ణమైనట్లుండి యిప్పుడు నిర్జనంబుగా గాన్పించుచున్నది. దీని వృత్తాంతమేదియో సెలవిచ్చెదరే.

విశ్వా:—అవశ్యము చెప్పెదను. ఇచ్చట మలదకరూశదేశంబులను రెండు దేశంబులు పూర్వము ధనధాన్యసమృద్ధిచే విలసిల్లుచు స్వర్గతుల్యంబులుగా నుండెడివి. అవి యిప్పుడు తాటక యనునొక్క రాక్షసిచే నావరింపఁబడి జనశూన్యములై యున్నవి. ఈరక్కసి మొదట నొకయక్షిణి. బ్రహ్మవరప్రసాదంబుచేఁ బుట్టుకతోడనే వేయియేనుఁగుల బలముగలదై సుందునికి భార్యయై మారీచసుబాహులను పుత్త్రులఁగని యగస్త్యమహాముని శాపంబున భర్త నిహతుఁడుగాఁగ నాతని జంపఁబోవగా నమ్మాని క్రుద్ధుండై దానిని బుత్రులను రాక్షసులుగండని శపియించిన నప్పటినుండియు నిది కుటూపిణియై రాక్షసజన్మంబుతో నీదేశము లావరించి ప్రజాక్షోభ మొనరించుచున్నది. అది యిప్పుడు దారిలో మనకుఁ బ్రత్యక్షమగును. దుష్టరాక్షసి గావున స్త్రీయని సందేహింపక తత్క్షణము సంహరింపుము. దాన గోబ్రహ్మణ రక్షణము కలిగి నీకు యశంబు చేకూఱును.

రాము:—స్త్రీవధము చేయుటకంటె ముక్కును జెవులును గోసినఁ జాలదా మహాత్మా.

విశ్వా:—అట్లు గాదు. అది మిక్కిలి చెడ్డరాక్షసి దుర్మార్గులగు స్త్రీలవధ పాపము కాదు. స్త్రీపురుషవివక్షతచేయుటకుఁ గొంత వ్యవస్థ కలదు. అది మీఱినచో నట్టి భేద మెన్నుటక వసరములేదు. మహాజ్ఞానియైలోక మంతయు బ్రహ్మమయముగాఁ జూచువానికి స్త్రీపురుషవిచక్షణ మక్కఱలేదు. లోకోపద్రవకరములగు కార్యములఁ జేయువారి దండించుటకు స్త్రీపురుషవిచక్షణ మక్కఱలేదు. పూర్వ మెన్నఁడైన స్త్రీవధము జరిగినదా యందువేని నింద్రుఁడు మంథరను శ్రీమహావిష్ణువు భృగుపత్నినిజంపియుండిరి. కావునఁ గనికర మూనక వెంటనేదీని బరిమార్పుము.

(తాటక ప్రవేశించును)

తాటక—ఒరేదుర్మార్గులారా, ఎవరురా నాసెలవులేనిదే కండకావరముచే నావనము ప్రవేశించుచున్నారు? మిమ్ము ముగ్గుర నొక్కకబళంబుగా మ్రింగెదను. ఆ. ఆ. (అనిఅఱచుచున్నది.) నరమాంసము దొరికి చాలదినము లైనది. నేను కడుపునిండ భోజనము దొరికినది. ఆ ఆ (అనినోరు తెఱచుచున్నది.)

లక్ష్మ—(వెనుకనుండి వచ్చి యొకతన్ను తన్నును)

తాటక—(వెనుకకుఁ దిరిగి) ఓరీ ముందుగా నిన్నే చప్పరింతును. (అని లక్ష్మణుని తఱుమును)

రాము:—(తాటకను దఱుముచు) ఓసీ! బాలునితో నేమి? ఇటు రమ్ము (అనివింటికొనతో వీపుమీఁద పొడుచును.)

తాటక:—(రామునివైపుతిరిగి) ఆ (యనిమ్రింగఁబోవును)

లక్ష్మ:—(కత్తితో తాటకవీపుపై నేసి) ఈదెబ్బతోఁ జచ్చెదవులే రక్కసీ.

తాటక:—(లక్ష్మణుని దిరిగి తఱుముచు) అబ్బా! ఎంతదెబ్బకొట్టితివి. నిన్నింక విడువను.

విశ్వా:—రామా! ఇదే సమయము. ఇప్పుడస్త్రప్రయోగముచేయ నిచో నిదిలక్ష్మణుని మ్రింగును.

రాము:—ఇదిగో చేయుచున్నాఁడను (అని బాణమువదులును.)

తాటక:—(క్రిందబడి) హా! తెలిసినది. అగస్త్యమహాముని చెప్పి నాఁడు. నీవు సాక్షాచ్ఛ్రీమన్నారాయణుఁడవు. నీచే బడుటచే నేను ధన్యనైతిని. ఇఁక నీబాధభరింపఁజాల. శరమూడఁ బెరికి నన్ను బరమపదంబున కనుపుము.

రాము:—మంచిది. (అని శరములాగుచున్నాఁడు)

లక్ష్మ:—ఇన్ని పాపములు చేసిన రాక్షసిముండవు. నీకుఁ బరమప దమేమిటి; ఘోరనరకమున కనుపమనుము.

విశ్వా:—లక్ష్మణా! అట్లుకాదు. అన్నయ్యచేతిలో మరణమొందు టచే నిది ధన్యురాలుగాదా.

లక్ష్మ:—తాతగారూ! అవునండి. ఆమాటలు మఱచితిని.

రాము:—తమ్ముఁడా! మఱియొక సంగతి. చచ్చిపోవుచున్న యీ వనితను గర్ణకఠోరముగా దూషించితివి. శత్రుత్వమిత్రత్వము లీ లోకమందున్నంతవఱకే యుండునుగాని పరలోకమున కేఁగుచు న్నవాని శత్రువు నైనను గనికరమూననలసినదే సుమా.

లక్ష్మ:—అన్నయ్యా! తెలియక యంటిని. క్షమింపుము.

విశ్వా:—నేటికి నిఖిలజనకంటక యగు తాటక నేలఁ గూలుటచే నిచ్చటి సమస్తప్రాణులు సుఖింపఁగలవు. ఇఁక మనము ముందు బోవుదము రండు.

(నిష్క్రమించుచున్నారు.)

---

*

పంచమాంకము— రంగము. 3

సిద్ధాశ్రమము—(విశ్వామిత్రాదిమహర్షులు యాగముచేయుచుండఁగా రామ లక్ష్మణులు వింటను బాణము సంధించి ముందుండుదురు.)

రాము:—

ఉ. తమ్ముఁడ రాక్షసుల్ బహుళతంత్రవిశారదు లెన్నియేని రూ
పమ్ములఁ దాల్చి మాయలను బన్ని మునీంద్రనియజ్ఞము న్వినా
శమ్మొనరింపఁ జూతురు ప్రచండతరాస్త్రవిధానయుక్తకా
ర్యమ్ముల జాగరూకుఁడవునై బరిమార్పఁగఁ నెంచగా వలెన్.

ఈరాక్షసజాతి మొదటినుండియు లోకోపద్రవములఁ జేయుచునే యున్నది. ఒకడు ధాత యొద్దనున్న వేదంబుల హరించి మున్నీటఁ దాగియుండె. కొందఱు దేవతలకమృతంబులేక యుండ యత్నించిరి. ఒకానొకఁడు నిలాతలంబు చాపచుట్టగ జుట్టి యలయించె. ఇంకొకఁడు విష్ణుభక్తుఁడగు బాలుని పలుబాములు పెట్టి హింసించెను మఱియొకఁడు నింద్రుని బాఱఁదోలి స్వర్గరాజ్యము హరించెను. వేఱొకఁడు మునీశ్వరుని కామధేనువును దొంగిలెను. ఇవన్నియు గతములు. ఇప్పుడింకను దలబరువుగల రాక్షసులున్నారని వినుచున్నారము. వారిసాధులగు మునీంద్రుల యాగధ్వంసాదికార్యంబులహింసించుచుండుటచేఁదమనాశముతామె తెచ్చుకొనుచున్నారు.

గీ. సాధుసజ్జనసంతాపసంగతంబు
లయిన కృత్యంబులే కులక్షయముదెచ్చు
తానె నిర్మించుకొనునట్టి తంతువాస
ముననె మరణంబుగను సాలె పురుగు రీతి.

లక్ష్మ—అన్నయ్యా, అటులైన మనము నేర్చికొనిన యస్త్రవిద్యకు ఫలమేమి?

రాము—ఓయివెఱ్ఱివాఁడా. అట్లుగాదు మనము నిమిత్తమాత్రులము.

ఏకార్యమేని నిమిత్తము లేకుండ జరుగునా? మనధర్మము మనము నెరవేర్చికొనుటచే లోకంబున యశంబు గాంచుచున్నాము. అదియంతయుఁ దరువాత సావకాశముగాఁ జెప్పెదను. అదిగో. ఎవరో రాక్షసులు వచ్చుచున్నట్లున్నారు. భద్రంబుగానుండుము.

(మారీచసుబాహులు ప్రవేశించుచున్నారు.)

మారీ—(అపవారించి) ఒరేసుబాహు, వీరే దశరథరాజపుత్రులు గాబోలు. ఆముసలిరాజు సేనతోఁ దాను స్వయముగా రాక యీబొడ్డూడని వాళ్ళను బంపినాడేమిరా? కడుపునిండ నరభోజనము చేయుదమన్నను వీరొక్కదవడకిందికైనను రారు. నాకు మిక్కిలియాకలిగానున్నది. వీరినిద్దఱినొక్కకబళముగాఁగొందును.

సుబా—(అపవారించి) నాకు నీకన్న నెక్కుడాఁకలిగా నున్నది. నేనే వీరిని భక్షించెదను. పోనీ నీవొకని దినుము. నేనొకని దిందును.

మారీ—(అపవారించి) కానీ నాకొక సందేహము మాత్రము గలుఁగుచున్నదిరా. ఇంత చిన్నపిల్లవాండ్లను మనయమ్మ తాటక యేల మ్రింగలేకపోయెను? అంతే కాక వీండ్ల బాణమొక్కటిచే తనే నేలఁగూలినదఁట. కావున నేదో మాయవిద్దె వీండ్లయొద్ద నున్నట్లు తోఁచుచున్నది.

సుబా—ఏమున్నది నీమొగము. అమ్మ ముసలిదై యేపరాకునను న్నపుడో వీండ్లు కొట్టి యుందురు. నీకంతభయముగానున్న నీవు వాండ్లజోలికిఁ బోకుము. నేనే కడతేర్తును.

మారీ—ఓరీ! భయ మేమిటిరా, నీవేమందువో యని యంటినిగాని నాకేమిభయము. జలస్తంభనాదివిద్యల నెన్నియో నేర్చిన నాకీలోకమున భయమెవరివలన? చూడుము మిప్పుడే వాండ్లనెదుర్కొందును.

(అని రామలక్ష్మణులసమీపించి)

అరే. ఎవరురా మీరు? ఇంత నిర్భయముగా విల్లు నమ్ములు బూని కూర్చున్నారు. ఇది నరభోజనులు తిరుగు నుగ్రాటవి యని యెఱుఁగరో? మిమ్ము జూచిన జాలి వేయుచున్నది. మీదుండుగము లకుఁ గోపమును వచ్చుచున్నది. శీఘ్రముగా నవ్వలకుఁ బొండు. లేకున్న మిమ్మిద్దఱ నొక్కపెట్టున మ్రింగువాఁడ.

రాము—ఛీ, ఛీ, నోరుమూయుము.

పంచచామరము.

అరే దురాత్మ! యేల కాఱులాడె దీవు క్రొవ్వి సం
గరంబు సేయు మోపు దేని లేనిచోఁ దొలంగుమా
నరాశ నుండ వాచుఁ బ్రాణనాశనం బొనర్చు నీ
శరాసనంబు నెక్కువెట్టి చంపువాఁడ నిప్పుడే.

మారీ—ఏమీ!

పం. సురాసురుల్ జయింపరాని శూరు నిట్లు చుల్కగా
బిరానఁ బల్కెదౌర! యొక్కపెట్టునన్ ఖరాసిచే
ధరన్ బడంగ జేయువాఁడ దర్మ మేది యిచ్చటన్
దొలంగి వేని నిన్ను పీఁడ దుర్బలుండ వోవుమా.

లక్ష్మ—(సుబాహును ద్దేశించి)

సుగంధి. ఏలమూర్ఖ, చూచెదట్టులేను నీకు మృత్యువై
కూలనేయువాఁడ నొక్కకోలచేత, సాధులన్
జాలబాధలొందఁ జేయ సాహసింప తత్ఫలం
బోలి కట్టి కుడ్చుకుండ నోపునోటు దుర్మతీ.

సుబా—

ఉత్సాహ. చాలు చాలు, దుండగంపు సాహసంపు వాక్యముల్
బాలకుండ వోట నీవు బ్రతికిపోతి వియ్యెడన్
గోలఁబట్టి వేయనేర్తె గుర్తుకువచ్చి పిల్లనే
గేలిసేసి నట్టులయ్యె కీడు నొంద కేగుమా.

రాము—ఓరక్కసులారా, మనయుద్ధమునకిది తగినప్రదేశముకాదు ఎదుట నున్న యాసమప్రదేశమునకుఁ బోవుదము రండు.

మారీ-సుబా—అటులనే చేయుదము రండు.

(మునులు కాక యందరు నిష్క్రమింతురు)

(రామలక్ష్మణులు తిరిగి ప్రవేశింతురు)

లక్ష్మ—అన్నయ్యా, నీ రెంత సేపో పోరుదు రనుకొంటిని. నీవేసిన మొక్క బాణముచేత నే యొక్కఁడీల్గినట్లున్నాఁడే ఈ పెద్దరక్కసులతో యుద్ధమొనర్ప నాకవకాశమే యీయవైతివి.

రాము—తమ్ముఁడా! యీపెద్దరక్కసులలో నొకఁడు నేల గూలినాఁడు. రెండవవాఁడు వాయువ్యాస్త్రముచే నెగురఁగొట్టబడినాఁడు. ఎక్కడఁబడినాఁడో తెలియరాకున్నది. కాని బహుదూరమునుండియుండును. నీవుచిల్లరరక్కసిమూకలనేమిచేసితివి?

లక్ష్మ—మొదట బాణంబులచే సంహరింప యత్నించితిని కానివారు పెచ్చుపెరిగి విచ్చలవిడి వచ్చుచుండుట చూచి యాగ్నేయాస్త్రంబుం బ్రయోగించితి. అదియొక్కమ్మడి వారినందఱ ముట్టడించి భస్మంపురాసులుగ నొనర్ప నింక నక్కడఁ జేయుపని లేక తిరిగి వచ్చితిని.

రాము—సెబాస్ తమ్ముఁడా సెబాస్! అస్త్రవిద్య సమయస్ఫూర్తిగా బ్రయోగించితివి! ఇఁక నీ బుషీశ్వరుని యాగము నిర్విఘ్నముగాఁ గొనసాగుగాక.

విశ్వా—(ఋషులతో వచ్చి) జయము, జయము, దశరథాత్మజులారా, జయము. మీ వక్రపరాక్రమవలనను మీ బాహుపరాక్రమమువలనను యాగము పరిసమాప్తి నొందుటయేగాక రాక్షసబాధయు నివారణమైనది. యజ్ఞేశ్వరుని యాప్రసాదముఁ ముందుగ్రహియింపుఁడు, (పూలమాలికలు మెడలలో వైచుచున్నాఁడు)

రామ-లక్ష్మ—మహాప్రసాదము (అని నమస్కరించుచున్నారు)

విశ్వా-ఋషులు—(చేయెత్తి) కల్యాణమస్తు. శీఘ్రకల్యాణమస్తు.

విశ్వా—ఆహా

మ. చిరకాలంబున కాత్మవాంఛితము మచ్ఛ్రేయోభిధాయంబు నీ
నరమేధంబొనరింపఁ జాలితి భవత్ప్రాచుర్యసాహాయ్యబం
ధురతన్ బ్రత్యుపకారమేమి యొనరింతున్ మీకు సర్వార్థముల్.
గరిమం గూర్చుచు దేవుఁడీవుత మహాకల్యాణసౌభాగ్యముల్.

రామ—మునీంద్రా యట్లనెదరేమి? ఇందు మేమేమి యొనర్చితిమి. మీవిద్యాప్రభావమే యీకార్యనిర్వాహణకారణము.

విశ్వా—రామచంద్రా. గురుభక్తి ప్రకటితముగా నీవాడిన యీపలుకులకు మోసపోవువాఁడనుగాను. నీవెవరవో నేనెఱుఁగనా? ఇఁక రండు నేటికి విశ్రమింతము.

(అందఱు నిష్క్రమింతురు.)

శ్రీ

అహల్యాశాపవిమోచనము.

షష్ఠాంకము.

రంగము. ౧

(విశ్వామిత్రుఁడు, రామలక్ష్మణులు ప్రవేశింతురు.)

విశ్వా—రవివంశశ్రేష్ఠములారా, కాల్యంబులు నిర్వర్తించికొనిరా? రేయి సుఖసుషుప్తిం జెందితిరా? హంసతూలికాపర్యంకంబులఁ శయనించు మీకీ కుశాస్తరణంబుల నంతగా సుఖనిద్రయుండక పోవచ్చును. కాని రామచంద్రా, కొలఁదిదినంబులలో యువరాజ్యపట్టాభిషేకముం బడసెడు నీకు యరణ్యవాసుల కష్టసుఖము లిట్టియనుభవమూలమునఁ దెలిసినట్లు మఱొకవిధమునఁ దెలియనగునే?

గీ. స్వానుభవమూలమున గాంచు నట్టి తెలివి
కన్యబోధలచేఁ గల్గునది సమంబె
సుందరాంగిని గనులారఁ జూచుముదము
గలుగునే చిత్రరూపవీక్షణము చేత.

రామ:—ఆర్యా! అట్లనెదరేల? మాకేకొఱంతయు లేక యిట్టిదగ్గఱకంటె సుఖతరంబుగ నీతరువరంబులఁ జల్లనిగాలి మేనిసోఁకి నిద్ర పట్టినది. తండ్రిగారెప్పుడును

గీ. అడవులందున వేఁటాడి యలసి యుండి
చెట్లనీడను నిద్రించు శ్రేష్ఠసుఖము
రాజకార్యనిమగ్నత రాక నిదుర
హంసతూలికశయ్యలం దరయ నెపుడు.

అని చెప్పుచుందురు. అది మాకు నేఁడు కొంతయనుభవము లోనికి వచ్చినది. తెలవాఱు నపుడు మాత్రియొక స్వప్నము వచ్చి యందునతిరమణీయమైన ఫలమొకటి మీరు నాకిచ్చినటుల నయ్యె ను. దానిఫలమేమో.

విశ్వా:—తెల్లవాఱునపుడు వచ్చుస్వప్నము యథార్థఫలమిచ్చును. మాయాశ్రమంబునకు వచ్చి యుండుటచే నట్టియపూర్వసౌంద ర్యావనీజాతఫలంబు మీకుఁ బ్రత్యక్షంబుగనే లభించుగాత. ఇఁ కను మత్పూర్వార్జితంబులైన మహామహిమ గలయస్త్రంబులు గొన్ని మీకుపదేశించి యిచ్చెదను. వానిచే సర్వశత్రుసంహా రంబు గావించి యశంబు వడయుదురు. (అని కొన్నిబాణములు తీయుచున్నాఁడు.)

రాము:—మహాప్రసాదము

లక్ష్మ:—తాతగారూ! అస్త్రములు మంత్రములు కావా? ఏమిటి సంచిలో నుండి తీయుచున్నారు?

విశ్వా:—ఔను మంత్రములే. అవి యీశరములపై లిఖింపఁబడి కొ న్నియంత్రరూపమునఁ గూడ నున్నవి. వాని ప్రయోగోపసం హారములు నేను జపముచేసికొన్నతరువాత నుపదేశింతును.

లక్ష్మ:—మహాప్రసాదము.

విశ్వా:—(బాణములఁదీయుచు) ఇదిగో ఇది బ్రహ్మాస్త్రము. దీనిచే నెట్టి కఠినది శత్రువైనను మూర్ఛ నెందును. ఒకవిధమగు ప్ర యోగముచే సర్వసంహారము చేయును. ఇది యాగ్నేయాస్త్ర ము. సర్వశత్రుదాహకము. ఇది వాయువ్యాస్త్రము. దీనిచే శత్రు వులు ప్రచండమారుతమున దూదిపింజలవలె నెగిరిపోదురు. ఇది సమ్మోహనాస్త్రము. దీనిచే శత్రుసైన్యమంతయు మూర్ఛిల్లును. ఇది మహాద్భుతమైన నారాయణాస్త్రము. దీని కేదియు నడ్డులే

డు. ఇది ఎదిరి ప్రయోగించు సర్వాస్త్రంబుల దిగమ్రింగి శత్రు నాశం బొనర్చును. మఱియు జృంభకాస్త్రాదులు కొన్ని యిది వరలో మీకుపదేశించి యుంటి. వీనిబలంబుచే మీరు లోకకం టకులైన శత్రువులఁ దున్మాడి ప్రజామోదముగ లోకపాలన మొనర్తురు గాక.

రామ-లక్ష్మ:—మహాప్రసాదము.

(ఒకఁడు ప్రవేశించుచున్నాఁడు.)

ఒక—మహాత్మా నమస్కారము. (అని విశ్వామిత్రునికి నమస్కరించును.)

విశ్వా—నీవెవ్వఁడవు?

ఒక—నేను మిథిలేశ్వరుండను జనకచక్రవర్తి సేవకుఁడను. మామహారాజుగారిలేఖను బటమును మీకు నర్పింప నన్ను బుత్తెంచినారు.

(అని యుత్తరమును జిత్రపటమును నిచ్చుచున్నాఁడు.)

విశ్వా—రామచంద్రా! ఈయుత్తర మేమియో చదువుము. శుభలేఖ వలె గాన్పించుచున్నది.

రాము:—(లేఖవిప్పి)

"స్వస్తి శ్రీమదఖండతపోవిరాజమానబ్రహ్మతేజోరూపులగు విశ్వామిత్రులవారి పాదపద్మములసన్నిధికి. భవదంతేవాసి మిథిలా పురీశ్వరుండగు జనకుండు వ్రాసికొను శుభలేఖార్థవిజ్ఞాపనములు.

నాడు యజ్ఞార్థంబు నేను పుడమి దున్నించుచుండగా హలాగ్రంబునకొకపేటిక దగులుటయు, నందు సురుచిరరూపవతి యగు నొకకన్యకామణి లభ్యంబగుటయు దానికి సీతయను నామంబిడి నేను మత్పుత్రికగాఁ బెంచుచుండుటయు మీఱెఱింగినదేగదా. ఆసీత శీత మయూఖునిం బోలె నానాఁటికిఁ గళల నభివృద్ధి చెందుచు మద్గృహం

బున వంశానుగతంబుగ నర్చింపఁబడుచు మహాభారము గలిగి వేవురు బలాఢ్యు లెత్తఁదగిన శివశాపంబు సలీల నొక్కచేత నాటలనడుమ నెత్తి యిటు నటు బెట్టుటంగాంచి భయాద్భుతరసనిమగ్నుండనై యీమె కెవ్వరు భర్తగానుండఁదగినవారని చింతించుచుండి పరిణయకాలమురాఁగా నాధనువెవరెక్కుబెట్టిన వారికి నీమె నిత్తునని ప్రతిన జేసి రాజలోకంబునకు శుభలేఖల నంపి యున్నవాఁడను. వారందఱు త్వరలో యిచ్చటకు వచ్చి తమధనుర్విద్యాకౌశలముఁ జూపుదురు. తత్సమయంబున మీరు బంధుమిత్రభృత్యసహితంబుగా విచ్చేసి సన్మానసందర్భముఁ జేయ గోరుచున్నాఁడను. చిత్తగింపుఁడు.

ఇట్లు,

భవదత్యంతవిధేయ సేవకుఁడు

జనకుఁడు."

విశ్వా—ఓహో, అన్నియును క్రమముగా వచ్చుచున్నవి. సీతాకళ్యాణమహోత్సవమును జూచుటకును జనకచక్రవర్తికి మాయందుగల తాత్పర్యమునకును జాలసంతోషముగా నున్నది. రామచంద్రా, నేనీసేవకునకుఁ గొన్ని సంగతులు చెప్పి పంపించి వచ్చెదను. మీరిం దిచ్చటనే యుండుఁడు.

(సేవకునితో నిష్క్రమించుచున్నాఁడు).

రాము—(చిత్రపటము తీసి చూపుచు) లక్ష్మణా, యీజనకరాజపుత్రివిలాసముజూచితివా?

ఉ. మేలిమిబంగరున్ దనువు మీరినదైన శిరీషపుష్పమున్
బోలెడు మార్దవంబున ప్రఫుల్లసరోజవిలాసమయ్యు నె
వ్వేళను దోఁచుమోము ప్రతిబింబమిదయ్యు నిజాకృతిన్ బలెన్
గ్రాలెడు నోర! శిల్పినిపుణత్వము, సత్యము, తోఁచదాత్మకున్.

మఱియు

సీ. లేనవ్వువెన్నెలల్ గానుపించుచునుండ
ముఖము చందురుఁడన బోలదొక్కొ
తలిరుహస్తంబులు దనరారుచుండంగ
గలికి లతాతన్వి గాదెచూడ
చూపటు ధైర్యంబు నుగ్రక్కఁజేసెడు చూపు
లతనుతూపు లనంగ నబ్రిమానె
వీక్షణాస్త్రంబుల వెదజల్లగాఁ జాలు
భ్రూకుటి మరునికార్ముకముగాదె
గీ. ఎదుటివారిని లోగ్రిహించుచు వీనిఁ
జెక్కుటద్దములని చెప్పఁ జిత్రిమానె
అధరసుధతోడ జన్మంబు నంది యుంట
శ్రీమహాలక్ష్మి యే యనఁ జెలఁగుగాదె.

లక్ష్మ:—అన్నయ్యా! నీవనినట్లీమె శ్రీమహాలక్ష్మివలెనే శాంతరసమొలుకు దృష్టులతోఁ గానవచ్చుచున్నది. వసిష్ఠభగవానులు నిన్న శ్రీమన్నారాయణావతారంబుగఁ జెప్పుచుండుటవలన నిదివఱకే మీకుదైవఘటన యున్నట్లు తోఁచుచున్నది.

రాము:—లక్ష్మణా! ఈచిత్రపటమందలి యిఁక నొక విశేషము చూచితివా?

మ. హరుచాపం బొకకేల నడ్డముగ నొయ్యారంబుగా బూని యే
శరముం గూర్పక కివిగానిలుచు నీచంద్రాస్య నీక్షించితే
విరిబాణంబుల నెప్పుడుం గలుఁగమిం బేసారి చాపంబునం
స్మరుఁడీయింతిని నూత్నబాణముగ దా సంధించినట్లొప్పెడుం.

లక్ష్మ—అన్నయ్యా, అంతియు కాదు.

గీ. దుష్టసంహారమొనరించి శిష్టజనుల
బ్రోవ నీచాప మెవ్వడు బూని తనదు

జనని భూదేవిభారంబు సరగ ద్రోచు
వానికేల్గొన, గోరెడుదాని బోలు.

రాము—నీవు చెప్పినదియు సమంజసముగా నున్నది. దుష్టనిగ్రహ శిష్టసంరక్షణము లుత్తమక్షత్రియ ధర్మములే కదా. ఈతన్వి నిశ్చయముగా నుత్తమక్షత్రియార్హయే.

లక్ష్మ—కాని జనకమహారాజు శివచాపఖండన మొకప్రతిజ్ఞగా నుంచినాఁడే అది సుసాధ్యమా?

రాము—అది దేహబలముచే సంతసుసాధ్యము గాకపోయినను లక్ష్య పాటవంబున నవలీల నెఱవేర్ప నగును.

లక్ష్మ—ఆయితే, మన కాహ్వానములేకుండ మిథిలకుఁ బోవచ్చునా?

రాము—ఓయి వెఱ్ఱివాఁడా, విశ్వామిత్రమహర్షికి సచ్ఛాత్త్రింబుగ రమ్మని వ్రాయలేదఁటోయి మనము ఛాత్రులమగుదుమహా కామా? అదియునుంగాక పౌరుషకార్యనిర్వాహణాంబులకు వేఱుగఁ బ్రత్యేకించి యాహ్వాన మక్కఱలేదు. రాజలోకమంతయు నుద్దేశింపఁబడినదే.

(తే ఱ లో)

మ. పవనోద్వేగము జాఱ వృక్షములు స్తంభప్రక్రియన్ జూపు; జంతువులున్ మేఁతకు నేగి యిక్కలకు గంతుల్ వైచుచున్ బాఱు;పాట్టివిగా నీడలు దోఁచు భాస్కరుని ధాటిన్ జూడ మధ్యాహ్నమౌ రవివంశాగ్రణులార! రండిఁకను గార్యంబుల్ ప్రవర్తింపఁగన్.

రాము—అదిగో! విశ్వామిత్రులవారి యాజ్ఞయైనది. లోనికిఁబోవుదము రమ్ము.

(నిష్క్రమించుచున్నారు)

షష్ఠాంకము—రంగము ౧.

అరణ్యమార్గము.

(రామలక్ష్మణులు ప్రవేశించుచున్నారు.)

రాము—తమ్ముఁడా, విశ్వామిత్రమహర్షి యత్రిమహామునితోఁ గొన్ని సంగతులు మాట్లాడి వచ్చెదననియు మనల నీమార్గంబున జనుచుండుఁడనియు గదా సెలవిచ్చిరి. ఆయన యింకను రాలేదు.

లక్ష్మ—అవును. ఆయన వచ్చెదనుక నిక్కడ కొంతసేపాగుట మంచిది యనితోఁచుచున్నది.

రాము—అట్లు చేయుదము. దాని వలన నిచ్చట వింతగా నున్న యరణ్యసౌందర్యముం దిలకింప నవకాశమబ్బును. లక్ష్మణా యిటు గనుము.

రగడ— ఈవనముఁ గన నెంతయు చోద్యము
భావింపగ సర్వంబును హృద్యము.
సాలము లంబర సంగతములునయి
చాలబలిష్ఠత జవమోదములయి
వల్లీ వేల్లితవరకాండములయి
చల్లనినీడల శాంతిదములునయి
స్వాదురసాస్వాద ఫలభరితములయి
మేదురగంధామితపుష్పములయి
శుకపికకూజితశోభితములునయి
సకలవిహంగమసంవాసములయి
యెంతయునొప్పెడు;

లక్ష్మ—..................నిటుల ఘనముగను.

వింత నెసఁగు పృథ్వీధరమునుగను
హిమవన్నగమును హెచ్చైడు నున్నతి
అమరవరుల ప్రాపయ్యెడు నీక్షితి
రమణికి శిరమయి రమ్యలతాదులు
విమలశిరోజపువితతిగఁ దోఁచులు
పాపటవలె నిబ్బరముగఁ దోఁచెడు
గోపురముండెడు గహ్వరములుగడు
భీకరములునౌ బెబ్బులి పిండులు
నాఁకటఁ బైఁబడి హర్యక్షంబులు
కరికుంభంబుల ఖరనఖరంబుల
వెరవుగఁ జీల్చఁగఁ బృథ్విని జలజల
రాలెడు ముత్యపురాసుల గనుమవె

రాము—— శైలశిఖరనిర్ఝరవాహములవె
శిలలనుబడి రొద సేయమయూరము
లెలమిని నాడెడు నింపుగఁ జూడుము
అద్దైన గనుము పయఃపూర్ణంబులు
ముద్దులొలుకు నంబుజకీర్ణంబులు
ఘనసారములౌ కాసారంబులు
కనులకుఁ జల్లగ కల్హారంబులు
సారంగంబుల ఝుంకారంబులు
కోరని శృతియై కోకిలరవములు
గానామృతమై కర్ణమునింపెడు
సూనామోదము చూఱగొనుచుకడు
మెల్లనవీచు సమీరపు గొండములు
చల్లఁగ పాంథశ్రమహరణంబులు

గా నలరారెడు గంటే సోదర
కానలసుఖము జగాననులేదుర.

విశ్వా:—(ప్రవేశించి) రామచంద్రా! ఏమనుచుంటివి? అరణ్యావాససౌఖ్యమే మెక్కుడనియా? ఔను. అట్లు తోఁచుట యుచితమె. సదాజనాకీర్ణములై మనోద్వేగవృత్తుల నాపాదించు నగరంబుల నివసించుచు నెప్పుడో యొకసారి యీనిర్జనప్రదేశములం గాంచి ప్రకృతిసౌందర్యముం దిలకించువారికివి సౌఖ్యావహములుగ గన్పట్టు. అట్లనే యీపర్ణశాలలవసించువారికి నగరసందర్శనమై నయప్పు డచ్చటి కృత్రిమవస్తురామణీయకమును నివ్వెఱపుట్టించెను.

రామ—అటులైనచోఁ గొంతకాలమడవులయందును మఱికొంత కాలమునగరులందును వసించుటచే నిట్టిభ్రాంతులు తొలఁగున ని మీయభిప్రాయమా?

విశ్వా:—ఒక్కభ్రాంతినివారణార్థమే గాదు. ప్రతిమనుజునికి నట్లుండుట యవసరమైయే యున్నది. లోకోపకారార్థమును లోకజ్ఞానముకొఱకును నగరులందు వసించుటయు నాత్మోపకారార్థము నాత్మజ్ఞానముకొఱకు నడవులందు వసించుటయు సామాన్యముగాఁ గావలసియే యున్నది. కాని మహాత్ము లెక్కడ నున్న నుభయతారకముగానే వర్తింతురు. అందునకు మనముచూడఁబోవు మిథిలాపురచక్రవర్తియే నిదర్శనము.

రామ—నగరులనున్నవారిలో వారును కాననముల నున్నవారిలో మీరును నిదర్శనులని మాయమ్మ సుమిత్రాదేవిగారివలన నిదివఱలో వినియున్నాఁడను.

విశ్వా:—అట్లుగాదు. జనకచక్రవర్తివలె నుండుటయే కష్టము. అస్మదాదులు పెక్కండ్రు గలరు. ఇఁక నాలస్యమగు చున్నది.

మనము నడుచుచు మాట్లాడుకొందము రండు.

(అని అందఱు కొంత నడుచుట నభినయించి)

విశ్వా:—రామచంద్రా, ఈవనప్రదేశ మెంతరమణీయముగా నున్నదో చూచితివా? దీనికిఁ గాశ్యపవనం బని పేరు. ఇచ్చట నదితికశ్యపులు శ్రీమన్నారాయణునిగూర్చి ఘోరతపం బొనరించిరి. వారితపోమహిమచే నిందుఁ బ్రవేశించుఘూకుకమృగంబులు తమక్రౌర్యం బు విడిచి సాధువులుగా నిప్పటికిని గన్పట్టు.

రాము—ఈతపోవనసందర్శనంబుచే ధన్యులమైతిమి నిరంతరఫలకుసుమవిరాజితంబులగు వృక్షజాలంబులచే మనోహరం బగు నీప్రదేశము తపంబున కెంతయు నర్హమై యున్నది.

విశ్వా:—ఇదిగో. ఇది యింద్రతీర్థ మనుపేరిటి సరోవరము. తొల్లి బలిచక్రవర్తిచే స్వర్గపదచ్యుతుఁడైన దేవేంద్రుఁడు శ్రీమహావిష్ణువుఁగూర్చి యిచ్చట ఘోరతపం బొనరించినాఁడు.

లక్ష్మ:—ఈయిందుద్రవ కెప్పుడు నేదో కష్టములు కలుగుచునుండునే. కారణ మేమై యుండును మహాత్మా?

విశ్వా:—లక్ష్మణా, దానికి సర్వజగత్కారణుం డైన యీరామచంద్రమూర్తియే కారణము. మొదట నుత్కృష్టపదవుల నొసంగి వానిచే గర్వపడుచుండువారిని దిరిగి తత్పదచ్యుతులం జేసి గర్వరహితులైై తన్ను గొలిచినచో తిరిగి యుద్ధరించుచుఁ దోలుబొమ్మలట్లు సిఁడిగ మంతయు నాడించు నీమహానుభావుఁడే కారణము.

రాము—మునీంద్రచంద్రమా! మీశిష్యునికే యింతసామర్థ్య మున్నచో మీమహత్వంబు లోకమం దెట్లు ప్రఖ్యాతమై యుండునో వేఱుగఁ జెప్పనేల? మీయనుగ్రహము వడసినవాఁడు స్వర్గచ్యుతుఁడైనను వానికడకే స్వర్గము వచ్చునట్లు జేయుదురుగాదె?

విశ్వా—రామచంద్రా! ఇట్టిమాటలచే నేలమానముచేసెదవు? నీ వెవ్వరవో యెఱుంగనివాఁడను కాను. నీశిష్యత్వముకొఱకే యెన్నినాళ్ళనుండియో వేఁచియున్నవాఁడను. సురూపలావణ్యవతి యగుకన్యకారత్నమును దగినవరుని కొసంగి సంతసించు జనకు నివలె మదధీనంబై యున్నవిద్యల నీకొసంగి తరించితి నని సంతసించుచుంటిని. సచ్ఛాత్రునిచే గురునిప్రతిభయు గురునిచే ఛాత్రునిప్రతిభయుఁ బ్రకాశించుట లోకవిదితమే కదా?

రాము—ఇఁకమీశిష్యవాత్సల్యతకు మేరఁ గన్పించుట లేదు. స్వామీ! యీపాడుపడిన గృహంబులుగలవసభూమి యెవరిది? వసంతకాలమునకు ముందెండిపోయినట్లు గాన్పించు వృక్షములవలె శోభారహితమయ్యు నంతస్సారమెడలనియట్లుఁ దోఁచుచున్నది.

విశ్వా—సర్వజ్ఞుఁడవగు నీకుఁ దెలియని దేమున్నది? ఇదియే నేనిదివరలోఁ జెప్పిన గౌతమాశ్రమము. మహానుభావుఁడు గౌతముఁడు ద్వాదశవర్షక్షామము పట్టినప్పుడు ప్రజల నెందఱినో తన ప్రజల నట్టిగృహంబులనిలిపి నిరతాన్నప్రదానము చేసి రక్షించినాఁడు.

సీ. కటకటంబడుచు నాఁకటిబాధ కోర్వని
జీవకోటులను రక్షించినాఁడు
దినదినంబును ధాన్యమును జల్లి పంటలఁ
బండించి క్షామంబు బాపినాఁడు
ఆంధ్రులదైన్యంబు లడుగంట గోదాన
దినది తెచ్చి పాలించినాఁడు
ధర్మసూక్ష్మంబుల ధాతను మెప్పించి
పడఁతియహల్యను బడసినాఁడు

గీ. న్యాయశాస్త్రమునందు తనంతవారి
శిష్యగణమును బోధించి చేసినాఁడు
యట్టిగౌతముఁడిటలేక యకట! యెట్లు
సర్వమును మాఱె కాలవశంబుచేత.

రామచంద్రా! యీప్రదేశము చూచినకొలఁది మిగులసం
తాపకరముగా నున్నది.

మ. ఇటఁ గౌతమమునీంద్రుఁడు వేల్పులనగ్నులనిటన్ హోమచ్చొనగాత్రిఁబుతో
జటల న్వేదము చెప్పుశిష్యతతి యత్రశాంతంబుగా నన్నమి
చ్చుట నొడ్డించె నహల్య బీదలకు వాసంబిచ్చుచున్ నిమ్నగా
తటమందచ్చట వేకువన్ దపము శ్రీధ్యాన్ జేయు సమ్మౌనియున్

రామ—ఆహా, యిట్టి పవిత్రతరమైన భూములఁ జొచ్చుటచే నేఁడు
మిగులఁ బావనులమైతిమి.

లక్ష్మ—అన్నయ్యా! ఆశిలాఫలకముం జూచితివా? భూకంపమువ
చ్చినరీతిఁ గొంచెము హఠాత్తుగాఁ గదలినట్లు గోచరించినది.

రామ—ఏమీ! అచ్చటనేమైన జీవజంతువులు గలవేమో చూతము.

(అని తాయివలనడుఁగులు వడగా తాయియదృశ్యమై యహల్యలేచి
నిలువఁబడి దోసిలిబట్టి)

అహల్య—(దండకము.)

జయజయ శ్రీరమాకాంత, భక్తాంతరంగప్రమోదప్రదా, స
ర్వసాక్షీ, జగత్కారణా, శుద్ధతేజంబవౌ నీవు సర్వప్రపంచస్వరూపం
బుగా మాఱి వేడ్కన్ విజృంభించి నీలోన సర్వంబుగొంచున్ ల
యంబొందఁగాఁజేసి క్రీడింతు వొక్కొక్కవేళన్ బ్రపంచంబునన్
దుష్టసంఘంబు హెచ్చి నికృష్టాత్మతన్ శిష్టసంఘంబులన్ గష్టము
ల్ పెట్టుచున్ ధర్మముల్ నెట్టుచున్ కర్మముల్ మెట్టుచున్ సర్వమున్
దారె యంచున్ బ్రవర్తిల్లఁ జితావతారంబులన్ భూమిస్సై నెత్తి

దుర్మార్గులఁ జంప ధర్మంబు స్థాపింపవే మన్నవే భూమిభారంబు పో
ద్రోయుచున్ బెంపవే పుణ్యమున్ సౌఖ్యమున్ లోకమం దెల్లడన్
సజ్జనుల్ మెచ్చగన్ సర్వకర్మాళి నిష్కామవృత్తిన్ బ్రవర్తించి నీ
యందె సంపూర్ణమౌ నమ్మికన్ భక్తియున్ గల్గి జీవించు భక్తాళి
కేయాపదల్ రాక యుండంగ రక్షింపవే సర్వసర్వంసహాధారయో
వీర, ధీరా, స్మరాకార, నీసేవయందే సదామగ్నులై యుండు శ్రీ
దేవియున్, భారతీకాంతుఁడున్, పార్వతీకాంతుఁడున్, నీమహాత్మ్యం
బు పూర్ణంబుగా గానరారన్నచో మూఢురాలన్ మహాపాతకిన్
స్త్రీని నేనెట్లు వర్ణింపగా నేర్తు బ్రహ్మాండభాండమ్ములన్ సర్వదా కక్ష్య
మార్గంబులన్ గొప్పవేగంబుతో సంచరింపంగఁ జేయన్ బ్రచండ
ప్రభాదీప్తులన్ నిత్యమున్ దప్పకుండన్ సకాలంబునన్ సూర్యుఁ డే
తెంచి చీఁకట్లువాపన్ జనాకర్షణం బొప్పగాఁ జేసి మేఘంబులన్ గూ
ర్చి వర్షంబుచే సస్యవృక్షాదులన్ బెంపఁగా సర్వజీవాళి కాధారమై
వాయుదేవుండు కాలోచితంబైన మార్గంబునన్ వీచుచుండన్ సము
త్తుంగరంగత్తరంగంబులన్ సాగరుం డేచి లోకంబు నాశంబు గాకుం
డ మేరన్ బ్రవర్తింపగా నీయలంఘ్యం బవార్యం బచింత్యంబు నౌ
యాజ్ఞచేఁ గాదె దేవాధిదేవా మహాప్రభావా, లసత్కీర్తిసాంద్రా,
కకుత్స్థాన్వయాంభోధిచంద్రా, నతాభీష్టనిస్తంద్రా, శ్రీరామచంద్రా
నమస్తే నమస్తే నమస్తే నమః. (అని ప్రణమిల్లును.)

రాము—అమ్మా, లెమ్మ నీ వెవరో తెల్పుము.

అహ—

మ. తొలి నేఁ జేసిన పాపకర్మమున నెంతో హీనమౌ రాయిజ
న్మ లభించెన్ బతిశాపమూలమున నింద్రద్రోహకృత్యంబునన్
జలజాతాసనపుత్త్రి గౌతమునిభార్యన్ నే నహల్యన్ త్వదీ
య లసత్పాదరజంబు సోఁకి నిజదేహం బందితిన్ ధన్యనై.

రాము—ఓహో, గౌతమమహర్షి పత్నియైన యహల్యవేనా?
అమ్మా, నమస్కారము.

(అని రామలక్ష్మణు లిరువురు నమస్కరింతురు.)

(విశ్వామిత్రునిజూచి) ఆర్యా! గౌతములవా రిప్పు డెక్కడ నున్నారు? వీరివృత్తాంతము సర్వము మీరిదివఱలో సెలవిచ్చియున్నం దున మాకుఁ దెలిసినది.

విశ్వా—అహల్య శిలయై యున్నప్పుడాయన గౌతమీనదీతీరమునఁ గోటిలింగక్షేత్రమున జపముచేసికొనుచు—

(తెరలో)

ఉ. ధన్యుఁడనైతి నేఁడు హరిదర్శనమయ్యెడు యోగనిష్ఠచే
నన్యము సర్వముం విడిచి యాత్మత దేశవిలగ్నమైనయా
పుణ్యులకుం లభింపని యపూర్వముదాసహాహా; సహల్యయే
ధన్యత గాంచె ముందుగను దర్శనలాభము గాంచి పూతయై.

అదిగో త్రికాలవేదియైన గౌతమమహర్షియే యిటకు వచ్చుచున్నాఁడు.

(గౌతముఁడు ప్రవేశించి "ధన్యుఁడనైతి" ననుపూర్వోక్తపద్యమును జదువును.)

అహల్య—నాథా నమస్కారము. (అని ప్రణమిల్లి) చిరకాలమునుండి నేను వాంఛించుచున్న నీపాదసేవ తిరిగిలభించుటచే నేఁడు ధన్యురాలనైతిని.

గౌత—ప్రేయసీ! లెమ్ము. చిరకాలవిరహమనుభవించినతఱువాత తిరిగి నన్ను బొందుటచే నీవు మునుపటికంటె వేయిమడుంగు లెక్కువగ నాకుఁ బ్రేమాస్పదురాలవగుచున్నావు. మఱియు నీవెవరిచేఁ బూతదేహనైతివో యామహాత్మునకు ముందుగ మనము నమస్కరింతము. (అని రామునివైపుచూచి)

సీ. శ్రుతిశిరోగ్రములందు సతతంబు చరియించు
  నడుగుదమ్ములకుఁ జోహారొనర్తు
శ్రీవధూటీకరాంచితపల్లవాన్విత
  పాదపుష్పములకు వందనంబు
ద్విజేంద్రయోగీంద్రహృదయబంభరగమ్య
  చరణాబ్జముల నమస్కారమిడుదు
భక్తకోటి తరింప భవసాగరంబందు
  ప్లవముతో పదముల ప్రణుతిగొల్తు
గీ. పూర్వగాథలఁ దడవంగ బోవనేల
ఱాయియౌ నీయహల్యను రమణిచేసి
బ్రోవఁజాలిన యీపదాంభోరుహముల
కేనొనర్తు వందనములు వేనవేలు.

రాము—మహాత్మా, మీరు పెద్దలట్లనుట జనదు. మీకే మేమనేకవేల వందనము లర్పించుకొనుచున్నారము.

(అని లక్ష్మణునితో నమస్కరించుచున్నాఁడు.)

గౌత—ఆధ్యాత్మికవృత్తిచే మాకెల్లరకు నీవువందనార్హుఁడవు. ప్రాపంచికవృత్తిచే లీలామానుషవిగ్రహుండవైన నీకు మేమువందనార్హులమైతిమి గాన నీయాశీర్వాదము బడయుము. మీరు దీర్ఘాయుష్మంతులరై గురుప్రతిజ్ఞాధురంధరులై లోకకంటకనిర్మూలనం బొనర్చి యశంబుగాంచి చిరకాలము ప్రజానురాగంబుగ రాజ్యపాలనముచేసి సమస్తసౌఖ్యంబులఁ గాంతురు గాక.

(అని విశ్వామిత్రునిఁ జూచుచున్నాఁడు.)

విశ్వా—తథాస్తు. అవతారముఖ్యోద్దేశమంతయు వెల్లడిచేసినారు.

గౌత—మఱియు నింకనొకసంగతి. చిరకాలవియోగదుఃఖముచే కృశించియున్న నాకుఁ దిరిగి యహల్యను నాడాధాతయిచ్చుటబద్ధ

ముగను నీవునేఁడిచ్చుటనిజముగ ననుఁగొనుసర్గానంద పరవశునిగఁ జేసితివి గాన నీవు నచిరకాలముననే రూపలావణ్యాతిశయంబుల నద్వితీయయు మహాపతివ్రతయుఁ గాదగు వనితారత్నముం బడయుదువు గాక.

విశ్వా—తథాస్తు. చేసిన కర్మకు ఫలము భగవంతునియట్టివానికిఁ గూడ ననుభవింపక తప్పదాయేమి మహాత్మా!

గౌత—(నవ్వుచు) మిత్రమా, విశ్వామిత్రా, లెస్సగాఁబల్కితివి కర్మఫలంబు లవశ్యమనుభోక్తవ్యములే. కాని నీయట్టి యపరవిధాతలు సృష్టికిఁ బ్రతిసృష్టి చేసి తప్పింపకుండ నుండవలెనుగదా!

విశ్వా—ధాతసృష్టికైన మార్పుగలుగునుగాని మీవాక్యములమోఘములు. ఇందులకు మీకథయే తార్కాణము.

గౌత—శ్రీరామచంద్రా, నీకింకేమైనఁ గోరికకలదా?

రాము—సర్వము మీదర్శనమువలననే సిద్ధించినవి. అయిన నిట్లగుగాక.

(భరతవాక్యము.)

ఉ. నీతియు సత్యమున్ వదలనేరక భూప్రజలుందురుగాక దు
ర్నీతిపరుల్ నిశాచరులబృందము నాశనమొందుగాక సత్
ప్రీతియు దైవభక్తియును వీడక యుందురుగాక యెల్లరున్
ఈతిభయంబులొందక మహీపతిపాలన మొప్పగావుతన్.

(అందఱునిష్క్రమించుచున్నారు.)

గౌతమ—
విశ్వా— } తథాస్తు. తథాస్తు.

సంపూర్ణము.

అనుబంధము — పాటలు.

(3వ పేజీలో లయగ్రాహితరువాత నటి పాడవలసినది.)

బేహాగ్ రాగము—ఏకతాళము.

ఆహా వాసంతశోభ, నరయుమా సఖా
వే హరించు వెతలనెల్లఁ బ్రియము గదురగా ఆహా.
2. ప్రివిమలమా విరిదేనియ, పానము సేయన్
గవలగూడి మధుపపాళి గానము సేయన్ ఆహా.
3. మల్లెమొల్లలసౌరభముల్ మదికి హాయిగా
చల్లనితెమ్మెరలఁగూడి సౌఖ్యమీయఁగా ఆహా.
4. పచ్చనిపత్రముల వృక్షపంక్తు లొప్పెడున్
హెచ్చగు పందిళ్లఁబోలె నింపుగూర్చెడున్ ఆహా.
5. శుకపికశారికరవములు శ్రుతులకింపుగా
ప్రకటితముగ మాధవు నుద్వాహముచాటగా ఆహా.
6. పండువెన్నెలగాయుచున్ బ్రపంచమంతయున్
వెండిపూతగానుదోప విరిసె నెంతయున్ ఆహా.

(19 వ పేజీలో సీసపద్యముతరువాత ప్రథముఁడు పాడవలసినది.)

2. మాయామాళవగౌళ—త్రిశగతి.

ఎంతకష్ట మెంతకష్టము, ఈకరువుబాధ ఎంత.
పంటలన్న మఱచినాము, పాడియన్న వెఱచినాము
వంటపొయ్యిలెల్ల బూజుపటియుండె నయ్యయో ఎం.
2. తిండిలేకయున్నగాని దేహశుద్ధి చేసికొనగ
దండిగాను త్రాగి మనగ దయనొసంగు నీరుమాకు ఎంత.

(21 వ పేజీ ఆఖరున "పోయిపచ్చెదము "అను దానితరువాత

రైతు పాడవలసినది.)

3. కీరవాణి—ఆదితాళము.

సెలవీయుమా, శీఘ్రమ్ముగాను సెల.

కలకాలముపకారమైనరీతిగాఁజేయవిభునిగాంఛింపుమాకై. సె

2. సతిధర్మములను సర్వమెఱుఁగునీకుఁ

జాలగాను జెప్పఁజాలమమ్మ మాకు సెల.

(24 వ పేజీలో ఇంద్రుఁడు ఆరంభములో పాడవలసినది.)

4. హిందుస్తానీకాఫీ—మిశ్రగతిరూపకము.

అకటా ధాతయే, యన్యాయంబుగా

ప్రవర్తింపగా, పాపెవ్వరో అక.

2. వరారోహనన్ వరింపంగ నెంచన్

దురాలోచనన్ దూరంబుచేసెన్ అక.

3. సురాధీశ్వరున్ నన్ నరుం డిట్లుచేయన్

శరీరంబిటుల్ శక్యంబెతాల్పన్ అక.

(26 వ పేజీలోపద్యముతరువాత నింద్రుఁడు పాడవలసినది.)

5. జంఝూటి—ఝుల్వా.

అహా, యహల్యహాయలు మఱువ నలవిగాదుగా

సహజంపురూపసంపదచేఁ జాలమీఱుగా అహా.

2. సరసంపువాక్య ఫణితిగీతసరణి నింపగున్

చిఱునవ్వువెన్నెలల మనంబు సేదదీఱెడున్ అహా.

(39 వపేజీలో ఇంద్రుఁడు "నాహరిణాంకవదన యహల్య"

యనుమాటలతరువాత పాడవలసినది.)

6. ఫీల్వా—ఏకతాళము.

కన్నులుగలభాగ్యము నేటికి నేగాంచగల్గితి ధన్యుఁడనై

యన్నులమిన్న మొదర్శనీయమీయఖిలసృష్టిలో నెన్నికయై. క.

2. కాంచినమాత్రమె గలదే సౌఖ్యముకాంతననుఁ గనియేమునునో
పంచశరుఁడు విల్వంచెడునప్పుడె భాగ్యం బెట్టులగననౌనో. క.
(43 వ పేజీలో "అహో ఏమి యీమూర్ఖత" అనుమాటలకు
ముందు అహల్య పాడవలసినది.)

7. కుంతలవరాళి—ఆదితాళము.

సరిసరి తగునా సురనాథా
యరయ కిటులవాదా నాతో సరి.
2. పరభామినులఁ బడయఁగనెంచుట
సురకృత్యమొ యాసురకృత్యమొ గను సరి.
3. ముల్లోకములఁ బూజ్యతగను నీ
వుల్లంఘితువె యుక్తమార్గమిటు సరి.
(పైదిపాడినతరువాత వెంటనే యింద్రుఁడు పాడవలసినది.)

8 జంఝూటి—ఏకతాళము.

ఇంతకఠినమా యింతిరో నామెడ నింతయు దయలేదా
సంతతంబునాస్వాంతమునఁ వసియింతువీవెకాదా ఇం.
2. కంతుఁడు నన్నిటు కాఁటియవెట్టఁగ గాంతరోయిటులాడఁగా
న్యాయమెనీకు ఇం.
వంతమేల నీపాలబడితినన్ బాలముంచెదవోనీటుముంచెదో. ఇం
(44వ పేజీలో 'ఛీదురాత్మ' అనుమాటలముందు అహల్యపాడవలసినది)

9. హిందుస్తానితోడి—ఆదితాళము.

అహ॥ ఔర, ఎంతసాహసము, పో, పో రా
సురపతివని గౌరవమున జూచినందులకింత నన్ను
చులుకజేసి కాఁటులాడజొచ్చితీవు నయమువీడి ఔర.
ఇంద్ర॥ ఏల కాలహరణ మిటుల నింతిచేసెదు
మదనుఁ డెంతొ యదయుఁడగుచు బదునగుశరములబరపెదు

గదిసి శిక్షచేయరా కాంత క్రోధమాయనట్లు ఘోర.

(47 వ పేజీలో సీసపద్యముతరువాత యిందు క్రిందు పాడవలసినది.)

10. మలయమారుతము—ఆదితాళము.

ఎన్నో కల్గిన, హృదయశాంతియేది ఎన్నో.

సన్నుతాంగియొకతె సరసలేకయున్న ఎన్నో.

2. కాంతానివహములు, కల్పవృక్షములును

చింతామణియును, స్థిరయౌవనంబు

సంతసంబునిడగఁ జాలకుండెమదిని

కాంతాహల్య యొకతెగాని యొండులేక ఎన్నో.

(49 వ పేజీలో శచీదేవి నిష్క్రమించుచు పాడవలసినది)

11. కమాసు—మిశ్రగతి.

ఏమిసేతునుయాదునో, హృదయేశునకు ఏమి.

ఎంతజెప్పినగాని ఋషిపత్నిపై గల

భ్రాంతివీడడాయె బ్రతుకెట్లు గనడాయె ఏమి.

చెప్పిచూచుటగానె చేయింపనావశమె

యుప్పరమేశ్వరునె తప్పింపధ్యానింతు ఏమి.

(70 వ పేజీలో దశరథుఁడు "అందుచే సంశయించుచుంటిని"

అను మాటలతరువాత పాడవలసినది.)

12. ఫీల్వా—మిశ్రగతి.

రామునిబాయుట ప్రాణముబాయుట

గానమ్ముమ్ము తేజోనిధిగురువర రాము.

2. కాకపక్షములతో గ్రాలు ముద్దుమోము

నేకరణిని త్యజియింపగనోపుదును రాము.

3. లేకలేకయొకన్న యీకొమరులబాసి

సాకేతపురి నెట్లు చరియింపఁగలవాఁడ రాము.

(77 వ పేజీలో "ఛీ-ఛీ" యనుమాటలకు ముందు
రాముఁడు చదువవలసినది.)

13. బ్యాండుస్వరముమాదిరి—శంకరాభరణము.

రాము॥ ఓరా, క్రూరా, ఘోరా, కార
నీ శరీర మిదె యొక శరమునఁ గూల్చెద ఓరా.
దురాత్ముండవై దుండగములఁ జేసి
పొరింబొరిగ ఋషిముఖ్యుని యాగము
చెఱిచెదవా, ఓతులువా
ఖరాసి నీతల ఖండించెదగను ఓరా.

మారీ॥ బాలుఁడవని నినుబాటిసేయకయె
జాలముచేసిన మూలమునన్
అఱచెదవా, యెఱుఁగుదువా
లములో నీప్రాణము నేగొనుటను ఓరా.

(82 వ పేజీలో "మహాప్రసాదము" అనుమాటలతరువాత
రామలక్ష్మణులు పాడవలసినది.)

14. కీరవాణి—ఏకతాళము.

మహనీయముతో విద్యలనొసఁగియు మమ్ము మన్నితివో
మానీంద్రా మహ.

2. బహుకష్టములనుబడయక క్షణములో, కరగతముగ
విద్యగఱపిన నీదౌ
మహిమనుగొనియాడ మాకును శక్యమె
వందనశతము లర్పణ మొనరింతుము మహ.

(93 వ పేజీలో "ధన్యురాలనైతిని" అనుమాటలతరువాత
అహల్య పాడవలసినది.)

15. సురట—ఆదితాళము.

నా భాగ్య మేభాగ్యము—ఆహా నాభాగ్య.

2. అనవరతముపతి యడుగుదమ్ములను
కొల్వగదొరికెను కోరికదీరెను నాభా.
3. అఘములువాసెను ఆనందమాయెను
రఘుపతియౌ శ్రీరాముని గాంచితి నాభా.

సరస్వతీ పవర్ ప్రెస్,

రాజమహేంద్రవరము.

ఈముద్రాయంత్రము భాషాగ్రంథములు తెలుఁగు—సంస్కృతము—అరవము—ఇంగ్లీషుభాషలలో ముద్రింపఁ దలఁచువారికి మిక్కిలియనువుగ నుండును. ఇందు పుస్తకములు చక్కఁగ సంస్కరించుపండితులు గలరు. మిక్కిలిచక్కఁగా ముద్రింపఁ దలఁచువారందఱునీముద్రాయంత్రమున దమగ్రంథములు ముద్రించుట మంచిది.. మఱియు నితరము లగునచ్చుపను లన్నియు నిందు మిక్కిలిబాగుగఁ జేయఁబడును. అన్నిరకములఅచ్చుపనులు, ఎంగ్రేవింగుపనులు, బైండింగుపనులు మిక్కిలిసుందరముగాఁ జేయఁబడును.

విశేషాంశములు తెలిసికొనగోరువారు:—

శ్రీఅద్దేపల్లి లక్ష్మణస్వామినాయఁడుగారు,

సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరము,

అని వ్రాయనగును.

ఇందీవరకు ప్రకటింపఁబడిన గ్రంథములు:—చిత్రపటశోభితము.

ప్రేమసుందరి — నవరసభరితమగు సాంఘికనవల క్యాలికోబయిండు 272 పుటలు వెల చందాదారులకు రు 1-0-0 ఇతరులకు రు 1-8-0.

చోరశిఖామణి — లోమహర్షకమగు డిటెక్టివునవల క్యాలికోబయిండు 197 పుటలు వెల చందాదారులకు రు 1-0-0 ఇతరులకు రు 1-8-0.

లక్ష్మీప్రసాదము — నవరసభరితమగు సాంఘికనవల. ఇందుమూఢురాండ్రగు స్త్రీలవలన కుటుంబములందు సంభవించు కలహములును నాకలహములవలనఁ గలుగు కష్టపరంపరలు చక్కఁగా వర్ణింపఁబడినవి. క్యాలికో బయిండు 346 పుటలు వెల చందాదారులకు రు 1-0-0. ఇతరులకు రు 1-8-0.

హత్యారహస్యము — జటిలమగు ఇతివృత్తముగల డిటెక్టివునవల. తుదివరకు దోషులెవరో కనుగొనుటకువీలులేకుండునటుల వంచకులు పన్నినపన్నాగము లత్యంత భయంకరములు. వెల చందాదారులకు రు 1-0-0 ఇతరులకు రు 1-8-0.

ఫాస్టు — (ప్రథమభాగము) అధికారదుర్వినియోగము-అభేద్యములైనకోటలందు దురాచారుల దురంతములు-మహాప్రళయము-రహస్యమువలన గలిగిన తీవ్రమనోవేదనము మున్నగు చిత్రవిచిత్రకల్పనా చమత్కృతులు గల యీసంపుటమున బ్రతిపుటయందు క్షణక్షణము పాఠకమహాశయుల జిత్తరువులఁ గావించుచుండును. వెల చందాదారులకు రు 1-0-0 ఇతరులకు రు 1-8-0.

ఫాస్టు — (రెండవభాగము) ఈశ్వరకృపాతిశయము, భక్తసంరక్షణము, భాగవతవిజయము, విమలప్రేమాభిరాములగు సాధుయువతీయువజనుల కల్యాణము మున్నగు నత్యద్భుత ఘట్టములు. వెల చందాదారులకు రు 1-0-0. ఇతరులకు రు 1-8-0.

—: అనుబంధ గ్రంథములు :—

మార్కండేయ — 3 గంటల కాలములో ప్రదర్శించుటకనువుగ వ్రాయబడిన భక్తిపూరితమగు 6 అంకముల నాటకము. చక్కని పాటలు గలవు. వెల చందాదారులకు రు 0-8-0. ఇతరులకు రు 0-12-0.

మృత్యురంగిణి — అనుబంధముగా ప్రకటింపఁబడిన డిటెక్టివు నవల. ఇది మోహపిశాచియగు యొకానొక సుందరియొక్క భయంకరకథ. నరహత్యా-నారీహత్యా-హత్యలు పైహత్యలు వెల చందాదారులకు 0-8-0 ఇతరులకు రు 0-12-0.

అభాగిని — బాలవితంతువుల పడుకష్టములు-దుండగులు పన్ను కుట్రలు-నమ్మకద్రోహము వర్ణింపఁబడిన నవరసభరితమగు సాంఘికనవల వెల చందాదారులకు 0-8-0 ఇతరులకు రు 0-12-0.

భద్రవేషి — ఇది చక్కని సాంఘికనవల వెల చందాదారులకు రు 0-8-0. ఇతరులకు రు 0-12-0.

కాంచనమాల — అశోకుని కాలము నాటి బౌద్ధమత ప్రచారముల తెలుపు నవల. కుణాల కాంచనమాలల సచ్చరిత్రము మిక్కిలి రామణీయకము వెల చందాదారులకు రు 0-8-0. ఇతరులకు రు 1-0-0.

ఇట్టివే చక్కని నవలలు పలువురు కవులచే రచింపఁజేసి రాబోవుమాసముల కొకటిగా ప్రకటింపఁబడుచుండును.

☞ 1924 వ సం॥ నవంబరు నెలలో వెలువడు పదునెనిమిదవ గ్రంథము

క్రాపవరపు నరసింహాముచే రచింపఁబడిన

సాంఘికనవల

"చిన్నకోడలు."

సరస్వతీ గ్రంథమండలి,

రాజమహేంద్రవరము.

Printed by A. L. Swamy at Saraswathi Power Press.—Rajahmundry.